నిజాల నిగ్గు తేల్చే
# చర్చ
తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను
ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 20
మంగళవారం, అక్టోబర్ 14, 2025 , పేజీలు - 12 వెల: 2/-

## కొత్త మద్యం పాలసీపై పిటిషన్

- విచారణ 2వారాలకు వాయిదా

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్13:** తెలంగాణలో కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశాడు. ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షల రుసుం పెట్టారని పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశాడు. లాటరీలో షాపు దక్కకపోతే రూ.3 లక్షలు అబ్కారీ శాఖకే వెళ్తాయని.. డబ్బును తిరిగిచ్చేలా ఆ శాఖను ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశాడు. లిక్కర్ పాలసీపై జారీ చేసిన జీవోను కొట్టివేయాలని కోరాడు. దీనిపై ఆబ్కారీశాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.





## శాంతి ఒప్పందంలో బందీల విడుదల

- స్వాగతించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికలో భాగంగా సజీవంగా ఉన్న 20 మంది ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడుదల చేయడాన్ని ప్రధాని మోదీ స్వాగతించారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రెండేళ్లకు పైగా హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలను స్వాగతిస్తున్నాం. బందీల స్వేచ్ఛ.. సంబంధిత కుటుంబాల ధైర్యానికి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్థిరమైన శాంతి ప్రయత్నాలకు, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దృఢ సంకల్పానికి గుర్తింపుగా నిలుస్తోంది. మిగతా2లో...

## సంక్షేమ హాస్టళ్లకు సత్వర చికిత్స

**హాస్టల్ వ్యవస్థలో అకౌంటబిలిటీ రావాలి**
**విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ఫేస్ రికగ్నేషన్**
**టెక్నాలజీ ద్వారా విద్యార్థులకు అందించే భోజనంపై క్వాలిటీ చెక్**
**సంక్షేమ హాస్టళ్ల పనితీరుపై అధికారులతో సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష**





**హైదరాబాద్,అక్టోబర్13:** రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పూర్తిస్థాయి డేటాతో సంక్షేమ హాస్టళ్ల వ్యవస్థలో అకౌంటబిలిటీ ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. హాస్టళ్లలో విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని పూర్తిగా ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. వివిధ సంక్షేమ విభాగాల ఉన్నతాధికారుల తో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ విభాగాల మిగతా2లో...

## కరూర్ తొక్కిసలాట ఘటన

**సిబిఐ విచారణకు సుప్రీం ఆదేశం**
**జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు**


2లో

## యుద్ధవిరమణ వేళ ఇజ్రాయిల్‌లో ట్రంప్ పర్యటన

**పార్లమెంటులో ప్రసంగం..స్వాగతించిన ఎంపిలు**
**ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ అభినందనలు**
**అమెరికా అండ ఎల్లవేళలా ఉంటుందని హామీ**


2లో

## అద్భుతంగా మేడారం అభివృద్ధి




**గడువు లోగా పనులు పూర్తి చేయాల్సిందే**
**మంత్రి సీతక్కతో కలసి మేడారం పనులపై సమీక్ష**
**70 కోట్ల కాంట్రాక్ట్ కోసం కక్కుర్తి పడే మనిషిని కాదు**
**మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి వ్యాఖ్య**

**ములుగు,అక్టోబర్13:** మేడారం అభివృద్ధికి రూ.212 కోట్ల నిధులతో మాస్టర్ ప్లాన్ రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మిగతా2లో...

## రాహుల్ ఓట్ చోరీ వ్యాఖ్యలపై విచారణ

- పిల్‌ను తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం
- ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలన ఆదేశం

**న్యూఢిల్లీ,అక్టోబర్ 13:** రాహుల్ చేసిన ఓట్ చోరీ వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరు తూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాహుల్ ఆరోపణలపై విచారణకు మాజీ జడ్జి సారథ్యంలో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారంనాడు తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్ ను ఆశ్రయించాలని



పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని పిటిషనర్ మిగతా2లో...

## ఇచ్చిన హామీలకు రేవంత్ మంగళం

- వారికి చెక్ పెట్టాలంటే బిఆర్ఎస్ గెలవాలి
- కారు-బుల్డోజర్ ఫైట్‌లో మనదే గెలుపు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,అక్టోబర్13:** బుల్డోజర్ పాలనను అడ్డుకోవడానికి కారుకు ఓటేయాలని కెటిఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలనే ఆకాంక్ష ప్రజల్లో ఉందని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో మన గెలుపు ఖాయం, మెజార్టీ తెచ్చుకోవడమే మన చేతుల్లో ఉందని తాజాగా జరిగిన సభలో ఆయన వ్యాఖ్యానించారు. ఈ నెల రోజులు ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ చేసిన మోసం ప్రజలకు చెప్పాలని.. కారు, బుల్డోజర్ మధ్య యుద్ధం జరుగుతుందని, రాష్ట్రం అంతా జూబ్లీహిల్స్ వైపు చూస్తోందని ఆయన అన్నారు. అలాగే అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇస్తామని రేవంత్ రెడ్డి ఒక కాగితం ఇచ్చాడు. కానీ, కోర్టు కేసులో ఉన్న అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ రావడం మిగతా2లో...

## ఐపిఎస్ అధికారి పూరన్ కుటుంబానికి భట్టి పరామర్శ



**న్యూఢిల్లీ,అక్టోబర్ 13:** చండీ ఘడ్‌లో ఆత్మహత్య చేసుకున్న దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం పరామర్శించారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. మిగతా2లో...

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

**21 వరకు నామినేషన్ల స్వీకరణ**
**22న నామినేషన్ల పరిశీలన**
**24న నామినేషన్ల ఉపసంహరణ గడువు**



2లో



2లో

## లంచం తీసుకుంటే చూస్తూ ఊరుకోం

- సివిల్ తగాదాల్లో తలదూరిస్తే కఠిన చర్యలు
- రాష్ట్ర పోలీస్ సిబ్బందికి డిజిపి హెచ్చరిక

# అద్భుతంగా మేడారం అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

నిధులు ఎక్కువైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాంమని, మేడారంలో భక్తులకు అన్ని రకాల సదుపాయాలు ఉండాలని సూచించారు. అభివృద్ధి పనులపై అందరి సూచనలు తీసుకుంటాం. కేవలం ప్రాంగణం అభివృద్ధి కోసమే రూ.101 కోట్లు కేటాయించామన్నారు. ఎంత ఖర్చయినా సరే.. మేడారం ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం అని తెలిపారు. మేడారం అభివృద్ధి పనులను మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. మేడారం గద్దెల ప్రాంగణ పునర్నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రత, రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఆధునీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు మంత్రి. 90 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అన్నారు. రాతి కట్టడాలకు కావల్సిన గ్రానైట్ పొరుగు రాష్ట్రాల నుండి తెప్పిస్తున్నట్లు చెప్పారు. శాశ్వత ప్రతిపాదకన పనులు చేస్తున్నామని అన్నారు.ఆదివాసీల ఆచార సంప్రదాయాలకు విఘాతం కలుగకుండా నిర్మాణాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. గత జాతరకు కోటిమంది భక్తులు హాజరయ్యారని.. ఈసారి భక్తుల సంఖ్య డబుల్ అవుతుందని అంచనాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇక ఇటీవల తనపై వచ్చిన విమర్శలపై కూడా మంత్రి పొంగులేటి స్పందించారు. నేను ఏంటో అందరికీ తెలుసు. రూ.70 కోట్ల కాంట్రాక్టు కోసం తాపత్రయపడే అవసరం లేదు. నాపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మబుద్ధి కావడం లేదు. నా మీద ఫిర్యాదు చేయడానికి అసలు ఏం ఉంది. సీతక్క, సురేఖ ఇద్దరూ సమ్మక్క-సారక్కలాగ పనిచేస్తున్నారని పొంగులేటి అన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అయితే తన శాఖలో, వరంగల్ జిల్లా రాజకీయాల్లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పెత్తనం చేస్తున్నారని, ఆయన జోక్యం మితిమీరుతోందని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి శనివారం కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని మంత్రి పీఆర్ఓ మీడియాకు ఒక ప్రకటనలో తెలిపిన విషయం తెలిసిందే.

# లంచం తీసుకుంటే చూస్తూ ఊరుకోం

**హైదరాబాద్, అక్టోబర్ 13:** పోలీసులు లంచగొండులుగా మారినా, సివిల్ తగాదాల్లో తలదూర్చిన కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లలో సివిల్ వివాదాలకు తావు లేదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. సివిల్ వివాదాల కోసం సివిల్ కోర్టులు ఉన్నాయని వివరించారు. పోలీస్ స్టేషన్ అడ్డాగా సివిల్ పంచాయితీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. సోమవారం రాష్ట్ర పోలీస్ సిబ్బందికి డీజీపీ శివధర్ రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలని డీజీపీ ప్రస్తావించారు. యూనిఫాం, అవినీతి ఒకే దగ్గర ఉండవని తేల్చి చెప్పారు. ఒక్క పోలీస్ అధికారి అయినా లంచం తీసుకుంటే డిపార్ట్‌మెంట్ మొత్తానికి చెడ్డ పేరు వస్తుందని చెప్పుకొచ్చారు. డిపార్ట్‌మెంట్‌లో లంచం తీసుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది వెల్ఫేర్ తన వ్యక్తిగత ప్రయారిటీ అని చెప్పుకొచ్చారు. ఫెయిర్ అండ్ ఫ్రెండ్లీ, ప్రొఫెషనల్ పోలీ సింగ్ తన ఫిలాసఫీ అని నొక్కిచెప్పారు డీజీపీ శివధర్ రెడ్డి. కేసు ల విషయంలో బేసిక్ పోలీసింగ్‌తో పాటు టెక్నాలజీని వాడాలని సూచించారు. పేద ప్రజలు ఆపదలో ఉంటే పోలీసులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆపదలో ఆదుకున్న వాళ్లని పేదలు ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# యుద్ధవిరమణ వేళ ఇజ్రాయిల్‌లో ట్రంప్ పర్యటన

**టెల్అవీవ్, అక్టోబర్ 13:** హమాస్‌తో యుద్ధ విరమణను స్వాగతిస్తూ, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసించారు. థాంక్యూ వెరీమచ్ బీబీ, గొప్పపని చేశావని ప్రధాని బెంజమిన్ నెతన్యాహును పొగిడారు. రెండేళ్లుగా తమ చెరలో ఉన్న బందీలను హమాస్ విడిచిపెట్టిన తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ దేశ చట్టసభలో మాట్లాడుతూ.. మధ్యప్రాచ్యంలో సరికొత్త చరిత్ర ఉదయిస్తోంది. ఈ పవిత్ర భూమిలో శాంతి వీచికలు వీస్తుండగా ఆకాశం నిర్మలంగా మారింది. తుపాకులు మూగబోయాయి. ప్రస్తుతం అమెరికాలో ఉన్న స్వర్ణయుగం ఇజ్రాయెల్‌లో ప్రారంభమైంది. బందీలు తిరిగివచ్చారు. ఈ మాట చెప్పడం ఎంతో బాగుంది. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి మేం సమయాన్ని వృథా చేస్తున్నామని చాలామంది అన్నారు. కానీ మేం సాధించాం అని ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచయుద్ధంలో యూదులపై నాజీలు సాగించిన నరమేధం హోలోకాస్ట్ తర్వాత యూదులపై జరిగిన అత్యంత దారుణంగా 7 దాడులను అభివర్ణించారు. అమెరికా ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని బాధిత కుటుంబాలను ఉద్దేశించి పేర్కొన్నారు. అలాగే మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక రాయబారిగా ఉన్న స్టీవ్ విట్కాఫ్, తన అల్లుడు, సలహాదారుడు జేర్డ్ కుష్నర్‌ను ఈ సందర్భంగా కొనియాడారు. ఇజ్రాయెల్- హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో వీరు కీలకపాత్ర పోషించారు. అయితే ట్రంప్ మాట్లాడుతోన్న సమయంలో కొందరు ఎంపీలు నిరసన వ్యక్తంచేశారు. మారణహోమం అంటూ నినాదాలు చేశారు. దాంతో వారిని చట్టసభ నుంచి బయటకు పంపివేశారు. ఈ నిరసనలపై ట్రంప్‌నకు స్పీకర్ క్షమాపణలు చెప్పారు. ఈ వ్యవహారమంతా గమనించిన ట్రంప్.. సమర్థవంతంగా పనిచేశారని చమత్కరించారు. దాంతో సభ్యులంతా చిరునవ్వులు చిందించారు. ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో కలిసి జెరూసలెంలోని చట్టసభకు వెళ్లారు. అక్కడ ఇజ్రాయెల్ చట్టసభ్యులు అగ్రరాజ్య అధ్యక్షుడికి ఘన స్వాగతం పలికారు. కాల్పులు ఒప్పందం చేసినందుకు గానూ.. రెండున్నర నిమిషాలు పాటు లేచి నిలబడి కరతాళధ్వనులతో కృతజ్ఞతలు తెలియజేశారు. ఇజ్రాయెల్‌కు అమెరికా ఎప్పుడూ తోడుగా ఉంటుందని హామీనిచ్చారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో కాస్త గందరగోళం నెలకొంది. ట్రంప్ మాట్లాడుతున్న సమయంలో పాలస్తీనా-ఇజ్రాయెల్ జాయింట్ పొలిటికల్ పార్టీకి చెందిన ఎంపీ ప్లకార్డు ప్రదర్శించారు. 'పాలస్తీనాను గుర్తించాలి' అంటూ నినాదాలు చేశారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, అక్టోబర్ 13:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల పర్వం మొదలయ్యింది. నామినేషన్లను స్వీకరించడానికి చివరి తేదీ అక్టోబర్ 21 మంగళవారంగా నిర్ణయించింది. . అలాగే నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 22 బుధవారం నాడు జరుగుతుంది. అభ్యర్థిత్వం ఉపసంహరణకు చివరి తేదీగా అక్టోబర్ 24 శుక్రవారంగా నిర్ణయించారు. పోలింగ్ నవంబర్ 11న నిర్వహిస్తారు. అలాగే ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరిపి అదేరోజు ఫలితం ప్రకటిస్తారు. అభ్యర్థులు తమ నామినేషన్లను షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. నామినేషన్లను ఫారం-2బిలో దాఖలు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి తప్పనిసరిగా ఫారం-26లో అఫిడవిట్‌ను సమర్పించాలి. అన్ని పత్రాలపై అభ్యర్థి సంతకం, నోటరీ సంతకం, నోటరీ సీల్‌తో నోటరైజ్ చేయాలి. అక్టోబర్ 19 ఆదివారం, అక్టోబర్ 20 దీపావళి తేదీల్లో పబ్లిక్ సెలవులు కారణంగా నామినేషన్లను స్వీకరించబడవు. ఇక ఈ ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థికి కనీసం 25 సంవత్సరాలు నిండి ఉండాలి. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు నియోజకవర్గానికి చెందిన ఒక్క ఓటరు ప్రపోజర్‌గా ఉండాలి. ఇతర అభ్యర్థులకు మాత్రం నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రపోజర్లుగా ఉండాలి. అలాగే సెక్యూరిటీ డిపాజిట్ విషయానికి వస్తే జనరల్ కేటగిరీకి రూ.10,000, ఎస్సీ/ఎస్టీ కేటగిరీకి కుల ధృవీకరణ పత్రంతో పాటు రూ.5,000 నగదు చెల్లించాలి.

# సంక్షేమ హాస్టళ్లకు సత్వర చికిత్స

(మొదటి పేజీ తరువాయి)

పనితీరు, పథకాల అమలుపై ఈ సమావేశంలో చర్చించారు. విద్యార్థులకు అందించే భోజనం క్వాలిటీ చెక్‌కు టెక్నాలజీని ఉపయోగించుకోవాలని.. విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన పౌష్టిక ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందించే దుస్తులు, పుస్తకాలు వారికి చేరుతున్నాయో లేదో ధ్రువీకరించాలని తెలిపారు. మౌలిక వసతులకు సంబంధించి ప్రతీ హాస్టల్‌లో పరిస్థితులపై పూర్తిస్థాయి డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని.. ఇందుకు అవసరమైన టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచనలు చేశారు సీఎం. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించేందుకు ప్రత్యేక విధానం అనుసరించాలన్నారు. ఇందుకు సంబంధించి ఏరియలవారీగా హాస్టళ్లను సమీపంలో ఉన్న మెడికల్ కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌తో లింక్ చేయాలని ఆదేశించారు. తరచూ హాస్టళ్లను సందర్శించి హెల్త్ చెకప్స్ చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి.. ప్రతీ నెలా గ్రీన్ ఛానల్‌లో నిధులు అందించేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పూర్తి డేటాతో సంక్షేమ హాస్టళ్ల వ్యవస్థలో జవాబుదారీతనం కనిపించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతను సాంకేతిక పరిజ్ఞానంతో తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి హాస్టల్‌లో మౌలిక సదుపాయాలపై పూర్తి స్థాయి డేటాను సాంకేతిక పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు

# జూబ్లీహిల్‌లో కాంగ్రెస్ గుర్తుతో మజ్లిస్ పోటీ

- బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరును ప్రజలు గుర్తించారు
- బిజెపికే గెలుపు అవకాశాల ఉన్నాయి
- నేడు అభ్యర్థిని ప్రకటిస్తామన్న రామచంద్రరావు



**హైదరాబాద్, అక్టోబర్ 13:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదలైంది. ఇందుకు సంబంధించి ప్రధాన పార్టీలు వారి అభ్యర్థుల ఖరారుపై సన్నాహాలు మరింత దూకుడును పెంచాయి. రాష్ట్ర బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ.. అనేక మంది విద్యావంతులు, మేధావులు బీజేపీలో చేరుతున్నారని.. మంగళవారం నాటికి జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు .అక్కడ కాంగ్రెస్ పోటీ చేస్తుందా, లేక మజ్లిస్ పోటీ చేస్తుందా అనేది ప్రజలు గమనించాలని ఆయన అన్నారు. ప్రస్తుతం మజ్లిస్ అభ్యర్థి కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేస్తున్నాడు. హస్తం గుర్తుతోనే పతంగిని ఎగరేస్తున్నారు. ఇది జూబ్లీహిల్స్ ప్రజలను మోసం చేయడమే అని అన్నారు. ఇకపోతే, జూబ్లీహిల్స్‌ను ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని.. అక్కడ ఒక్క ప్రభుత్వ కార్యాలయం కూడా లేదన్నారు. ఇంకా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని.. అవన్నీ 420 కేసులే అన్నారు. బీజేపీనే గెలిపించాలని ప్రజలను కోరుతున్నామని ఆయన అన్నారు. నిజమైన ప్రతిపక్షంగా మేమే కాంగ్రెస్‌ను నిలదీస్తాం అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, బిఆర్ఎస్ పార్టీలో గెలిచినవాళు ఆ పార్టీలో ఉంటారో లేదో తెలియదన్నారు.కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గతంలో మజ్లిస్ నుంచి పోటీ చేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మజ్లిస్ అధినేతను ఆయన కలిశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పాలనను జూబ్లీహిల్స్ ప్రజలు చూశారు. ఈ రెండు పార్టీలు నగరాన్ని అధ్వానంగా తయారు చేశాయి. విశ్వనగరం చేస్తామన్న భారత రాష్ట్ర సమితి.. విషాద నగరంగా మార్చింది.

# ప్రధాని మోడీతో చంద్రబాబు భేటీ

(మొదటి పేజీ తరువాయి)

జరిగే సీఐఐ సదస్సుకు ప్రధానిని చంద్రబాబు ఆహ్వానించారు. ప్రజాసేవలో 25 ఏళ్లు గడిచిన సందర్భంగా ప్రధానికి అభినందనలు తెలిపారు. జీఎస్టీ సంస్కరణలపై ఏపీ తరఫున ప్రధానికి కృతజ్ఞతలు చెప్పినట్లు భేటీ అనంతరం చంద్రబాబు చెప్పారు. ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇదిలావుంటే 16న సిఎం శ్రీశైలం పర్యటన ఖరారు అయ్యింది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

# శాంతి ఒప్పందంలో బందీల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు ట్రంప్ చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్నాం' అని పేర్కొంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ట్రంప్ ప్రతిపాదిత శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా ఇజ్రాయెల్, హమాస్‌లు ఇటీవల కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ క్రమంలోనే నేడు 20 మంది సజీవ బందీలను హమాస్ అప్పగించింది. 28మంది ఇజ్రాయెల్ పౌరుల మృతదేహాలను కూడా త్వరలోనే అప్పగించనుంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది.

# కరూర్ తొక్కిసలాట ఘటన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ఇటీవల కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ ఘటనపై సుప్రీం కోర్టు సిబిఐ విచారణకు ఆదేశించింది. ఈ ఘటనలో కనీసం 41మంది దుర్మరణం చెందారు. తమిళనాట ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశించింది. సీబీఐ దర్యాప్తునకు మద్రాసు హైకోర్టు నిరాకరించడంతో పిటిషనర్లు సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దర్యాప్తుపై పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటుచేసినట్లు తెలిపింది. కరూర్ తొక్కిసలాట నేపథ్యంలో పౌరుల ప్రాథమిక హక్కులపై జస్టిస్ జె.కె.మహేశ్వరి, ఎన్.వి.అంజరియాల తో కూడిన ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటన దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంది. దీనిపై అన్ని పార్టీలు వ్యక్తంచేస్తున్న అనుమానాలు తొలగాలంటే సమగ్ర దర్యాప్తు అవసరమని.. అందువల్లే ఈ కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రతినెలా కేసు పురోగతిని కోర్టుకు సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కరూర్ తొక్కిసలాట ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును విజయ్ ఇప్పటికే అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి అస్రాగార్గ్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటైంది. పోలీసుల దర్యాప్తు, అధికారుల పాత్రపై తాము ఇదివరకే ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. రాష్ట్ర పోలీసు అధికారులతోనే మద్రాస్ హైకోర్టు సిట్‌ను ఏర్పాటుచేసిందని టీవీకే తన పిటిషన్‌లో పేర్కొంది.

# రాహుల్ ఓట్ చోరీ వ్యాఖ్యలపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. రాజకీయ అంశాలకు కోర్టులను వేదిక చేసుకోవద్దని.. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని తేల్చి చెప్పింది. భాజపా, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదేవిధంగా ఓట్లు దొంగలించడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని.. బిహార్‌లో మాత్రం భాజపా, ఈసీని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని వ్యాఖ్యానించారు. కాగా రాహుల్ చేసిన ఆరోపణలు భాజపా నేతలు, ఎన్నికల కమిషన్ అధికారులు ఖండించారు. తాజాగా దీనిపై పిల్ వేయగా సుప్రీం తిరస్కరించింది. ఎన్నికల జాబితాలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయంటూ లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల పలు సందర్భాల్లో ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్, ఇతర నియోజకవర్గాల్లో ఎన్నికల జాబితా అవకతవకలపై ఆగస్టు 7న రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఉటంకిస్తూ న్యాయవాది, కాంగ్రెస్ సభ్యుడు రోహిత్ పాండే ఈ పిటిషన్ వేశారు. ఎన్నికల జాబితా సన్నాహకాలు, నిర్వహణ, పబ్లికేషన్ విషయాల్లో ఈసీ పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోర్టును ఆయన కోరారు. అర్థవంతమైన వెరిఫికేషన్, ఆడిట్, పబ్లిక్ స్క్రూటినీకి వీలుగా మెషీన్-రీడబుల్ ఫార్మెట్‌లో ఎన్నికల జాబితాను పబ్లిష్ చేయాలని కూడా కోరారు.

# ఇచ్చిన హామీలకు రేవంత్ మంగళం

(మొదటి పేజీ తరువాయి)

అసాధ్యం అన్న విషయం రేవంత్‌కే తెలుసునని ఎద్దేవా చేశారు. ఇది కేవలం ఓట్ల కోసమే చేస్తున్న రాజకీయ నాటకమని, గెలవలేక పక్క దారులు పడుతున్నారని ఆయంబ విమర్శలు గుప్పించారు. ఒక్క ఇంట్లోనే 40 దొంగ ఓట్లు రాయించుకున్నారని విమర్శించారు. గత ఎమ్మెల్యే గోపీనాథ్ మరణంపై ఆయన సంతాపం వ్యక్తం చేస్తూ.. ఆ కుటుంబం అనాథ కాదు. ఆ కుటుంబానికి మేమందరం అండగా ఉన్నాం. ఈరోజు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరం జూబ్లీహిల్స్‌లో వారికి బలం ఇవ్వడానికి వచ్చాం అని అన్నారు. ఇక జూబ్లీహిల్స్‌లో పోరు మొదలైందని.. ప్రజలు మన దిక్కు ఉన్నారని, నిజం మన దిక్కు ఉంది, ధర్మం మన దిక్కు ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ మోసం చేసినందుకు ప్రజలు స్వయంగా సమాధానం చెబుతారని.. మోసపోయిన ప్రజలు, ముఖ్యంగా మహిళలు, ఈసారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే సమయం వచ్చిందని పేర్కొన్నారు.

# ఐపిఎస్ అధికారి పూరన్ కుటుంబానికి భట్టి పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం పూరన్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్, కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డితో భట్టి ఫోన్‌లో మాట్లాడించారు. సీఎం రేవంత్ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారని.. పూరన్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారని ఈ సందర్భండి భట్టి విక్రమార్క తెలిపారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను పరామర్శించడానికి వచ్చిన హర్యానా చీఫ్ సెక్రటరీ అనురాగ్ రస్తోగితో డిప్యూటీ సీఎం విక్రమార్క మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి సూసైడ్ నోట్ ఆధారంగా ఎంత పెద్ద వాళ్ళు ఉన్నా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించి పూరన్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

నిజాలు నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
అక్టోబర్ 14, 2025



## త్వరితగతిన జడ్పి కాంప్లెక్స్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- జడ్పి కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్




కరీంనగర్.పెద్దపల్లి, అక్టోబర్ -13 : త్వరితగతిన ఆరు నెలలోగా జడ్పి కాంప్లెక్స్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపెల్లి తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మాణం అవుతున్న జడ్పి కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జడ్పీ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నాణ్యతతో జరగాలని, నిర్దేశిత గడువు ఆరు నెలల లోగా నిర్మాణ పనులు పూర్తి కావాలని అన్నారు. జెడ్పీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నాణ్యతలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జడ్పీ సీఈఓ నరేందర్, ఈఈ పంచాయతీరాజ్ గిరీష్ బాబు, తహసీల్దార్ రాజయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## “ప్రజావాణి”కి 271దరఖాస్తులు



చర్చ :- కరీంనగర్ : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. 271 అర్జీలు రాగా సత్వర పరిష్కారం కోసం వాటిని వివిధ శాఖల అధికారులకు బదిలీ చేశారు. పెండింగ్ దర ఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశి ంచారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మునిసిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

## యూనిసెఫ్ కార్యక్రమాలపై సమీక్ష



చర్చ :- కరీంనగర్ : యూనిసెఫ్ సహకారంతో రానున్న రోజుల్లో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా జిల్లాలో చేపట్టే వివిధ కార్యక్రమాలపై ఆ సంస్థ అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమావేశమయ్యారు. ఈనెల 15న గల గ్లోబల్ హ్యాండ్ వాష్ డే, స్వచ్ఛ హరిత విద్యాలయాల నమోదు, అంగన్వాడీలు, ఆరోగ్య కేంద్రాల్లో తాగునీరు, పారిశుధ్యం మెరుగుపరచడం వంటి విషయాలపై ప్రతినిధులతో చర్చించారు. జిల్లాలో పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. స్వచ్ఛ హరిత విద్యాలయాల నమోదులో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో విజయవంతంగా సాగుతున్న విటమిన్ గార్డెన్ గురించి తెలియజేయాలని అన్నారు.సమావేశంలో యూనిసెఫ్ వాష్ స్పెషలిస్ట్ ఆర్లికట్టి వెంకటేష్, కన్సల్టెంట్ ఫణీంద్ర, స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా సమన్వయ కర్తలు వేణు, రమేష్ పాల్గొన్నారు.

## ప్రపంచ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెన్నై తమిళనాడులో జరిగిన బోధి వరల్డ్ రికార్డ్



చర్చ :- కరీంనగర్ :ప్రపంచ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెన్నై తమిళనాడులో జరిగిన బోధి వరల్డ్ రికార్డ్ అధికారిక ప్రయత్నంలో పాల్గొని అప్రిసియేషన్ సర్టిఫికేట్ అందుకున్న అన్వర్ ఖాన్, ఆయన కుమారులు ఫర్హాన్ ఖాన్, అర్మాన్ ఖాన్‌లను టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. అన్వర్ ఖాన్ తన కుటుంబ సభ్యులను కరాటేలో ప్రావీణ్యం సాధించేలా తీర్చిదిద్దడమే కాకుండా, పేద విద్యార్థులకు స్వీయ రక్షణతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందించే శిక్షణ అందిస్తూ కరీంనగర్‌కు గౌరవం తెచ్చారని ఆయన పేర్కొన్నారు.కరాటే క్రీడలు పిల్లల్లో మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తినిస్తాయని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఓటమి వచ్చినప్పుడు ఎలా గెలవాలో, పడిపోయినప్పుడు ఎలా లేవాలో నేర్పే క్రీడ కరాటే అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సర్దార్ హరేమేందర్ సింగ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ రాజు, కోటేష్, మల్లేశం తదితర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.అన్వర్ ఖాన్ మరియు వారి కుమారులు ఫర్హాన్ ఖాన్, అర్మాన్ ఖాన్‌లను అభినందిస్తున్న ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి

## చికిత్స పొందుతూ వివాహిత మృతి



చర్చ, మణుగూరు: క్షణికావేశంతో పురుగు లమందు తాగి ఆత్మహత్య చేసుకున్న అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన దూదిమెట్ల సరిత (35) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. సరిత తన భర్తతో గొడవల కారణంగా వేరుగా ఉంటూ కొన్ని సంవత్సరాలుగా భద్రాచలంలోని పెట్రోల్ బంక్‌లో పని చేస్తుంది. సరితతో పరిచయం పెంచుకున్న స్థానిక సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రైవేటుగా అటెండర్‌గా పనిచేసే పోతురాజు గురుమూర్తి ఆమె దగ్గర డబ్బులు తీసుకోవడమే కాకుండా ఆమెను మానసికంగా ఇబ్బంది పెడుతుండేవాడు. దీంతో ఈనెల 11వ తేదీన మల్లెలమడుగులోని తన ఇంటి వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబ సభ్యులు

భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. మృతు రాలి సోదరుడు ఉడతల లింగమల్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అధికలోడుతో వెళ్తున్న ఇసుక లారీలను నియంత్రించాలి

- సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన టీడీపీ నాయకుల



చర్చ, భద్రాచలం:భద్రాచలం నుండి చర్ల వైపు వెళ్లే మార్గంలో అధిక లోడుతో ఇసుక లారీలు తిరగడం వలన రహదారులు గుంటలు ఏర్పడి ప్రజలు ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే చాలా నరకయాతనగా ఉందని తెలుగుదేశం పార్టీ మహబూబాద్ పార్లమెంటు అడహక్ సభ్యులు కొడాలి శ్రీనివాసన్, కుంచాల రాజారాం, సొసైటీ అధ్యక్షులు అబ్బినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు తాళ్లూరి చిట్టిబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట గారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దుమ్ముగూడెం, చర్ల తదితర ప్రాంతాల నుంచి పేషెంట్లు భద్రాచలం రావాలంటే చాలా ఇబ్బందికి గురవుతున్నారన్నారు. లారీల యజమానులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని, తక్షణం రోడ్ల మరమ్మతులు చేయాలని కోరారు. స్థానిక శాసనసభ్యుల డాక్టర్ తెల్లం వెంకటరావు కూడా ఈ విషయంలో సంబంధించి అధికారులతో మాట్లాడి లారీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రాజమండ్రి అచ్యుత రావు, చినిగిరి చిట్టిబాబు, కొడాలి చంటి, గున్నం రమేష్, కానమిల్లి రాఘవ, కొండవీటి చిరంజీవి, న్యాయవాదులు ఉజ్జగిరి రవితేజ, వలవల సురేష్ బాబు, కొత్తపల్లి రాంబాబు, కారం రమేష్, సోయం కామేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేబుల్ బ్రిడ్జి పైన రోడ్డును వేయాలి, లైటింగ్ ను ఏర్పాటు చేయాలి

- ముగ్గురు మంత్రులు ఉన్న కేబుల్ బ్రిడ్జికి అభివృద్ధికి,జిల్లాకు చేసింది గుండు సున్న.
- కేబుల్ బ్రిడ్జి వద్ద రోడ్డు గుంతలు ఉండటంతో ఇప్పటికి 15 ఆక్సిడెంట్ లు జరిగాయి, ముగ్గురు చనిపోయారు.
- ప్రభుత్వ నిర్లక్ష్యం నశించాలి, నగపలక సంస్థ, అధికారులు నిర్లక్ష్యం అవినీతి వల్లన రోడ్లు గుంతల మాయం.
- కేబుల్ బ్రిడ్జి చౌరస్థలో హైమస్ లైట్ లు ఏర్పాటు చేయాలి, చౌరస్తాను సుందరికరణ చేయాలి.
- స్మార్ట్ సిటీ అవినీతి పై సమగ్ర విచారణ చేయాలి.

కేబుల్ బ్రిడ్జి వద్ద రాస్తారోక





చర్చ :- కరీంనగర్ :అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు కేబుల్ బ్రిడ్జి పైన రోడ్డును వేయాలనీ , లైటింగ్ ను ఏర్పాటు చేయాలనీ స్మార్ట్ సిటీ పేరుతో జరిగిన అభివృద్ధిపై అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని.ఇతర సమస్యలు పరిష్కరించాలని రాస్తారొక, ధర్నా చేయడం జరిగింది.అనంతరం ఏఐఎఫ్ బి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్న కేబుల్ బ్రిడ్జికి అభివృద్ధికి చేసింది గుండు సున్న అని విమర్శించారు. పేరుకే మంత్రులు జిల్లాకు చేసింది ఏమీలేదని విమర్శించారు. కరీంనగర్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కేబుల్ బ్రిడ్జి మున్నాళ్ల ముచ్చటగా మారిందని ఎద్దవ చేశారు. కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు అవినీతి అక్రమాలతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నదని విమర్శించారు. కేబుల్ బ్రిడ్జి పైన, చౌరస్తాలో రోడ్లు గుంతలు ఉండటంతో ఇప్పటికి 15 ఆక్సిడెంట్ లు జరిగాయి, ముగ్గురు చనిపోయారనీ కానీ అధికాదరులకు ప్రజాప్రతినిధులకు పట్టింపు లేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం నశించాలి, నగపలక సంస్థ, అధికారులు నిర్లక్ష్యం అవినీతి వల్లన రోడ్లు గుంతలుగా మారిందని అన్నారు. కేబుల్ బ్రిడ్జి చౌరస్థలో హైమస్ లైట్ లు ఏర్పాటు చేయాలనీ, చౌరస్తాను సుందరికరణ చేయాలనీ డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీ అవినీతి పై సమగ్ర విచారణ చేయాలి డిమాండ్ చేశారు. అనంతరం యూత్ లీడర్ రాష్ట్ర నాయకులు ఆవుల ఆదిత్య మాట్లాడుతూ తీగల బ్రిడ్జి కి పట్టిన దరిద్రం పోవాలనీ గుమ్మడికాయతో దిష్టి తీయడం జరిగింది. కరీంనగర్ లో ప్రతిష్టాత్మంగా దక్షిణ భారతం లో 2 వ తీగల వంతెన నిర్మాణపనులు 2018 ప్రారంభం కాగా నత్తనడకన 2023 లో అసంపూర్తిగా జరిగిన నిర్మాణంతో హడావిడిగా ప్రారంభించారు. ఈ రోడ్ ప్రతి రోజునుండి రోడ్ సమస్యలు అసంపూర్తి ఫుట్పాత్ లతో నిరంతరం ఆక్సిడెంట్ లతో వార్తల్లో నిలుస్తుంది. ప్రతిష్ఠంకంగా చేపట్టిన పని మృత్యు హారంగా తయారైందనీ విమర్శించారు. వెంటనే రోడ్ పునర్నిర్మంచాలి అలాగే హామస్ లైట్స్ మరియు సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ సభ్యులు కె.బద్రి నేతపార్టీ నాయకులు సాయి అనురాగ్, ఆనంద్. శ్రవణ్, పవన్, రఘు , సాయి కిరణ్ రెడ్డి , సాయి కిరణ్ రావు , పవన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధ దంపతులపై హత్య మరియు హత్యాయత్నం కేసు నిందితుడు అరెస్టు బంగారం, నగదు, మత్తు మాత్రలు, మొబైల్ పోన్ స్వాధీనం




చర్చ :- కరీంనగర్ :కరీంనగర్ జిల్లా, గంగాధర పోలీసు స్టేషన్ పరిధిలోని గర్షకుర్తి గ్రామంలో ఇటీవల జరిగిన వృద్ధ దంపతులపై హత్యాయత్నం, హత్య కేసులో గంగాధర పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కత్తి శివ (37) ను అరెస్టు చేసి, అతని వద్ద నుండి దొంగిలించిన బంగారు ఆభరణాలు మరియు నేరానికి ఉపయోగించిన మత్తు మాత్రలను, సెల్ పోన్ ను స్వాధీనం చేసుకున్నారు.

**సంఘటన వివరాలు:**

గర్షకుర్తి గ్రామానికి చెందిన గజ్జల శంకరయ్య (76), అతని భార్య గజ్జల లక్ష్మి (70) అనువారు ఒంటరిగా ఉంటున్నారు.వారి ఇంటికి సమీపంలో ఉండే నిందితుడు కత్తి శివ అనునతను అప్పుడప్పుడు వారికి బయట నుండి మందులు, అవసరము ఉండే ఇంటి సామానులు తెచ్చి ఇచ్చి సహాయపడేవాడు. శివ ఈ మద్య ఆన్ లైన్ లో బెట్టింగ్ లు, పేకాట లాంటి వాటికి అలవాటు పడి, అప్పులు ఎక్కువ అయి, ఖర్చులు, జల్సాల నిమిత్తం డబ్బులు అవసరము అయి, గజ్జల శంకరయ్య మరియు లక్ష్మి లను చంపి, లక్ష్మీ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించాలని పథకం వేశాడు. కానీ వారిని డైరెక్ట్ గా హత్య చేస్తే దొరికిపోయి తనకు శిక్ష పడుతుందని, వారికి తెలియకుండా, వృద్దులు వాళ్ళకే ఏదో అనారోగ్యం వచ్చి చనిపోయారు అని క్రియేట్, చేసి, వాళ్ళు చనిపోయిన తరువాత బంగారం దొంగతనం చేయాలన్న ఉద్దేశ్యముతో, ప్లాన్ ప్రకారం తాను గతంలో ముంబైలో కల్లు దుకాణంలో పని చేస్తున్నప్పుడు, కల్లు దుకాణము యజమాని మత్తు కోసం కల్లులో కలిపే టాబ్లెట్లు ఎవరికి తెలియకుండా దాచుకుని, ప్లాన్ ప్రకారం తేదీ అక్టోబర్ 7, 2025 ఉదయం 08:30 గంటల సమయంలో, శంకరయ్య, లక్ష్మిలకు జ్వరం, జలుబు , దగ్గు మరియు ఒళ్లు నొప్పులు ఉన్నాయని తెలుసుకొని, వారి ఇంటికి తన దగ్గరున్న మత్తు మాత్రలు ఆ వృద్దుల వద్దకు తీసుకపోయి, ఇవి వేసుకుంటే మీ జ్వరం, జలుబు , దగ్గు మరియు ఒళ్లు నొప్పులు వెంటనే తగ్గుతాయని నమ్మించి, అ ఇద్దరు వృద్దులు ఒక్కొక్కరు ఆరు మాత్రలు చొప్పున మింగేలా చేశాడు. అవి మింగిన సుమారు రెండు గంటల తరువాత ఆ ఇద్దరు వృద్దులు మత్తులోకి అపస్మారక స్తితిలోకి వెళ్లిన తర్వాత, నిందితుడు వారి ఇంటికి వెళ్ళి, లక్ష్మి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించి పరారయ్యాడు. అనంతరం అదే రోజు గ్రామంలోని కట్ల శ్రీనివాసాచారి అనే గోల్డ్ స్మిత్ వద్ద ఆ బంగారాన్ని అమ్మి రూ.1,85,000/- నగదు తీసుకున్నట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు. ఆ బంగారం కొన్నటువంటి శ్రీనివాసాచారి వద్ద గతములో కత్తి శివ తన బార్య బంగారు నగలు అమ్మయినందున, అతను నమ్మి, ఆ బంగారం కొని, శివకు డబ్బులు ఇవ్వడం జరిగినది. బంగారం వ్యాపారి ఇచ్చిన డబ్బులు శివ తన అప్పులు తీర్చుకోవడం, పేకాట, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కోసం ఆ డబ్బును ఖర్చు చేసినట్లు తెలిపాడు. అపస్మారక స్థితిలో ఉన్న వృద్దులు శంకరయ్య మరియు లక్ష్మిని సాయంత్రం ఆసుపత్రికి తరలించగా, అక్టోబర్ 08, 2025 మధ్యాహ్నం శంకరయ్య చికిత్స పొందుతూ మరణించాడు. వృద్దురాలు లక్ష్మి ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగా ఉన్నది.

**నిందితుడి అరెస్టు, స్వాధీనం:**

నిందితుడు కత్తి శివ దేవయ్య, వయస్సు 37 సంవత్సరాలు, ఘర్షకుర్తి అనునతను ఈరోజు తేదీ 13.10.2025 నాడు ఉదయం మిగిలిన మత్తు మాత్రలను పారేయడానికి వెళ్తున్న సమయంలో పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించి, పారిపోతుండగా పట్టుకున్నారు.




**నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వివరాలు:**

- నగదు: రూ. 25,000/- (నిందితుడి జేబులో లభించింది)
- మత్తు మాత్రలు: 11 బ్లూ కలర్ కవర్ లో గల మత్తు మాత్రలు
- దొంగిలించబడిన బంగారం: 20 గ్రాములు 250 మిల్లీగ్రాముల బరువుగల బంగారు పుస్తెల తాడు (కట్ల శ్రీనివాస జ్యువెలరీ షాప్ యజమాని కట్ల శ్రీనివాసు నుండి)
- టెక్నో ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ మరియు సిమ్ కార్డు.

వ్యసనాలు, అప్పుల కారణంగానే నిందితుడు ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడిపై హత్య, దోపిడీ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించడం జరుగుతుంది. మొదట అనుమానాస్పద మృతిగా ఈ కేసును నమోదు చేసుకుని, డెటెక్ట్ చేయుటకు ఛాలెంజ్ గా తీసుకున్న పోలీస్ వారు శ్రీ విజయ కుమార్, ఏ.సి.పి రూరల్ గారి ఆధ్వర్యంలో, శ్రీ ప్రదీప్ కుమార్, ఇన్స్ పెక్టర్ ఆఫ్ పోలీస్, చొప్పదండి, శ్రీ వంశీకృష్ణ, ఎస్.ఐ ఆఫ్ పోలీస్ గంగాధర, చారి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ లు జంపన్న మరియు అరవింద్ లను కమిషనర్ ఆఫ్ పోలీస్కరీంనగర్ గారు అభినందించినారు.

## మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు

కరీంనగర్ :ఇల్లంతకుంట మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రా లను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే వరి ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వెల్లడించారు.సోమవారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్,చిక్కుడువానిపల్లి, అనంతారం ,ముస్కా నిపేట,గాలిపెల్లి, పొత్తూరు గ్రామాల్లో ఐకేపీ,సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది ధాన్యం మద్దతు ధర పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిందని, ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2,389, సాధారణ రకం రూ.2,369కు కొనుగోలు చేయాలని నిర్దేశించిన దృష్ట్యా దీని ప్రకారమే కొనుగోళ్లు చేపడుతున్నామన్నారు. వర్షాల సాకుతో దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వపరంగా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే లబ్ధిపొందాలన్నారు. ధాన్యాన్ని భద్రపరిచేందుకు వీలులేక పోవడాన్ని అదునుగా చేసుకున్న కొంత మంది దళారులు పొలాల వద్దే ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. దళారుల మోసాలకు గురికావొద్దని ఆయన రైతులను కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.





మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య-మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎనగందుల ప్రసాద్, పార్టీ నాయకులు రాజేశం, వీరేశం, రజనీకాంత్, కె.రాంప్రసాద్, వెంకటరెడ్డి,పసుల వెంకటి, అంతగిరి, తీగల పుష్పలత, జ్యోతి, సురేందర్ రెడ్డి, మామిడి రాజు, గొడుగు హరికుమార్, సంజీవ్, కె.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## పలు ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల భూమిపూజలో పాల్గొన్న సుడా చైర్మన్



కరీంనగర్ : ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అర్హత కలిగి మిగిలిపోయిన లబ్ది దారులకు కూడా ఇళ్లు మంజూరు చేస్తాం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికరీంనగర్ నగర శివారు ప్రాంతాలు బొమ్మకల్,ముగ్దుంపూర్ మరియు కరీంనగర్ రూరల్ మండలం లోని చర్లభుత్కూర్,చామన్ పల్లి గ్రామాల్లో పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు భూమిపూజ కార్యక్రమాలలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.అనంతరం నరేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఆనాడైన ఈనాడైన ఇందిరమ్మ రాజ్యంలోనే ఇళ్లు కట్టించడం జరుగుతుందని మిగితా ప్రభుత్వాలు మాటల వరకే పరిమితం అయ్యాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు .అర్హులై ఉండి ఇళ్లు మంజూరు కాక మిగిలిపోయిన ప్రతి ఒక్కరికి రాబోయే రోజుల్లో తప్పకుండా మంజూరు చేస్తామని నరేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమం లో బ్లాక్ అధ్యక్షులు సాయిని తిరుపతి, మండల్ అధ్యక్షులు కామరెడ్డి రాంరెడ్డి, %జ్యూఖఎం% వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు,మీసాల సాయిలు,గంగయ్య,నరసయ్య, కూర నరేష్ రెడ్డి,బుర్ర నారాయణ,రంగయ్య,జగ్గాని కనకయ్య,శంకరయ్య,బుర్ర గంగయ్య,రామస్వామి, దామోదర్ రెడ్డి, దిలీప్ రెడ్డి, బుసా సాయి,రాము, సుదర్శన్,బుర్ర హరీష్, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# భారీ వర్షం లోతట్టు ప్రాంతాలు జలమయం

- పొంగి ప్రవహిస్తున్న వాగులు... కూలిన డ్రెయినేజీలు
- ఓపెన్‌కాస్టులో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన అధికారులు






**చర్చ, మణుగూరు:** ఆదివారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి పినపాక నియోజకవర్గ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఉరుములు, మెరుపులతో ప్రజలు భయకంపితులయ్యారు. భారీ ఉరుముల శబ్దాలకు ఇళ్లలో ఉన్న ప్రజలు కూడా ఆందోళనకు గురయ్యారు. పిడుగులతో కూడిన భారీ వర్షం కారణంగా వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. సోమవారం ఉదయం వరకు కూడా వర్షం ఆగకపోవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎటుచూసినా వర్షం నీరే కన్పించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 9 గంటల ప్రాంతానికి కొంత తెరిపి ఇవ్వడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే వారు యదావిధిగా బయటకు వచ్చారు. మల్లారంలో కురిసిన వర్షాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్దకు వరద ప్రవాహం చేరుకుంది. గాంధీబొమ్మ సెంటర్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. శివలింగాపురం ప్రాంతంలో వరద ప్రవాహానికి డ్రెయినేజీ గోడ కూలడంతో నీళ్లన్నీ రోడ్డుపై పారాయి.

### నిలిచిపోయిన రాకపోకలు

రాత్రి నుండి కురిసిన వర్షాల నేపథ్యంలో రామానుజవరం, పగిడేరు వెళ్లే దారిలో వరద పోటెత్తింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అశ్వాపురం మండలం ప్రభుత్వ పాఠశాల పక్కన వాగు పొంగి ప్రమాదకరంగా ప్రవహించింది. పినపాక, కరకగూడెం మండలాల్లో కురిసిన వర్షాలకు పెద్దవాగు పొంగి ప్రవహించింది. కాగా మణుగూరు నుంచి రామానుజవరం నుండి వెళ్లే దారిలో రోడ్డుపై నుంచి వెళ్తున్న వరదప్రవాహాన్ని తహశీల్దార్ నరేష్, ఎంపీడీవో శ్రీనివాసరావులు పరిశీలించారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వాగులు పొంగే సమయంలో వాహనాలపై రాకపోకలు చేయవద్దని సూచించారు. ఇళ్లలోకి వరద నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. మణుగూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో ఇళ్లలోకి నీరు చేరడంతో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, తహశీల్దార్ నరేష్‌లు పరిశీలించి, హుటాహుటిన మున్సిపల్ సిబ్బందితో కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగింపచేశారు.

### ఓపెన్‌కాస్టులో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం..

భారీ వర్షాలు కురవడంతో మణుగూరు ఓపెన్‌కాస్టు గనిలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. సింగరేణి అధికారులు, కార్మికులు ఓపెన్ కాస్టు క్వారీలో చేరిన వరద నీటిని భారీ మోటార్లతో బయటకు పంపింగ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం నాటికి ఉత్పత్తి యధావిధిగా కొనసాగింది. ఉత్పత్తి నిలిచిపోవడంతో జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేసే పనిలో ఉన్నారు.

# కరీంనగర్ డీసీసీ అధ్యక్ష పదవి కోసం వెలిచాల రాజేందర్ రావు తరపున దరఖాస్తు..

- రాజేందర్ రావే డీసీసీ అధ్యక్ష పదవికి అన్ని విధాలా సమర్థుడు..




**కరీంనగర్ :** డిసిసి అధ్యక్ష పదవి ఎన్నిక కోసం ఏఐసీసీ పరిశీలకులు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావుకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ సోమవారం మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు డిసిసి కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు. డిసిసి పిఆర్ఓలు దొంతి గోపి, న్యాత శ్రీనివాస్ కు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మీడియాతో మాట్లాడుతూ 1981 నుంచి కాంగ్రెస్ పార్టీలో వెలిచాల రాజేందర్ రావు ప్రస్థానం మొదలైందని పేర్కొన్నారు. 1987 లో ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి యూత్ కాంగ్రెస్ లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. అదేవిధంగా రాజేందర్ రావ్ గుండి గోపాలరావుపేట సింగిల్ విండో చైర్మన్ గా, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా పనిచేశారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్టేట్ చాంబర్ ఆఫ్ మార్కెట్ కమిటీ అసోసియేషన్ చైర్మన్ గా, నెడ్ క్యాప్ గా డైరెక్టర్ పనిచేశారని చెప్పారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 2024లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థిగా రాజేందర్రావు పోటీ చేశారనీ, ఎన్నికల్లో మూడు లక్షల అరవై వేల ఓట్లు సాధించారని తెలిపారు. అతికొద్ది సమయంలోనే భారీ ఓట్లను సాధించి రికార్డు సృష్టించారని చెప్పారు. కరీంనగర్ ప్రజలకు రాజేందర్ రావు అందుబాటులో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారనీ, నీతి నిజాయితీగా వ్యవహరిస్తూ మంచి పేరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ సీనియర్ కాంగ్రెస్ నేత జగపతిరావు కరీంనగర్ అభివృద్ధి ప్రదాత అనీ, వారి తనయుడు జగపతిరావు అడుగుజాడల్లో నడుస్తూ తండ్రి ఆశయ సాధనకు కృషి చేస్తూనే, కరీంనగర్ ప్రజలకు అండగా ఉంటున్నారని తెలిపారు. అదేవిధంగా రాజేంద్ర రావు తల్లిదండ్రులు జగపతిరావు సరళాదేవి పేరిట సరల్ జగ్ అనే ట్రస్టును ఏర్పాటుచేసి పేద ప్రజలకు సాయం చేస్తున్నారని పేర్కొన్నారు. నీతిగా నిజాయితీగా సౌమ్యుడిగా వ్యవహరిస్తున్న వెలిచాల రాజేందర్ రావుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలు డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. రాజేందర్రావు డిసిసి అధ్యక్ష పదవికి అన్ని విధాల అర్హుడు అనీ, సమర్థుడని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయాలను అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని డిసిసి అధ్యక్షుడిగా రాజేందర్ రావును నియమించాలని అధిష్టానాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆకుల ప్రకాష్, ఆకుల నరసన్న, డిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకట రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వేల్పుల వెంకటేష్, గండి రాజేశ్వర్, ఉప్పరి రవి, శ్రావణ్ నాయక్, జువ్వాడి మారుతి రావు, బాషవేణి మల్లేశం పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిసిఐ కొనుగోలు కేంద్రాలు తక్షణమే ప్రారంభించాలి: నాగిరెడ్డి



**చర్చ, సత్తుపల్లి:** మోదీ ప్రభుత్వం విదేశీ పత్తి దిగుమతిపై సుంకం ఎత్తేసిన నేపథ్యంలో విదేశీ పత్తి మోజులో స్వదేశీ రైతుల పత్తిని కొనుగోలు చేయటానికి రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులు సాకులు వెతికే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు అఖిల భారత ఐక్య రైతు సంఘం కల్లూరు డివిజన్ కమిటీ అధ్యక్షులు ఒగ్గు నాగిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పత్తి కొనుగోలుకు సీసీఐ నిబంధనలు అమలు చేయలేమనే సాకుతో జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలు పత్తి కొనుగోలుకు తీవ్రమైన జాప్యం చేస్తున్నాయని ఆరోపించారు. జాబ్‌వర్క్ టెండర్లలో పాల్గొనకుండా మొండికేస్తున్నాయని, జిన్నింగ్ మిల్లర్లు, సీసీఐ అధికారులు చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. దీనివలన పత్తి రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది అధిక వర్షాలకు పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని, యావరేజ్ ఎకరానికి రెండు మూడు క్వింటాల కంటే దిగుబడి రాని పరిస్థితిలో రైతులకు కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. సీసీఐ కేంద్రాలు తెరవకపోవడం వలన దళారులు గ్రామాల్లో రైతులను నిలువు దోపిడి చేస్తున్నారని అన్నారు. క్వింటాకు రూ.4 వేల నుంచి రూ. 5 వేలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారని, ఒకవైపు దిగుబడి లేక మరొకవైపు ధర లేక రైతాంగం దివాళా తీసే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రి ప్రకటనలకే పరిమితం కాకుండా తక్షణమే జిన్నింగ్ మిల్లు యాజమాన్యాలపై ఒత్తిడి తెచ్చి సీసీఐ కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మిల్లుల యజమాన్యం ముందుకు రాకపోతే మార్కెట్ యార్డుల్లో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి రూ.8,110ల మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తునాగిరెడ్డి డిమాండ్ చేశారు.

# సిపిఎం సీనియర్ నాయకులు మాటేటి నారాయణ మృతి

- సంతాపం తెలిపిన జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** తుదిశ్వాస విడిచే వరకు మాటేటి నారాయణ ఎర్రజెండా నీడలో నడిచారని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ సీనియర్ నాయకులు మాటేడి నారాయణ అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం పాతకొత్తగూడెంలోని నారాయణ భౌతిక కాయానికి జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టు పార్టీ నాయకులకు సమాచారం, భోజనాలు అందించే పని నారాయణ చేశాడని తెలియజేశారు. వరంగల్ జిల్లాలో అజంజాహి కార్మికుల పోరాటంలోనూ, కొత్తగూడెం వచ్చాక ఇళ్ల స్థలాల పోరాటంలోనూ నారాయణ చురుకుగా పాల్గొన్నారన్నారు. 11 సంవత్సరాల వయసులో చేత పట్టిన ఎర్రజెండాను తన తుది శ్వాస విడిచే వరకు వదిలిపెట్టలేదని, నమ్మిన సిద్ధాంతం కోసం నారాయణ నిలబడ్డారని గురుతచేశారు. నారాయణ చూపిన ఎర్రజెండా బాటలో పయనించడమే ఆయనకు మనమిచ్చే నివాళి అని పేర్కొన్నారు. నివాళులు అర్పించిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ ,సీనియర్ నాయకులు కెహెచ్ ప్రసాద్, టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు నందిపాటి రమేష్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జునుమాల నగేష్, టౌన్ కమిటీ సభ్యులు ఆవుల శ్రీరాములు, నాగకృష్ణ, మహేశ్వరి, కొలిపాక వెంకటేశ్వర్లు, మున్నీ, కుటుంబ సభ్యులు ఉన్నారు.

# నాసిరకం పనులతో సైడ్ కాల్వల నిర్మాణం

- కట్టిన నెల రోజులకే కుప్పకూలిన కాలువ
- చోద్యం చూస్తున్న అధికారులు, పర్యవేక్షణ కరువు
- సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్



**చర్చ, మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో చేస్తున్న పలు అభివృద్ధి పనులు నాసిరకంగా, అధికారుల పర్యవేక్షణ లేకుండా ఇష్టానుసారంగా చేస్తున్నారని, ఇది ఇలానే కొనసాగితే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ హెచ్చరించారు. సోమవారం శివలింగాపురం గ్రామంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సుధాకర్, స్థానిక నాయకులు ఎస్.వి. నాయుడు, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్ గ్రామంలో పర్యటించి సైడ్ డ్రైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ద్వారా శివలింగాపురంలో సైడ్ డ్రెన్ నిర్మాణ పనులు ప్రారంభించారని, నెల గడవక ముందే, పనులు ఇంకా నత్త నడకన కొనసాగుతుండగానే, ఆదివారం కురిసిన వర్షానికి సైడ్ డ్రెయిన్ కొంత కుప్పకూలిపోయిందని అన్నారు. ఇది కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. నాసిరకం పనులు, అధికారులు పర్యవేక్షణ లోపంకారణంగా ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని ఆరోపించారు. లక్షల రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, అధికారుల నిర్లక్ష్యం మూలంగా కాంట్రాక్టర్లు ఇష్టమొచ్చినట్లు పనులు చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదని హెచ్చరించారు. రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరుగుతుందని భావించిన ప్రజలకు నాసిరకం పనులతో నిరాశ ఎదురవుతుందని, ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతున్నాయన్నారు. సీపీఐ కార్యాలయం నుండి ఆదర్శనగర్ సిమెంట్ రోడ్ నిర్మాణానికి లక్షల రూపాయల వెచ్చించినా, నాసిరకంగా వేశారని, 2 నెలలు కాకముందే రోడ్ అస్తవ్యస్థంగా తయారైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆధర్ల రాములు, ప్రవీణ్, రంగు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు దుస్థితిపై విద్యార్థుల ఆవేదన

## మా ఇక్కట్లు అధికారులకు పట్టవా




**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** కొత్తగూడెం పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో ఉన్న సెయింట్ మేరీస్ పాఠశాల ఎదుట రోడ్డు గత ఆరు సంవత్సరాలుగా దయనీయ స్థితిలో ఉంది. ఇటీవల మిషన్ భగీరథ పైపుల తవ్వకాలు చేసిన తరువాత రోడ్డు పూర్తిగా చిత్తడిగా మారింది. వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యార్థులు పాఠశాలకు రావడం, వెళ్లడం చాలా కష్టంగా మారింది. పిల్లలు ఒక చేతిలో బ్యాగులు, మరో చేతిలో బాస్కెట్‌లు పట్టుకుని అడుగు వేయాలంటే నాట్యం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. “ఎన్నాళ్లు మాకీ అవస్థలు?” అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు మారినా రోడ్డు పరిస్థితి మాత్రం మారడంలేదని స్థానికులు వాపోతున్నారు. పిల్లల ప్రాణాలను కాపాడే కర్తవ్యం ఎవరి బాధ్యత? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలి




**చర్చ, సత్తుపల్లి:** గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాల పిల్లలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఏసీడీపీఓ రత్తమ్మ సూచించారు. ఐసిడిఎస్ కల్లూరు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని చంద్రుపట్ల సెక్టార్ నందు ఎరబ్రోయినపల్లి గ్రామపంచాయతీ ఎరబ్రోయినపల్లి 4వ అంగన్వాడి కేంద్రం నందు సోమవారం పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రత్తమ్మ మాట్లాడుతూ పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల కొరకు పిల్లలకు మంచి అలవాట్లు, ప్రీ స్కూలు కృత్యాలు, కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. బరువు తక్కువ పిల్లల్ని గుర్తించి పోషణలోపం లేకుండా ఎన్.ఆర్.సి.కి రిఫర్ చేసి వైద్యుల పర్యవేక్షణతో బాలామృతం అందిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నప్రసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ సుజాత, పంచాయితీ సెక్రటరీ సైదులు, ఏఎన్ఎం ఉమారాణి, అంగన్వాడి టీచర్లు విజయలక్ష్మి, యశోద, ఆదిలక్ష్మి, సుమలత, ఆశా వర్కర్లు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# తోటి ఉద్యోగులకు రూ.66,600 ఆర్థిక సాయం

- మానవత్వం చాటుకున్న సింగరేణి ఎస్అండ్‌పిసి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్



**చర్చ, మణుగూరు:** తోటి ఉద్యోగులకు ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు మణుగూరు సింగరేణి ఎస్అండ్‌పిసి విభాగంలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్. సంస్థ నందు ప్రైవేటు సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న ఎం.రాజనర్సు, ఎం.విశ్వేశ్వరరావుల తండ్రి మాటేటి నరసయ్య మరణించగా, బి. రమేష్ బాబు తల్లి, తండ్రి ఇద్దరూ కేవలం వారంరోజుల వ్యవధిలోనే కన్నుమూశారు. వారికి మేము తోడుగా ఉన్నామంటూ ఆత్మీయతను తెలియజేస్తూ తోటి సెక్యూరిటీ గార్డ్స్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.66,600 ఆర్థిక సాయాన్ని అందించారు. సోమవారం అధికారుల సమక్షంలో ఎం. రాజనర్సుకు రూ. 16,900, ఎం. విశ్వేశ్వరరావుకు రూ. 16,900, బి. రమేష్ బాబుకు రూ.32,800 అందించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఎస్ అండ్ పిసి, జమిదారులు, ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్స్, రామవుతార్, డి.సుధాకర్, ఎస్.కె. రబ్బాని, ఎస్ అండ్ పిసి, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి: వెంకటరెడ్డి



**మణుగూరు:** ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రతి అర్హుడికి ఇల్లు ఇవ్వడం తన లక్ష్యమని, ఎల్చిరెడ్డిపల్లి గ్రామంలో ఒక్క ఇంటినీ మినహాయించకుండా అందరికీ ఇళ్లు అందేలా చూస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంగిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు.పినపాక మండలం ఎల్చిరెడ్డిపల్లి గ్రామపంచాయతీని సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశమై పలు అంశాలపై మాట్లాడారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజల అభివృద్ధి కోసం మాత్రమే తాము పనిచేస్తామని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చింది కానీ ఒక్కటీ నెరవేర్చలేదని, దొంగ హామీలతో ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మౌలిక సదుపాయాలు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు మద్దతు ధర కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు.

# న్యాయంచేయాలని మామిడిచెట్ల గుంపు కాలనీవాసుల ఆందోళన

- విధులకు వెళ్తున్న కార్మికులను అడ్డుకుని నిరసన
- నేడు బాధితుల సమస్యపై జిఎం కార్యాలయంలో చర్చ



**చర్చ, మణుగూరు:** సింగరేణి అధికారులు బ్రిడ్జి నిర్మించడం వలన తమ కాలనీ వర్షపు నీటిలో మునిగిపోతుందని, తమకు న్యాయం చేయాలని మణుగూరు మండలం సమితి సింగారం పంచాయతీ పరిధిలోని మామిడి చెట్ల గుంపు కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సోమవారం కూనవరం రైల్వేగేటు ప్రధాన రహదారిపై టెంట్ వేసుకొని కాలనీ వాసులు ధర్నా చేశారు. సెకెండ్ షిఫ్ట్‌కు వెళ్తున్న సింగరేణి కార్మికులను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ నిర్మించిన బ్రిడ్జి వలన వర్షం వచ్చినప్పుడు వరద నీరు తమ ఇళ్లలోకి చేరడంతో రాత్రి పగలు బిక్కుబిక్కుమంటూ గడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి అధికారులు వచ్చిన సమస్యను పరిష్కరించేవరకు ఆందోళనను విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. సీఐ నాగబాబు సంఘటన స్థలానికి చేరుకుని వరద బాధితుల సమస్యపై సింగరేణి అధికారుల మాట్లాడారు. ఇరిగేషన్ డిఇ రమేష్ బాబు ముంపు ప్రాంత గ్రామస్థులకు సర్ది చెప్పి, రోడ్డుకు అడ్డుగాపెట్టిన డ్రమ్ములు తొలిగించి కార్మికులను విధులకు పంపించారు. వరద ప్రభావిత ప్రాంత ప్రజల సమస్యను పరిష్కరించేందుకు జిఎం కార్యాలయంలో మంగళవారం అధికారులు, కార్మిక సంఘాలు, ఇరిగేషన్, పోలీస్ శాఖ అధికారులు, గ్రామస్తుల మధ్య చర్చలు జరగనున్నాయి.

# పూర్వ ప్రాథమిక కేంద్రాలలో నమోదు పెంచాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





చర్చ :- కరీంనగర్ : జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ కేంద్రాలలో నమోదును పెంచాలని, ప్రతి కేంద్రంలో 20 మంది పిల్లలు తగ్గకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎంఈఓలు, ఎంపీడీవోలు, సిడిపివోలతో పూర్వ ప్రాథమిక పాఠశాలలపై సమీక్షించారు. జిల్లాలో నిర్వహిస్తున్న 20 పూర్వ ప్రాథమిక కేంద్రాల్లో నమోదు తక్కువగా ఉందని, వారం రోజుల్లోగా ప్రతి కేంద్రంలో 20 మంది పిల్లలను నమోదు చేయించాలని ఆదేశించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కేంద్రాల్లో ఇప్పటికే ఇన్స్ట్రక్టర్, ఆయా నియామకం పూర్తయిందని తెలిపారు. ఐసిడిఎస్, విద్యాశాఖ, ఎంపీడీవోలు సమన్వయంతో ఈ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పన పూర్తి చేయించాలన్నారు. సమర్థవంతంగా కేంద్రాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, సిడిపివోలు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.


# రోగికి రక్తదానం చేసి వైద్యుడు



చర్చ, సత్తుపల్లి:వైద్య సేవల ద్వారా ప్రాణాలు కాపాడే వైద్యుడు... రక్తదానం చేసిమరీ ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడటం పట్ల సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మానవత్వానికి ప్రతిరూపం వైద్యులు అని నిరూపించుకున్నారు గంగారం పీహెచ్‌సి వైద్యులు అవినాష్. మండల పరిధిలోని తుంబూరు గ్రామానికి చెందిన రాంబాబు అనే వ్యక్తి గంగారం హాస్పిటల్‌కి వైద్యం నిమిత్తం రావడం జరిగింది. అతనికి ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉండటంతో డాక్టర్ అవినాష్ ఖమ్మం ప్రధాన ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సలహా ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాంబాబు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నాడు. పేషెంట్ పరిస్థితి ఎలా ఉంది అని గమనించేందుకు డాక్టర్ అవినాష్ అక్కడికి వెళ్లగా ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని వైద్యులు సూచించడంతో సత్తుపల్లి నుండి ఇద్దరు వ్యక్తులు ఖమ్మం ఆసుపత్రికి వెళ్లినా పేషెంట్ బ్లడ్‌కు మ్యాచ్ కాకపోవడంతో పేషెంట్ పరిస్థితి విషమంగా ఉందని గమనించిన డాక్టర్ అవినాష్ వెంటనే స్పందించి స్వయంగా

ఆయన రక్తదానం చేసి ప్రాణాలను కాపాడారు. ఒక డాక్టర్‌గా వైద్య సేవలు అందించడమే కాక, రక్తదానం చేసి ప్రాణాలను కాపాడటంతో పలువురు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయటం వలన ప్రాణాలను కాపాడవచ్చు అని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, కొంతమందికి లేనిపోని అపోహలు ఉన్నాయని, రక్తదానం చేయటం వలన మన రక్తం ఇంకా పెరుగుతుందని, ఆపదలో ఉన్న వారందరికీ ఖచ్చితంగా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని తెలియజేశారు.

# నిర్వాసితులకు న్యాయం చేయాలి: చందా లింగయ్య దొర



చర్చ, మణుగూరు:భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన ఆదివాసీ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని మాజీ శాసన సభ్యులు, మాజీ జెడ్పీ చైర్మన్, ఆదివాసీ అఖిలపక్ష ప్రజా సంఘాల జాతీయ కన్వీనర్ చందా లింగయ్య దొర డిమాండ్ చేశారు. సోమవారం బీటీపీఎస్ గేటు ఎదుట ఆదివాసి బీటీపీఎస్ భూ నిర్వాసితుల పోరాటంలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. నాటి ప్రభుత్వ హయాంలో దాదాపు 1021 మంది ఆదివాసీల నుండి భూములు లాక్కొని వారి భూములకు ఎలాంటి ప్యాకేజీలు, భూమి ఖరీదు ఇవ్వకుండా ద్రోహం చేసి, మధ్య దళారీలకు దాదాపు రూ.400 కోట్లు పంచిపెట్టారని ఆరోపించారు. అయినప్పటికీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. 375 మంది గిరిజనులకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా, 73 మందికి మాత్రమే మాత్రమే ఇచ్చి 302 ఉద్యోగాలను గిరిజనేతరులకు ఇచ్చారని విమర్శించారు. ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం మరియు భూ నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీటీపీఎస్ లో నిర్వహించే అన్ని కాంట్రాక్టు పనుల్లో ఆదివాసీలకు పెద్దపీట వేయాలన్నారు. ఆదివాసి భూ నిర్వాసితుల పోరాటంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి రావాలని, త్వరలో ప్రత్యక్ష పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ బిచన్న నిరసన కార్యక్రమం వద్దకు వచ్చి డిమాండ్లను భద్రాచలం ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టరేట్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వాసం రామకృష్ణ దొర, జాతీయ ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా నాయకులు కొమరం రామ్మూర్తి, డివిజన్ అధ్యక్షులు కొమరం శ్రీను, మండల అధ్యక్షులు కలేటి వీరయ్య, బీటీపీఎస్ వీటీడీఏ చైర్మన్ చిడెమ్ నాగేశ్వర్రావు, బీటీపీఎస్ భూ నిర్వాసితుల కమిటీ అధ్యక్షురాలు కుంజ వెంకటరమణ, ఏనిక మంగమ్మ, పూనేం విజయలక్ష్మి, పోడియం బాలరాజు, వజ్జా శ్యామ్, మాజీ సర్పంచ్ కాయం తిరుపతమ్మ, పునేం గోపాల్, పడిగ నారాయణ, కొమరం సైదులు, మడకం శ్రీను, ఈసం, శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరస్థుడిని అరెస్టు

- వివరాలు వెల్లడించిన సిపి సునిల్‌దత్

చర్చ, ఖమ్మం:ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ జాబ్, ఇన్వెస్టిమెంట్ పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు రూ.30 లక్షలు మోసం చేసిన కేసులో ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు మహారాష్ట్రలోని ఔరంగబాద్ జిల్లా ఛత్రపతి శంబాజీ నగర్‌లో ఒక వ్యక్తిని అరెస్టు



చేసినట్లు ఖమ్మం సి.పి. సునిల్ దత్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా వెంసూరు మండలానికి చెందిన ప్రైవైట్ ఉద్యోగికి టెలిగ్రామ్ యాప్ ద్వారా వ్యక్తి పరిచయమయ్యాడు. అతను ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ జాబ్, ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపించాడు. టెలీగ్రామ్, వాట్సప్ ద్వారా సుమారు రూ.30 లక్షలు రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేసిన ఆ ప్రైవేటు ఉద్యోగి మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఆ వ్యక్తి అకౌం నుంచి రూ.5 లక్షలు వెళ్లిన అక్కౌంట్‌ను ట్రేస్ చేయగా, అకౌంట్ హోల్డర్ అయిన రవీంద్ర లక్ష్మణ్ రావు జారస్‌ను గుర్తించి మహారాష్ట్రలోని ఔరంగబాద్ జిల్లా ఛత్రపతి శంబాజీ నగర్‌లో అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడిని సైబర్‌క్రైం కోర్టులో హజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డి.ఎస్పీ సి.హెచ్.ఆర్.వి. ఫణిందర్, ఇన్‌స్పెక్టర్లు యాసీన్, నరేశ్, ఎస్సైలు కృష్ణ, విజయకుమార్, కానిస్టేబుల్స్ రాజేందర్, సంతోష్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని సీపీ అభినందించారు.

# రూ.2.5 కోట్ల విలువచేసే గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్టు, పరారీలో మరో ఇద్దరు
- సీసీఎస్, సుజాతనగర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్ రాజు








చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:భద్రాచలం నుండి జైపూర్ (రాజస్థాన్)కు అక్రమంగా తరలిస్తున్న రూ.2.5 కోట్ల విలువచేసే అక్రమ గంజాయిని సిసిఎస్, సుజాతనగర్ మండల పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం ఉదయం సుజాతనగర్ మండలం వేపలగడ్డ గ్రామంలోని అన్నపూర్ణ బేకరీ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నుండి ఖమ్మం వైపునకు వస్తున్న అశోక్ లేలాండ్ లారీ కంటైనర్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో 96 గంజాయి ప్యాకెట్లు (మొత్తం 499 కేజీలు) ఉన్నట్లు గుర్తించారు. వీటి అంచనా విలువ సుమారు రూ.2.50 కోట్లు గా పేర్కొన్నారు. గంజాయిని తరలిస్తున్న ఆటో డ్రైవర్ జగదీశ్ దయారాం పాటిల్ (మహారాష్ట్ర), కంటైనర్ ఓనర్, డ్రైవర్ సంజు కుమార్ (కర్ణాటక)లను అరెస్టు చేశామని, గంజాయి కొనుగోలు చేసిన అమిత్ రోహిదాస్ పాటిల్ (మహారాష్ట్ర), ఒడిస్సాకు చెందిన హరి అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు వివరించారు. గంజాయి రవాణాకు రూ.4.5 లక్షల ఒప్పందం కుదుర్చుకున్నట్లు, అడ్వాన్స్‌గా రూ.1.5 లక్షలు తీసుకున్నట్లు నిందితులు చెప్పారన్నారు. పట్టుబడిన వ్యక్తులు గతంలో కూడా గంజాయి కేసుల్లో అరెస్టు అయినట్లు చెప్పారు. నిందితుల వద్ద నుంచి గంజాయితోపాటు లారీ కంటైనర్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఆపరేషన్‌లో పాలు పంచుకున్న సిసిఎస్ సిఐ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, సుజాతనగర్ ఎస్సై రమాదేవి, వారి సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజు, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ అభినందించారు.

# కేంద్రీయ విద్యాలయం పనులు సకాలంలో పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్










చర్చ, భద్రాద్రి కొత్తగూడె:జిల్లాకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి తాత్కాలిక తరగతి గదులకై కేటాయించబడిన భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. పాత కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఆనందఖని)లో గల భవన సముదాయాన్ని సోమవారం పరిశీలించి కేంద్రీయ విద్యాలయ సంఘటన్ వారు సూచించిన సూచనలకు అనుగుణంగా మార్పులు చేయుటకు ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పనులు త్వరితగతిన పూర్తయి, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం కల్లా కేంద్రీయ విద్యాలయం తరగతులు ప్రారంభించేటట్లుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్, విద్యాశాఖ ఇంజనీరింగ్ విభాగ అధికారి రాజగోపాల్ పాల్గొన్నారు. అనంతరం పక్కనే గల పట్టణ గురుకుల పాఠశాల (బాలురు) సందర్శించి అక్కడ విద్యార్థులతో మాట్లాడి పిల్లలకు ఏమైనా అవసరాలు ఉంటే తనకు తెలియజేయాలని స్పెషల్ ఆఫీసర్ ను ఆదేశించారు.

# టౌన్ డివిజన్ పరిధిలోని కొరియర్, కార్గో సెంటర్లలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు: ప్రజల భద్రతే లక్ష్యం









- సీపీ శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్

చర్చ :- కరీంనగర్ :కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని టౌన్ డివిజన్‌లో ఉన్న కొరియర్ ఆఫీసులు, కార్గో సెంటర్లు మరియు పార్సెల్ సెంటర్లలో పోలీసులు ఈరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలకు పోలీసు కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్ గారు స్వయంగా బస్టాండ్ మరియు ఆర్టీసీ కార్గో కార్యాలయం వద్ద పర్యవేక్షించారు.

**తనిఖీలలో పాల్గొన్న పోలీసు జాగిలాలు:**

నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను గుర్తించేందుకు ఈ తనిఖీల్లో ప్రత్యేకంగా శిక్షణ పొందిన పోలీసు జాగిలాలు 'రాంబో' (ట్రాకర్), 'లియో' (నార్కోటిక్), 'మైకి', మరియు 'టైసన్' (స్నిఫర్) పాల్గొన్నాయి.

**ఏకకాలంలో విస్తృత తనిఖీలు:**

టౌన్ డివిజన్ పరిధిలోని కిసాన్ నగర్, బొమ్మకల్ చౌరస్తా, హౌసింగ్ బోర్డు కాలనీ, రామ్ నగర్, ముఖరాంపుర, జ్యోతి నగర్, కాశ్మీర్ గడ్డ, గోదాం గడ్డతో పాటు పలు ముఖ్య ప్రాంతాలలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న కొరియర్, కార్గో కార్యాలయాలలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు.

ఈ ఆకస్మిక తనిఖీల గురించి పోలీసు కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్ గారు మాట్లాడుతూ, "కొరియర్, కార్గో మార్గాల ద్వారా ఆబ్జెక్షన్ మెటీరియల్ అయిన నిషేధిత మాదక ద్రవ్యాలు, గంజాయి, ఎక్స్‌ప్లోజివ్స్, ఫైర్ ఆర్మ్స్ అక్రమంగా రవాణా అవుతున్నాయనే అనుమానంతో ఈ తనిఖీలు నిర్వహించాం. ప్రజల రక్షణార్థం మరియు అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తాం" అని స్పష్టం చేశారు.

ప్రజలు పోలీసులకు సహకరించి, అనుమానాస్పద పార్సెల్‌లు లేదా కార్యకలాపాల గురించి సమాచారం అందించాలని సీపీ ఈ సందర్భంగా కోరారు.

ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, జాన్ రెడ్డి , పుల్లయ్య ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెస్సీ బయో టెక్నాలజీలో గోల్డ్ మెడల్ సాధించిన సంధ్యారాణి

- ప్రశంస పత్రం అందించి అభినందించిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఘనంగా సత్కరించిన కిష్టారం గ్రామస్తులు






చర్చ, సత్తుపల్లి:భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుండి ప్రశంసాపత్రం పొందిన శీలం సంధ్యారాణిని కిష్టారం గ్రామ ప్రజలు సోమవారం ఘనంగా సత్కరించారు. కిష్టారం గ్రామానికి చెందిన శీలం వెంకటేశ్వరరావు, శివకుమారి దంపతుల కుమార్తె సంధ్యారాణి ఆ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 2016 17లో పదవ తరగతి పరీక్షలు వ్రాసి ఉత్తీర్ణురాలయ్యింది. ఇంటర్ ప్రభుత్వ కళాశాలలో చదివింది. ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ తమిళనాడు రాజధాని చెన్నైలోని సెంట్రల్ యూనివర్శిటీలో పూర్తిచేసి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుండి గోల్డ్ మెడల్ స్వీకరించింది. ఈ సందర్భంగా కిష్టారం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్.. సంధ్యారాణిని సత్కరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి రాష్ట్రపతి నుండి గోల్డ్ మెడల్ సాధించిన సంధ్యారాణిని ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని సాధించే వరకు కృషి చేయాలని సూచించారు. సంధ్యారాణి విద్యార్థులతో మాట్లాడుతూ తన లక్ష్య సాధనకు ప్రణాళికా బద్ధంగా కృషిచేసిన విధానాన్ని వివరించారు. కిష్టారం గ్రామ ప్రజలు సంధ్యారాణిని, తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉడతనేని అప్పారావు, కొడిమెల అప్పారావు, నరుకుళ్ల శేషగిరి, ఎన్.అ పాప్రావు, జి.వి.రమణ, మల్లికార్జున్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి

- అరికట్టడంలో విఫలమవుతున్న రెవెన్యూ అధికారులు














**చర్య, దుండిగల్:**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండల పరిధిలో చర్చి గాగిల్లాపూర్ నందుగల సర్వేనెంబర్ 214 ప్రభుత్వ భూమి కొందరు కబ్జాదారులకు వరంగా మారింది. ప్రధానంగా చర్చి గాగిల్లాపూర్ లో గత కొన్ని సంవత్సరాలుగా పాగా వేసిన ఓ కబ్జాదారుడు ప్రభుత్వ భూములు కబ్జా చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నాడు. అందుకు పలువురు స్థానిక రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలను నియంత్రించాల్సిన ప్రభుత్వ అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ దందాలో పలువురు అధికారులు వాటాలు పంచుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వ అధికారుల కళ్లెదుటే భూకబ్జాదారుడు ప్రభుత్వ భూముల్లో 20కి పైగా అక్రమ నిర్మాణాలు చేపట్టినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఒక్కో అక్రమ నిర్మాణానికి సదరు కబ్జాదారుడు రూ.50 వేల వరకు ముట్టచెప్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఎవరైనా సామాజిక వేత్తలు ఇక్కడి భూకబ్జాల పై ఫిర్యాదులు చేస్తే కొందరు రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా కూల్చివేతలు చేసి జబ్బలు చర్చుకుంటున్నారని వాపోతున్నారు. ప్రభుత్వ భూములు కాపాడుతామని ఒకవైపు హైడ్రా కమిషనర్ శపథం చేస్తున్నా.. చర్చి గాగిల్లాపూర్ సర్వేనెంబర్ 214లో మాత్రం కబ్జాలు యధాతధంగా కొనసాగుతున్నాయి. హైడ్రా కమిషనర్ వరకు ఈ ఆక్రమణల విషయం వెళ్లడంలేదని కొందరు చెప్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, హైడ్రా కల్పించుకుని సదరు సర్వే నెంబర్లోని ప్రభుత్వ కాపాడాలని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# అధిష్టానం వద్దకు చేరిన బిజెపిలో వర్గ పోరు

- షాడో జిల్లా అధ్యక్షుడి ఆధిపత్యంపై నజర్
- నేడు ఖమ్మంలో జరగనున్న సమావేశంలో చర్చించే అవకాశం




**చర్య, భద్రాద్రి కొత్తగూడెం:**దేశంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం అంతర్గతపోరుతో సతమతం అవుతోంది. షాడో జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న అగ్రకులానికి చెందిన ఒక వ్యక్తి పార్టీలోని కొందరిని దూరం పెడుతూ తన వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారని మరో వర్గం వారు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల పాల్వంచలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఈ వ్యవహారంపై ఒక వర్గంపై మరొక వర్గం వారు విమర్శలు చేసుకోవడమే కాకుండా భౌతిక దాడుల వరకు వెళ్లడంతో అధిష్టానవర్గం దీనిపై కన్నేసినట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ రోజురోజుకూ పుంజుకుంటున్న సమయంలో ఇలాంటి అంతర్గత విభేదాల వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని భావించి నాయకులను సమన్వయం చేసేందుకు యోచిస్తున్నట్లు సమాచారం. ఒకవైపు పార్టీకి జిల్లా కార్యాలయం లేకపోవడం, షాడో జిల్లా అధ్యక్షుడిపైనే ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు ఆధారపడటం వంటి అంశాలు మరో వర్గం కార్యకర్తల్లో నిరాశ, నిస్పృహలను కలుగచేస్తుంది. కేంద్రంలో గత 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న పార్టీకి జిల్లాలో కనీసం కార్యాలయం లేకపోవడంతో ఏ సమావేశం పెట్టాలన్నా చెట్లకింద నిర్వహించాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీకి విధేయులుగా ఉంటూ, అధికారంలో ఉన్నా, లేకపోయినా పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తలకు గుర్తింపు లేకుండా పోతుందని అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. షాడో జిల్లా అధ్యక్షుడు అగ్రకులవర్గానికి చెందిన వాడు కావడంతో అణగారిన వర్గాలను దరిదాపుల్లోకి రానీయకుండా పార్టీకి దూరం చేస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. అన్ని వర్గాల కార్యకర్తలను కలుపుకుపోకుండా వర్గాలను ప్రోత్సహిస్తున్నారని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. సీనియర్ నాయకులను కాదని నిన్న మొన్న పార్టీలోకి వచ్చిన వారిని ముందువరుసలో ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్గత విభేదాల కారణంగా పార్టీ పరువు పోతుందని అంటున్నారు. ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలను సైతం పార్టీ అధిష్టానం కూడా చూసీ చూడనట్లు వ్యవహరించడంతో కొందరు అధిష్టానం దష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ రాష్ట్ర అధిష్టానం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ నాయకులపై సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. కాగా మంగళవారం ఖమ్మంలో జరగనున్న పార్టీ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పార్టీలో నెలకొన్న వర్గ విభేదాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**ప్రోటోకాల్‌పై చెలరేగిన దుమారం...**

ఇది ఇలా ఉండగా గత పార్లమెంటు ఎన్నికలలో బీజేపీ తరపున ఖమ్మం అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తిని దూరం పెట్టడంపై దుమారం చెలరేగింది. ఇటీవల పార్టీలోకి వచ్చిన వారి ఫొటోలను సభా వేదిక వద్ద ఏర్పాటు చేసే బ్యానర్లలో పెట్టడంతో వ్యతిరేక వర్గానికి చెందిన వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఒక న్యాయవాదికి ప్రాధాన్యత ఇస్తున్నారని, అతడినే సభా వేదికపైకి ఆహ్వానిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆయన గత చరిత్ర తెలుసుకోవాలని, నమ్మిన వారిని నట్టేట ముంచేరకం అని, గతంలో ఓ ప్రజాప్రతినిధికి కుడిభుజంగా ఉంటూనే అతడిని నిలువునా మోసం చేశాడని గుర్తుచేస్తున్నారు. ప్రోటోకాల్ పాటించకుండా సమావేశాలు నిర్వహించడంపైనా బీజేపీవర్గాలు చర్చించుకుంటున్నారు. అధిష్టానం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, ఇప్పటికైనా పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తూ ప్రోటోకాల్ పాటించాలని పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిష్టానానికి సూచనలు చేస్తున్నారు.

# పూరన్ కుమార్ కుటుంబానికి డిప్యూటీ సీఎం పరామర్శ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** చండీఘడ్‌లో ఆత్మహత్య చేసుకున్న దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క (సోమవారం) పరామర్శించారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం పూరన్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్, కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు ఉపముఖ్యమంత్రి.సీఎం రేవంత్ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారని.. పూరన్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క తెలిపారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను పరామర్శించడానికి వచ్చిన హర్యానా చీఫ్ సెక్రటరీ అనురాగ్ రస్తోగితో డిప్యూటీ సీఎం విక్రమార్క మాటాడారు. ఈ ఘటనకు సంబంధించి సూసైడ్ నోట్ ఆధారంగా ఎంత పెద్ద వాళ్ళు ఉన్నా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించి పూరన్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.



పూరన్ కుమార్ అత్యంత ప్రతిభావంతుడని.. ప్రసిద్ధి గాంచిన ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పట్టభద్రుడని.. ఐఐఎం అహ్మదాబాదులో చదివిన గొప్ప మేధావి అని కొనియాడారు డిప్యూటీ సీఎం. ఉన్నతాధికారుల కుల వివక్ష, వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవడం.. చాలా తీవ్రమైన అంశమన్నారు. పూరన్ కుమార్ సూసైడ్ నోట్ డైయింగ్ డిక్లరేషన్‌గా భావించాలని కోరారు. ఈ ఘటన జరిగి ఇన్ని రోజులు అయినా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. వృద్ధ తల్లిదండ్రులను, ఇద్దరు ఆడపిల్లలు ఉన్న పూరన్ కుమార్ కుటుంబానికి రక్షణ కల్పించి ఆదుకోవాలని హర్యానా ప్రభుత్వాన్ని, చండీఘర్ పోలీసులను డిమాండ్ చేశారు. కపూర్ అనే అధికారి దళిత వ్యతిరేకి అని తెలిసి కూడా బీజేపీ ప్రభుత్వం అతన్ని డీజీపీని చేసిందని.. ఈ ప్రభుత్వం ఇన్నేళ్ల స్వతంత్ర భారతదేశంలో డెత్ బెడ్ మీద ఉండి కూడా న్యాయం కోసం ప్రాధేయపడడం దురదృష్టం అంటూ భట్టి వ్యాఖ్యలు చేశారు. అత్యంత పిన్న వయసులోనే ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత పూరన్ కుమార్ అని అన్నారు. అతని చివరి డెత్ లెటర్ ఆధారంగా సంబంధిత అధికారుల మీద చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. హర్యానా, చండీగఢ్ ప్రభుత్వాలు బీజేపీ పాలనలో ఉన్నాయని.. సీఎం రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్నారు. తాము చట్టాన్ని ధిక్కరించే పని అడగడం లేదని.. బాధ్యత గల ప్రభుత్వాలు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని అడుగుతున్నామన్నారు. తెలంగాణ సీఎం రేవంత్.. పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# కాకరేపుతున్న బైపోల్ బీజేపీ అభ్యర్థి ఫిక్స్

**హైదరాబాద్, అక్టోబర్ 13:** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాకరేపుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఇక్కడ బైఎలెక్షన్ జరుగనుంది. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు సైతం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కించుకుంది. అటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌ను చిత్తు చిత్తుగా ఓడించి 8 పార్లమెంట్ స్థానాల్లో విజయ బావుటా ఎగురవేసింది. మరోవైపు బీజేపీ కూడా ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసి ఆశ్చర్యపోయే విధంగా 8 స్థానాలు గెలుచుకుంది. త్వరలో జరుగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో తమ ప్రతాపాన్ని చూపేందుకు ఈ మూడు పార్టీలు రెడీ అవుతున్నాయి. విజయ కాంక్ష కోసం తహతహలాడుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ బై పోల్ లో కూడా గెలిచి మరోమారు తమ సత్తా ఏంటో చూపేందుకు సమాయత్తం అవుతుంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి మూటగట్టుకున్న బీఆర్ఎస్.. పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కసరత్తు చేస్తుంది.ఈ తరుణంలోనే బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. జూబ్లీహిల్స్ అభ్యర్థి విషయంలో బీజేపీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ముందుగానే తమ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ భార్య, మాగంటి సునీతను ఎన్నికల బరిలో నిలుపుతున్నట్లు ప్రకటించింది. అటు కాంగ్రెస్ అధిష్టానం సైతం అనేక మార్లు సమాలోచనలు చేసి హస్తం పార్టీ అభ్యర్థిగా నవీన్ యాదవ్ ను ఎంపిక చేసింది. వీరిద్దరూ తమ ప్రచారాన్ని రోజురోజుకీ ముమ్మరం చేస్తున్నారు. స్థానికులను కలిసి తమకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరుతున్నారు. పోటీ నుంచి తెలుగు దేశం పార్టీ తప్పుకోవటంతో బీజేపీ ఎవరిని బరిలోకి దించుతుందనే చర్చ మొదలైంది. అధిష్టానం పెద్దలలో చర్చలు జరిపి అభ్యర్థి విషయంలో ఒక కొలిక్కి వచ్చినట్లు తెలు స్తోంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ ఈరోజు విడుదల కానుంది. నోటిఫికేషన్ జారీ తర్వాత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. సోమవారం ఉదయం 11 గంటల నుంచి 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో సామాజిక సమీకరణాలు, పార్టీ గెలుపు దృష్ట్యా అభ్యర్థి విషయంలో బీజేపీ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ కాషాయ పార్టీ తరఫున ముగ్గురు పేర్లు కేంద్ర కమిటీకి అందాయి. ఆదివారం ఢిల్లీలో జరిగిన బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో జూబ్లీహిల్స్ బై పోల్ లో బీజేపీ అభ్యర్థిగా దీపక్‌రెడ్డి పేరును పార్టీ అగ్రనాయకత్వం ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. జూబ్లీహిల్స్‌లో పోటీ కోసం దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, మాధవీలత పేర్లతో కూడిన జాబితాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు శనివారమే పార్టీ జాతీయ నాయకత్వానికి అందివ్వగా.. ఈ ముగ్గురి ఎంపికపై చర్చించి




# పోలీసులు సివిల్ పంచాయితీ చేస్తే చర్యలు తప్పవు: డీజీపీ శివధర్ రెడ్డి




**హైదరాబాద్, అక్టోబరు 13:** పోలీస్ స్టేషన్‌లలో సివిల్ వివాదాలకు తావు లేదని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. సివిల్ వివాదాల కోసం సివిల్ కోర్టులు ఉన్నాయని వివరించారు. పోలీస్ స్టేషన్ అడ్డాగా సివిల్ పంచాయితీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. (సోమవారం) తెలంగాణ రాష్ట్ర పోలీస్ సిబ్బందికి డీజీపీ శివధర్ రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలని డీజీపీ ప్రస్తావించారు.యూనిఫాం, అవినీతి ఒకే దగ్గర ఉండవని తేల్చిచెప్పారు. ఒక్క పోలీస్ అధికారి అయినా లంచం తీసుకుంటే డిపార్ట్‌మెంట్ మొత్తానికి చెడ్డ పేరు వస్తుందని చెప్పుకొచ్చారు. డిపార్ట్‌మెంట్‌లో లంచం తీసుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల భద్రత పోలీసు ప్రధాన బాధ్యత అని ఉద్ఘాటించారు. పోలీస్ సిబ్బంది వెల్ఫేర్ తన వ్యక్తిగత ప్రయారిటీ అని చెప్పుకొచ్చారు. ఫెయిర్ అండ్ ఫ్రెండ్లీ, ప్రొఫెషనల్ పోలీసింగ్ తన ఫిలాసఫీ అని నొక్కిచెప్పారు డీజీపీ శివధర్ రెడ్డి.కేసుల విషయంలో బేసిక్ పోలీసింగ్‌తో పాటు టెక్నాలజీని వాడాలని సూచించారు. పేద ప్రజలు ఆపదలో ఉంటే పోలీసులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆపదలో వాళ్లని పేదలు ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే గోపినాథ్ బతికి ఉంటే ఎమ్మెల్యే అయ్యేవాడిని



**హైదరాబాద్:** తాను ఉన్నంత కాలం జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరనివ్వనని మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రహమత్ నగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ తాతల కాలం నుంచే తమది కాంగ్రెస్ కుటుంబమని గుర్తు చేశారు. తనలాంటి వారికే కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ టికెట్‌ను అమ్మకానికి పెట్టిందని ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చానని స్పష్టం చేశారు.తనకు కష్టకాలంలో బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచిందని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తనని రెండుసార్లు ఓడించారని గుర్తు చేశారు. అయినప్పటికీ.. ఆయనతో తనకు మంచి సంబంధాలున్నాయని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఇద్దరం కలసి తినేవాళ్ళమని చెప్పారు. పీజేఆర్ కొడుకుని ఓడించానని.. గోపినాథ్ సరదాగా తనతో అనేవారన్నారు. గోపినాథ్ బతికి ఉండి ఉంటే.. డీలిమిటేషన్ తర్వాత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అయ్యేవాడిని చెప్పారు. గోపినాథ్ శత్రువులు.. తనకు కూడా శత్రువులే అని కీలక వ్యాఖ్యలు చేశారు. రామన్న రాజ్యం కావాలో..? రావణ రాజ్యం కావాలో.. జూబ్లీహిల్స్ ప్రజలు తేల్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఏకంగా కలెక్టరేట్‌లోనే మహిళపై అత్యాచారయత్నం




**హన్మకొండ :** ఓ కామాంధుడు ఏకంగా కలెక్టరేట్‌లోనే రెచ్చిపోయాడు. మహిళా సిబ్బందిపై అత్యాచారానికి యత్నించాడు. హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది.ఇర్ఫాన్ సోహైల్ అనే వ్యక్తి హనుమకొండ ఎస్టాబ్లిష్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కొన్నేళ్లుగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందిపై ఆయన వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే తోటి మహిళా సిబ్బందిపై ఇటీవల అత్యాచారానికి యత్నించాడు. అయితే అతని నుంచి తప్పించుకున్న బాధితురాలు వెంటనే సుబేదారి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అయితే కలెక్టరేట్‌లోనే ఇంతటి అఘాయిత్యానికి ఒడిగట్టడం పలు అనుమానాలకు దారితీస్తోంది. సోహైల్‌కు ఉన్నత స్థాయి అధికారుల అండదండలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇర్ఫాన్ సోహైల్‌పై పోలీసులు లైంగిక వేధింపుల కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. అలాగే నిందితుడిని కలెక్టర్ సస్పెండ్ చేశారు.

# జూబ్లీహిల్స్ బైపోల్ తొలిరోజు ఎంతమంది నామినేషన్లు వేశారంటే





**హైదరాబాద్, అక్టోబర్ 13:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు (సోమవారం) నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం నుంచి పలువురు నామినేషన్లను దాఖలు చేశారు. ఈ ఉపఎన్నికకు తొలిరోజు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో రెండు రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు కాగా.. 8 స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. తెలంగాణా పునర్ నిర్మాణ సమితి తరుపున పూస శ్రీనివాస్ నామినేషన్ వేశారు. అలాగే నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాస రావు నామినేషన్ దాఖలు చేశారు. అంతేకాకుండా.. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్ర శేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్‌తో పాటు మరో ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా... తొలిరోజు నామినేషన్ ప్రక్రియ పూర్తి అయ్యింది.ఆంక్షలు అమలు: ఎన్నికల అధికారికాగా.ఉదయం ఉపఎన్నికకు నోటిఫికేషన్ విడుదలవగా..హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్లు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈనెల 21వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం 100 మీటర్ల వరకు ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. 100 మీటర్ల వరకు ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. 4 వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారని చెప్పారు. నియోజవర్గ పరిధిలో 45 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని ఎన్నికల అధికారి కర్ణన్ వెల్లడించారు.మరోవైపు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ దూకుడు పెంచింది. సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా దివంగత నేత మాగంటి గోపీనాథ్ భార్య సునీత పేరునే బీఆర్ఎస్ పార్టీ ఖరారు చేసిన విషయం తెలిసిందే.

# చదువుపై శ్రద్ధ ఉండేది కాదు




**శ్రీ సత్యసాయి:** హిందూపురం రూరల్ మండలం కిరికెర పంచాయితీ బసవన్నపల్లిలోని పాఠశాలలో రూ.64 లక్షల వ్యయంతో నిర్మించిన గదులను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ప్రారంభించారు. అనంతరం పథకం ద్వారా కోటి రూపాయల నిధులతో బసవన్నపల్లి నుంచి భరత్ నగర్ వరకు చేపట్టవలసిన రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ.. హిందూపురం ప్రాంతంలో పరిశ్రమలు, పాఠశాలలు స్థాపించింది దివంగత నేత, మాజీ సీఎం ఎన్టీ రామారావు అని గుర్తు చేశారు. తనకు చదువు పట్ల అంతగా శ్రద్ధ ఉండేది కాదని బాలకృష్ణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎలాగో అలాగా డిగ్రీ పూర్తి చేశానని చెప్పుకొచ్చారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత సినీ రంగాల్లోకి అడుగు పెట్టానని గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగి తల్లిదండ్రులు మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే బాలకృష్ణ సూచించారు.

# ఏపీ పోలీసుల యాక్షన్ దిగొచ్చిన పేర్నినాని




**మచిలీపట్నం, అక్టోబరు 13:** మచిలీపట్నం పోలీసులు యాక్షన్ చేపట్టడంతో మాజీ మంత్రి పేర్ని నాని దిగొచ్చాడు. ఈ క్రమంలో పేర్ని నానితో సహా మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌కి క్యూ కట్టారు వైసీపీ నేతలు . ఇటీవల మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ వద్ద అనుమతులు లేకుండా ధర్నా చేశారు వైసీపీ నేతలు.ఈ క్రమంలో పోలీసుల అనుమతి లేకుండా ఆందోళన చేయడంతో 400 మంది వైసీపీ నేతలపై కేసు నమోదు చేశారు. సుమారు 100 మందికి 41ఏ నోటీసులు జారీ చేశారు పోలీసులు. నోటీసులకు సమాధానం ఇవ్వకుండా మొన్నటి వరకు పోలీసులతో దోబూచులాడారు వైసీపీ నేతలు. రెండు రోజుల క్రితం వైసీపీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న అరెస్ట్‌తో వైసీపీ నేతలు అలర్ట్ అయ్యారు. పేర్ని నానితో సహా పోలీస్ స్టేషన్‌కి వచ్చి నోటీసులకు రిప్లై ఇచ్చారు వైసీపీ నేతలు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతల నుంచి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు ఎస్ఐ ప్రభాకరరావు.

# సాక్షికి ఏపీ పోలీసుల నోటీసులు




**అమరావతి, అక్టోబరు :** అసత్య ప్రచారం చేస్తున్న సాక్షి మీడియా కి నోటీసులు పంపించింది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం. కల్తీ మద్యంతో మరణాలు అంటూ అసత్య వార్తలని వండి వార్చింది జగన్ మీడియా సంస్థ సాక్షి. ఈ మేరకు ఆధారాలు చూపాలంటూ సెక్షన్ 179 (1) ప్రకారం నోటీసులు జారీ చేశారు ఏపీ పోలీసులు .సాక్షి యాజమాన్యంతో పాటు సాక్షి పత్రిక చీఫ్ ఎడిటర్ ధనుంజయ రెడ్డి, సాక్షి నెల్లూరు జిల్లా బ్యూరో చీఫ్ చిలకా మస్తాన్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. నకిలీ మద్యానికి నలుగురు బలి అంటూ సాక్షి పత్రికలో 8.10.2025న ప్రచురించిన వార్తకు సంబంధించిన ఆధారాలు తమకు 12.10.2025న కలిగిరి పోలీస్ స్టేషన్‌కి వచ్చి సమర్పించాలని సాక్షి యాజమాన్యానికి నోటీసుల్లో స్పష్టం చేశారు పోలీసులు.ఆధారాలు చూపించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సాక్షికి నోటీసులు జారీ చేశారు పోలీసులు. ఈ నేపథ్యంలో నోటీసులు తీసుకోవడానికి ముందుకు రాలేదు సాక్షి యాజమాన్యం. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి నోటీసులు తీసుకోకుండా పరార్ అయ్యినట్లు తెలుస్తోంది. రాసిన తప్పుడు వార్తలకు సంబంధించి వివరణ ఇవ్వకపోతే ఎక్కడున్నా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ పోలీసులు హెచ్చరించారు.

# మద్యం కుంభకోణంలో కీలక మలుపు



**అమరావతి:** మద్యం కుంభకోణం కేసులో ఏసీబీ కోర్టు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులైన పలువురికి ఈ నెల 16వ తేదీ వరకు రిమాండ్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు పొడిగించింది.న్యూయార్క్ వెళ్లాలన్నమిథున్ రెడి ఇదిలా ఉంటే, ఈ కేసులో నిందితుడిగా ఉన్న రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, ఈ నెల 20వ తేదీ నుంచి న్యూయార్క్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ అభ్యర్థనపై స్పందించిన కోర్టు, సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. దీనిపై తదుపరి విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది.వెన్నునొప్పితో చెవిరెడ్డిమరో నిందితుడు చెవిరెడ్డి భాస్కర రెడ్డి కోర్టులో తన ఆరోగ్య పరిస్థితిపై పలు విన్నపాలు చేశారు. తాను తీవ్ర వెన్నునొప్పితో బాధపడుతున్నానని తెలిపారు. నిన్న, మొన్న ఆసుపత్రిలో చూపించుకున్నానని కోర్టుకు వివరించారు. వైద్యులు ఫిజియోథెరపీ చేయించాలని సూచించారని చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన మంతెన ఆశ్రమంలో చికిత్స చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అయితే, తాను పోలీస్ కస్టడీలోనే చికిత్స చేయించుకుంటానని కోర్టుకు స్పష్టం చేశారు. నొప్పి భరించలేకపోతున్నానని కోర్టులో పేర్కొన్నారు. ఈ అభ్యర్థనపై కోర్టు స్పందిస్తూ తదుపరి విచారణలో పరిశీలిస్తామని తెలిపింది.

# ఏపీలో మంత్రి కొల్లు రవీంద్రపై మాజీ మంత్రి సెటైరికల్ కామెంట్స్

**అమరావతి :** రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని వైసీపీ నాయకులు, మాజీ మంత్రి పేర్నినాని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లాలో జరిగిన నిరసనలో పేర్నినాని పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నకిలీ మద్యం అమ్మకాలు జోరుగా పెరిగిపోయాయని దీంతో మద్యం తాగి సామాన్యులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో నాణ్యమైన మద్యం అమ్మకాలు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అబద్దాలు చెబుతున్నాడని ఆరోపిస్తూ కొల్లు అని కాకుండా సొల్లు రవీంద్ర అని పేరు పెట్టుకోవాలని సెటైర్లు వేశారు. రాష్ట్రంలో మంచి నీటికైనా కరువు వచ్చిందేమో కాని మద్యానికి మాత్రం కరువు రాలేదని తెలిపారు. కల్తీ మందును అందిస్తున్న మంత్రిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.టీడీపీ కార్యకర్తలు తిరగబడి తన్నే రోజులు వస్తాయన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా నగరిలో మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నారావారి పాలన నశించాలంటూ నినాదాలు

# రేషన్ బియ్యాన్ని స్పాట్‌లోనే పరీక్షించే మొబైల్ కిట్లు




**విశాఖపట్నం:** రేషన్ బియ్యం అక్రమ రవాణా అడ్డుకట్టకు పౌర సరఫరాల శాఖ సరికొత్త విధానం ప్రవేశ పెట్టినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. స్పాట్‌లోనే బియ్యాన్ని పరీక్షించేందుకు అందుబాటులోకి మొబైల్ కిట్లు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. 700 మొబైల్ కిట్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. మొబైల్ కిట్ పరీక్షలో బియ్యం ఎరుపు రంగులోకి మారితే అవి రేషన్ బియ్యంగా నిర్ధారించవచ్చని స్పష్టం చేశారు. గతంలో పట్టుకున్న బియ్యాన్ని ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించాల్సి వచ్చేదని ఆయన గుర్తు చేశారు.ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన మొబైల్ కిట్స్ ద్వారా బియ్యాన్ని త్వరితగతిన పరీక్షించవచ్చని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం పౌర సరఫరాల శాఖను అవినీతిలోకి నెట్టేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పౌర సరఫరాల శాఖలో మార్పులు తీసుకువచ్చామని పేర్కొన్నారు. పేదల బియ్యం పక్కదారి పట్టకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. విశాఖలో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్ పోస్టులలో 33 మంది సిబ్బంది మూడు సిఫ్ట్‌లలో 24 గంటలు పనిచేస్తారని వివరించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత అక్రమంగా తరలిస్తున్న 5.65 లక్షల క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి నాదెండ్ల చెప్పుకొచ్చారు. అక్రమార్కులపై 230 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మంచి బియ్యం సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నూతన టెక్నాలజీలను అందిపుచ్చుకొని రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం వినియోగంలో రాష్ట్రంలో మార్పు ప్రారంభమైందని హర్షం వ్యక్తం చేశారు. కాకినాడ పోర్టులో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సిట్ దర్యాప్తు కొనసాగుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

# ఏపీ పర్యాటక రంగానికి జాతీయ గుర్తింపు దిశగా అడుగులు




**అమరావతి, అక్టోబరు 13:** ఏపీ పర్యాటక రంగానికి జాతీయ గుర్తింపు దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అక్టోబర్ 14, 15 తేదీల్లో పర్యటించనున్నారు. దేశంలో ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల 50 పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల కల్పన కోసం ఉద్దేశించిన జాతీయ మిషన్‌పై చర్చించేందుకు ఏపీ ప్రభుత్వం తరపున ప్రతినిధిగా వెళ్లనున్నారు మంత్రి కందుల దుర్గేష్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల పర్యాటక మంత్రులు హాజరుకానున్నారు.పర్యాటక రంగం అభివృద్ధికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ 2025 – 2026 ప్రకటనల అమలుపై ఏపీ విజన్‌ను సమర్పించనున్నారు మంత్రి దుర్గేష్. జాతీయ మిషన్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ తరపున ఉన్న ప్రతిపాదనలను వివరించనున్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎంపిక చేసిన ప్రధాన పర్యాటక గమ్యస్థానాలను రాష్ట్రాల భాగస్వామ్యంతో 'ఛాలెంజ్ మోడ్'లో అభివృద్ధి చేయనుంది కేంద్రం ప్రభుత్వం. పర్యాటక సౌకర్యాలు, పరిశుభ్రత, మార్కెటింగ్ ప్రయత్నాలతో సహా సమర్థవంతమైన గమ్యస్థానాల నిర్వహణ కోసం పలు రాష్ట్రాలకు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు అందించనుంది కేంద్రం ప్రభుత్వం.పర్యాటక ప్రాంతాల మౌలిక సదుపాయాల నిర్మాణానికి అవసరమైన భూమిని అందించనున్నాయి పలు రాష్ట్రాలు. జాతీయ మిషన్ లక్ష్యాలను సాధించేందుకు, ప్రైవేట్ పెట్టుబడులు, స్థానిక ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం తీసుకోనున్న చర్యలను వివరించనున్నారు మంత్రి దుర్గేష్. ఏపీ పర్యాటక శాఖలో అవలంభిస్తున్న విధానాలు, పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లకు అందిస్తున్న ప్రోత్సాహకాలను వెల్లడించనున్నారు మంత్రి కందుల దుర్గేష్.అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఏపీలో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడం, పర్యాటకులకు అద్భుత అనుభవాలను కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తున్న తీరును వెల్లడించనున్నారు. 2030 నాటికి ఆసియాలోనే అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానాల్లో ఏపీని ఒకటిగా నిలిపేందుకు తీసుకోనున్న చర్యలను వివరించనున్నారు మంత్రి కందుల దుర్గేష్.

# వైసీపీకి మరో కీలక నేత గుడ్ బై



**కర్నూలు, అక్టోబర్ 13:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. గోనెగొండ్ల మండలం వైసీపీ మండల ఉపాధ్యక్షులు రమణి కుమారి వైసీపీ పార్టీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో అధికార కూటమి పథకాలకు ఆకర్షతులై తన అనుచరులతో కలిసి మండల ఉపాధ్యక్షులు రమణ కుమారి టీడీపీ పార్టీలో చేరారు. రమణి కుమారితో పాటు 200 మంది కార్యకర్తలు వైసీపీకి గుడ్‌బై చెప్పి తెలుగుదేశం పార్టీలో చేరారు. రమణి కుమారితో పాటు మిగిలిన వారందరికీ ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.సాధారణ ఎన్నికల్లో కేవలం 11 సీట్లతో ఘోర పరాజయం పాలైన వైసీపీకి.. ఆ తరువాత నేతల రాజీనామాలతో జగన్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న పరిస్థితి. ఇప్పటికే పలువురు ముఖ్య నేతలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు వైసీపీని వీడి వేరే పార్టీల్లోకి వెళ్లిపోయారు. జగన్‌కు అత్యంత సన్నిహితులు కూడా పార్టీకి గుడ్ బై చెప్పేయడంతో పార్టీ భవిష్యత్ ఏంటనే ప్రశ్నలు మొదలవుతున్నాయి. జగన్‌కు అత్యంత దగ్గరి బంధువైన బాలినేని శ్రీనివాస్ రెడ్డి, మోపిదేవి వెంకటరమణ, ఎంపీలు బీద మస్తాన్ రావు, ఆర్. కృష్ణయ్య వీర ంతా వైసీపీకి రాజీనామా చేసి వివిధ పార్టీల్లో చేరిపోయారు. అం తేకాకుండా వైఎస్ కుటుంబంతో అత్యంత నమ్మకస్తుడుగా ఉన్న విజయసాయి రెడ్డి కూడా వైసీపీకి రాజీనామా చేయడం ఆ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బే అని చెప్పుకోవాలి. అసంతృప్తి కారణంగానో లేక జగన్ వ్యవహారాల శైలి నచ్చకనో ఇలా ఏ కారణంతోనే అనేక మంది ముఖ్యనేతలు పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపో తున్నారు. ఇప్పుడు తాజాగా ఎమ్మిగనూరు నియోజకవర్గ ంలోనూ వైసీపీ మండలి ఉపాధ్యక్షులతో పాటు 200 మంది కార్యకర్తలను పార్టీని వీడారు. ఇలా తరచూ అనేక మంది నేతలు పార్టీకి గుడ్‌బై చెప్పేస్తున్న నేపథ్యంలో జగన్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# ఆదాయ వనరుల సమీకరణపై ఏపీ ప్రభుత్వం కసరత్తు




**అమరావతి , అక్టోబరు 13:** ఆదాయ వనరుల సమీకరణపై ఏపీ ప్రభుత్వంకసరత్తు చేస్తోంది. ఆదాయ వనరుల సమీకరణ కోసం ప్రత్యామ్నాయ మార్గాలని గుర్తించేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. ఆరుగురు మంత్రులతో మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేబినెట్ సబ్ కమిటీలో సభ్యుడిగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఉన్నారు.జీవోఎం సభ్యులుగా మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, జీవోఎం సభ్యులుగా మంత్రులు కందుల దుర్గేశ్, వంగలపూడి అనితలని కూటమి ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో ఆదాయ వృద్ధికి ప్రత్యామ్నాయ చర్యల గుర్తింపు, అమలుపై చర్చించాలని ఆదేశాలు జారీ చేసింది. నెలవారీ ఆదాయాలను, లక్ష్యాలతో పోల్చి సమీక్షించాలని ఆజ్ఞాపించింది.ఆదాయ పనితీరును మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన సంస్కరణలపై సిఫార్సు చేయాలని దిశానిర్దేశం చేసింది. ఏపీ ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన మార్పులు, సాంకేతికత అమలుపై సిఫార్సులు చేయాలని మార్గనిర్దేశం చేసింది. ఆదాయ వనరుల పెంపు కోసం పరిపాలనా పరంగా బలోపేతం చేయడంపై చర్చించాలని సూచించింది. ఆదాయ వనరుల పెంపుకోసం చట్టాలు, నియమాలు, విధానాలకు సవరణల అవసరాన్ని సమీక్షించాలని ఆదేశాలు జారీ చేసింది ఏపీ ప్రభుత్వం.పలు ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం, బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని ఆజ్ఞాపించింది. పలు ప్రభుత్వ విభాగాల్లో విధానపరమైన అడ్డంకులని పరిష్కరించాలని సూచించింది. స్వర్ణాంధ్ర – 2047 దార్శనికతకు అనుగుణంగా మధ్యస్థ, దీర్ఘకాలిక ఆదాయ వ్యూహాలపై దిశానిర్దేశం చేయాలని ఆదేశించింది. పనితీరుపై సమీక్ష, కొత్త చర్యలపై చర్చ, అడ్డంకుల పరిష్కారం కోసం ప్రతి నెలా సమా వేశం కావాలని ఆదేశించింది. మంత్రుల బృందం ఎప్పటికప్పుడూ ప్రభుత్వానికి సలహాలు, నివేదిక లు, సిఫార్సులు చేయాలని ఆజ్ఞాపించింది. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకో వాలని ఏపీ సీఎస్ కె. విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

# ఆంధ్రప్రదేశ్ దశ, దిశ మార్చనున్న నవంబర్ నెల



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో నవంబర్ నెల కీలకంగా మారనుంది. నవ్యాంధ్రకు పెట్టుబడులను ఆకర్షించేందుకు ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. దీంతో దిగ్గజ సంస్థల చూపు ఏపీ వైపు మళ్లుతోంది. ఈ క్రమంలోనే ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. అందులో కొన్ని ప్రాజెక్టులు వేగంగా అడుగులు పడుతున్నాయి కూడా. అయితే నవంబర్ నెల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దశ, దిశను మార్చేలా కనిపిస్తోంది. రెండు కీలక ప్రాజెక్టులకు నవంబర్ నెలలో శ్రీకారం చుట్టనున్నారు. విశాఖపట్నంలో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు అన్నింటికంటే ముందుగా ఆసక్తి చూపించింది టీసీఎస్.. ఆ తర్వాతనే ఒక్కొక్క కంపెనీ ఏపీవైపు, అందులోనూ విశాఖవైపు దృష్టి సారిస్తూ వచ్చాయి. ఈ క్రమంలోనే నవంబర్ నెలలో టీసీఎస్ తన కార్యకలాపాలు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.తొలి అడుగు టీసీఎస్‌దే.. నవంబర్ నుంచి పనులు.విశాఖపట్నంలో టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతో తొలుత ఒప్పందం చేసుకున్నది కూడా టీసీఎస్ కావటం విశేషం. ఇక టీసీఎస్ కోసం రుషికొండ సమీపంలోని ఐటీహిల్స్‌పై భవనాన్ని కూడా ఏపీ ప్రభుత్వం కేటాయించింది. హిల్–3లోని మిలీనియం టవర్స్ లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఈ భవనంలో ఉద్యోగులు పనిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ ఏర్పాట్లు కూడా తుది దశకు చేరుకున్నాయి. నవంబర్ నెలలో విశాఖ వేదికగా టీసీఎస్ కార్యకలాపాలు మొదలుపెట్టనుంది. ఈ విషయాన్ని ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా తెలిపారు.టీసీఎస్ క్యాంపస్‌లో తొలిదశలో 2 షిఫ్టులలో 2000 మంది ఉద్యోగులు పనిచేస్తారు. ఆ తర్వాత ఉద్యోగుల సంఖ్యను క్రమంగా ఆరు వేలకు పెంచాలనే ఆలోచనలో ఉన్నారు. అందుకు తగ్గట్లుగా మిలీనయం టవర్స్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఈ భవనం నుంచి తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తూనే.. టీసీఎస్ శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. రూ.1,370 కోట్లతో 12000 మందికి ఉపాధి కల్పించనుంది. టీసీఎస్ క్యాంపస్ కోసం ఏపీ ప్రభుత్వం ఐటీహిల్–3పై 22 ఎకరాలను కేటాయించింది. ఎకరా 99 పైసలకు చొప్పున కేటాయింపులు చేశారు.టీసీఎస్ బాటలో కాగ్నిజెంట్. మరోవైపు టీసీఎస్ బాటలోనే మరో ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ కూడా విశాఖలో పెట్టుబడులు పెట్టనుంది. రూ.1,582 కోట్లతో విశాఖలో కాగ్నిజెంట్ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతోంది. కాగ్నిజెంట్ క్యాంపస్ ద్వారా సుమారుగా 8000 మందికి ఉద్యోగాలు రానున్నాయి.. ఈ నేపథ్యంలో కాగ్నిజెంట్ సంస్థకు కూడా ఎకరా భూమి 99 పైసలకు కేటాయించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాపులుప్పాడ వద్ద 21.31 ఎకరాల భూమి కేటాయించింది. మరోవైపు కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ సీఈవో రవి కుమార్ వచ్చే నవంబర్‌లోనే విశాఖపట్నం పర్యటించనున్నారు. ఈ పర్యటనలోనే ఆయన విశాఖ కాగ్నిజెంట్ క్యాంపస్ ప్రారంభంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇవి కాకుండా గూగుల్ డేటా సెంటర్.. రూ.లక్ష కోట్లతో టీసీఎస్ డేటా సెంటర్ ఏర్పాటు కానున్నాయి.

మంగళవారం,
అక్టోబర్ 14, 2025
చర్య
తెలుగు దిన పత్రిక
8

# పశ్చిమ బెంగాల్‌లో ఎమ్‌బీబీఎస్ స్టూడెంట్ అత్యాచారం కేసు



**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్ లో ఎమ్‌బీబీఎస్ విద్యార్థిని అత్యాచారానికి గురైన ఘటన ప్రస్తుతం రాష్ట్రంలో సంచలనం రేకెత్తిస్తోంది. ఈ కేసుపై స్పందిస్తూ సీఎం మమతాబెనర్జీ చేసిన వ్యాఖ్యలు మరింత వివాదాస్పదంగా మారాయి. ప్రైవేటు కాలేజీ విద్యార్థిని అర్ధరాత్రి వేళ క్యాంపస్ వదిలి ఎలా బయటకు రాగలిగారని ప్రశ్నించారు . విద్యార్థుల భద్రతా వ్యవహారాల బాధ్యత యాజమాన్యాలదే అని అన్నారు. అయితే, బాధితురాలిపై రాత్రి 8 గంటల సమయంలో అఘాయిత్యం జరిగినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది.తన కూతురు రాత్రి 8 గంటల సమయంలో బయటకు వెళ్లిందని బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆ సమయంలోనే ఈ దారుణం జరిగి ందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌లో కూడా ఇదే విషయాన్ని నమోదు చేసినట్టు తెలిసింది.ఈ నేపథ్యంలో ముఖ్య మంత్రిపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. సీఎం అసత్యాలు పలు కుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే అగ్నిమిత్ర పాల్ మండిపడ్డారు. 'అఫ్ఘానిస్థాన్ వలెనే పశ్చిమ బెంగాల్‌లో కూడా మమతా బెనర్జీ సారథ్యంలో తాలిబాన్ల తరహా పాలన సాగుతోంది. రాష్ట్రంలో అర్ధరాత్రి మహిళలు బయటకు వెళ్లరని ముఖ్యమంత్రి అంటున్నారు. అంటే..రాత్రి బయటకు వెళితే దారుణాలు జరుగు తాయని సీఎం చెప్పదలుచుకున్నారా?' అని ప్రశ్నించారు.సీపీఎం రాష్ట్ర సెక్రెటరీ మొహమ్మద్ సలీమ్ కూడా సీఎం స్టేట్‌మెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తాలిబాన్ల పాలన కొనసాగుతోందా అని ప్రశ్నిం చారు. 'ఆర్‌జీ కార్ కేసులో పోలీసులు విచార ణను తప్పుదారి పట్టించారు. క్రిమినల్స్‌కు కొమ్ము కాశారు. అప్పుడు కూడా ఇలాగే మహిళలు అర్ధ రాత్రి పని చేయకూడదని అన్నారు. రాజారామ్ మోహన్ రాయ, విద్యాసాగర్ వంటి సంఘ సంస్క ర్తల ఉన్నతాశయాలకు ఇది విరుద్ధం. పురుషులు మహిళలు సమానమే. సీఎం ఎప్పుడూ మహిళల పైనే నెపం నెట్టే ప్రయత్నం చేస్తారు' అని అన్నా రు.తన కామెంట్స్ వివాదాస్పదం కావడంతో సీఎం బెనర్జీ స్పందిస్తూ మీడియాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలను మీడియా వక్రీక రించిందని అన్నారు. 'మీరు ఓ ప్రశ్న అడుగు తారు. నేను సమాధానం చెబుతాను. మీరు దాన్ని వక్రీకరిస్తారు. ఇలాంటి రాజకీయాలు చేయకండి' అని చెప్పారు.

# రాహుల్ ఓటు చోరీ వ్యాఖ్యలపై పిల్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** ఎన్నికల జాబితాలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయంటూ లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల పలు సందర్భాల్లో ఆరోపించారు. ఆయన ఆరోపణలపై విచారణకు మాజీ జడ్జి సారథ్యంలో ప్రత్యేక విచారణ బృందంఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారంనాడు తోసిపుచ్చింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్ ఆశ్రయించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిటిషనర్‌కు సూచించింది.'పిటిషనర్ తరఫు న్యాయవాది వాదన విన్నాం. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం కింద దాఖలైన ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు నిరాకరిస్తున్నాం. కావాలనుకుంటే ఈసీఐను పిటిషనర్ ఆశ్రయించవచ్చు' అని ధర్మాసనం పేర్కొంది. బెంగళూరు సెంట్రల్, ఇతర నియోజకవర్గాల్లో ఎన్నికల జాబితా అవకతవకలపై ఆగస్టు 7న రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఉటంకిస్తూ న్యాయవాది, కాంగ్రెస్ సభ్యుడు రోహిత్ పాండే ఈ పిటిషన్ వేశారు. ఎన్నికల జాబితా సన్నాహకాలు, నిర్వహణ, పబ్లికేషన్ విషయాల్లో ఈసీ పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోర్టును ఆయన కోరారు. అర్థవంతమైన వెరిఫికేషన్, ఆడిట్, పబ్లిక్ స్క్రూటినీకి వీలుగా మెషీన్-రీడబుల్ ఫార్మెట్‌లో ఎన్నికల జాబితాను పబ్లిష్ చేయాలని కూడా కోరారు.కాగా, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ పదేపదే విమర్శలు గుప్పిస్తూ వచ్చారు. కొందరు పారిశ్రామిక వేత్తలకు ప్రయోజనం చేకూర్చేందుకే ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో ఓట్ల చోరీ విషయంలో బీజేపీ విజయవంతమైందని, అయితే బీహార్‌లో మాత్రం ఓట్ల చోరీ జరగనీయమన్నారు. అయితే, ఈ ఆరోపణలను బీజేపీ నేతలతో పాటు ఎన్నికల కమిషన్ అధికారులు తోసిపుచ్చారు. రాహుల్ తన ఆరోపణలను తగిన ఆధారాలు చూపిస్తూ అఫిడవిట్‌తో ముందుకు రావాలని ఈసీ సూచించింది.

# రాజకీయ కక్షతోనే కేసు బీజేపీపై పోరాటం ఆగదు



**న్యూఢిల్లీ:** ఐఆర్‌సీటీసీ కేసులో లాలూ ప్రసాద్ యాదవ్ పైన, తన తల్లి రబ్రీదేవి, తనపైన ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టు అభియోగాలు దాఖలు చేయడంపై రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వి యాదవ్ స్పందించారు. ఈ కేసుపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు.రాజకీయ ప్రతీకారంతో పెట్టిన కేసు ఇదని, లాలూ ప్రసాద్ యాదవ్ చరిత్ర సృష్టించిన రైల్వే మంత్రి అని, ఈ నిజం బీహార్ ప్రజలకే కాకుండా యావత్ దేశానికి తెలుసునని సోమవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ తేజస్వి చెప్పారు. 'ఈ కేసుపై పోరాడతాం. ఎన్నికలు దగ్గర పడినప్పుడు కేసును తెరపైకి తెస్తారనే విషయాన్ని మొదట్నించి నేను చెబుతూనే ఉన్నాను. కోర్టు తీర్పును గౌరవిస్తున్నాను. దీనిపై మేము పోరాడతాం. బీహార్ ప్రజలు చాలా తెలివైనవారు, ఏం జరిగిందో వారందరికీ తెలుసు. ఇది కచ్చితంగా రాజకీయ కక్షే' అని అన్నారు.రైల్వేలకు రూ.90,000 కోట్ల లాభం చేకూర్చిన వ్యక్తి లాలూ అని, ప్రతి బడ్జెట్‌లోని రైల్వే టిక్కెట్ ధరలను తగ్గించారని, రైల్వే మంత్రిగా ఆయన చిరకాలం గుర్తుండిపోతారని అన్నారు. లాలూను స్టడీ చేసేందుకు హార్వార్డ్ నుంచి విద్యార్థులు కూడా వస్తుంటారని, మేనేజిమెంట్ గురుగా ఆయనకు ఎంతో పేరుందని చెప్పారు. ఈ నిజం బీహార్ ప్రజలకే కాకుండా యావత్ దేశానికి తెలుసునని అన్నారు. తాను బతికున్నంత కాలం బీజేపీపై పోరాడుతూనే ఉంటానని తేజస్వి స్పష్టం చేశారు.ఐఆర్‌సీటీసీ హోటల్ అవినీతి కేసులో రైల్వే శాఖ మాజీ మంత్రి లాలూ యాదవ్, రబ్రీ దేవి, తేజస్వి తదితరులపై మోసం, నేరపూరిత కుట్ర తదితర అభియోగాలను ఢిల్లీ కోర్టు సోమవారంనాడు దాఖలు చేసింది. లాలూ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు రాంచీ, పూరీలో ఐఆర్‌సీటీసీ హోటల్స్‌కు టెండర్లలో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలకు సంబంధించిన కేసు ఇది. ఈ కేసులో నిందితులు 14 మందిపై అభియోగాల నమోదుకు తగిన ఆధారాలున్నాయని కోర్టు తీర్పు సందర్భంగా పేర్కొంది. అయితే తాము ఎలాంటి తప్పిదాలు చేయలేదని, కేసును ఎదుర్కొంటామని లూలా తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

# సీట్ల కేటాయింపుపై జితన్ రామ్ మాంఝీ మనస్తాపం



**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్)కు 6 సీట్లు కేటాయించడంపై ఆ పార్టీ సుప్రీం, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ స్పందించారు. తమ పార్టీకి కేవలం ఆరు సీట్లు కేటాయించడంతో మనస్తాపం చెందినట్టు చెప్పారు. అయితే ఎన్డీయే నిర్ణయాన్ని తాను వ్యతిరేకించడం లేదన్నారు. కేంద్రంలోనూ, బిహార్‌లోనూ అధికార కూటమిని పటిష్టం చేసేందుకు తమ కృషి కొనసాగుతుందని చెప్పారు.'ప్రధాన మంత్రి మోదీకి కృతజ్ఞతలు తెలియజేసుకు ంటున్నాం. బిహార్‌కు ఎంతో చేశారు. సీట్ల షేరింగ్ విషయంలో నాయకత్వానికి మేము బాసటగా ఉంటాం. నాయకత్వం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం. ఎన్డీయే పటిష్టతకు కృషి చేస్తాం. బిహార్‌లో ప్రభుత్వాన్ని ఎన్డీయే ఏర్పాటు చేయనుంది' అని మాంఝీ చెప్పారు. తాము 15 సీట్లు అడిగినప్పటికీ కేవలం ఆరు సీట్లే ఇచ్చారని, దీనిపై మనస్తాపం చెందినప్పటికీ ఎన్డీయే నిర్ణయాన్ని వ్యతిరేకించడం లేదని అన్నారు. దక్కిన సీట్లతోనే ముందుకు వెళ్తామని తెలిపారు.హెచ్‌ఏఎం (సెక్యులర్)తో పాటు సీట్ల షేరింగ్‌లో భాగంగా రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహ రాష్ట్రీయ లోక్ మోర్చా కు కూడా ఆరు సీట్లు దక్కాయి. రాష్ట్రంలో బిగ్ బ్రదర్ ఎవరనే ప్రసక్తి లేకుండా జేడీయూ, బీజేపీ చెరో 101 సీట్లలో పోటీ చేయనున్నాయి. ఈ రెండు పార్టీల తర్వాత కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ సారథ్యంలోని లోక్ జన్‌శక్తి పార్టీ (రామ్ విలాస్) ఎక్కువ లబ్ధి పొందింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన ఐదు స్థానాలను ఆ పార్టీ గెలుచుకోవడాన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో 29 సీట్లు కేటాయించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రెండు విడతల్లో నవంబర్ 6,11 తేదీల్లో జరుగ నుండగా, నవంబర్ 14న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు..

# ఐఆర్‌సీటీసీ హోటల్స్ టెండర్స్ కేసు
# ఎన్నికల వేళ లాలూ కుటుంబానికి భారీ షాక్



**బిహార్ :**బిహాంఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఆర్జేడీ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులకు గట్టి షాక్ తగిలింది. ఐఆర్‌సీటీసీ హోటల్ టెండర్స్ కేసులో లాలూతో పాటు ఆయన సతీమణి రబ్రీదేవి, కుమారుడు తేజస్వీ యాదవ్‌పై ఢిల్లీ కోర్టు అభియోగాలు దాఖలు చేసింది. మోసం, నేర పూరిత కుట్ర తదితర అభియోగాలను మోపింది 2004-09 మధ్య లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఈ స్కామ్ బయటపడింది. ఐఆర్‌సీటీసీ హోటల్స్‌ల నిర్వహణకు సంబంధించిన కాంట్రాక్ట్‌ల కేటాయింపులో అవినీతి జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పట్లో ఐఆర్‌సీటీసీకి చెందిన బీఎన్ ఆర్ రాంచీ, బీఎన్ఆర్ పూరీ హోటల్స్ నిర్వహణ కాంట్రాక్ట్‌ను సుజాతా హోటల్‌కు ఇచ్చారు. అయితే, ఈ కాంట్రాక్ట్ కేటాయింపు తరువాత తాలూకు మూడు ఎకరాల విలువైన స్థలం ఓ బినామీ కంపెనీ ద్వారా లభించిందని సీబీఐ ఆరోపించింది. ఈ మేరకు 2017లో లాలూతో పాటు ఆయన కుటుంబసభ్యులపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసిందినిందితులపై అభియోగాలు దాఖలు చేసేందుకు తగిన ఆధారాలు ఉన్నాయని సీబీఐ తాజాగా కోర్టుకు తెలిపింది. అయితే, లాలూ తరఫు న్యాయవాది మాత్రం ఈ వాదనలను తోసిపుచ్చారు. పారదర్శక రీతిలో కాంట్రాక్ట్‌ల కేటాయింపులు జరిగాయని అన్నారు.అయితే, కోర్టు మాత్రం సీబీఐ వాదనలతో ఏకీభవించింది. ఈ కేసులో కుట్ర కోణం ఉన్నట్టు ప్రాథమిక ఆధారాలను బట్టి అర్థమవుతోందని పేర్కొంది. భూమి పొందినందుకు ప్రతిగా అధికార దుర్వినియోగం, టెండర్ల ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నం జరిగినట్టు వెల్లడించింది. బిహార్‌లో వచ్చే నెల 6, 11 తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. దీంతో, అక్కడ ప్రచార పర్వం ఊపందుకుంది. ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ భారీ స్థాయిలో ప్రచారం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో లాలూకు స్పీడుకు బ్రేకు లేసేలా కోర్టు తీర్పు వెలువడటం ప్రాధాన్యత సంతరించుకుంది.

# పీఎంవో ఆఫీసుకు చేరిన ఫిర్యాదు ఎయిమ్స్ సర్జన్‌పై సస్పెన్షన్




**న్యూఢిల్లీ:** ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో కార్డియో థోరాసిక్ అండ్ వాస్కులర్ సర్జరీ శాఖ అధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ ఏకే బిసోయిని సస్పెండ్ చేశారు. తనను వేధిస్తున్నట్లు ఓ మహిళా నర్సింగ్ ఆఫీసర్ ఫిర్యాదు చేయడంతో ఈ చర్య తీసుకున్నారు. ఎయిమ్స్‌కు చెందిన నర్సుల సంఘం పీఎంవోకు పదేపదే ఫిర్యాదులు చేయడంతో ఈ చర్యకు పాల్పడ్డారు. లైంగికంగా వేస్తున్నాడని, నీచమైన భాషను వాడుతున్నాడని, పని ప్రదేశంలో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు కార్డియో అధిపతిపై నర్సులు ఫిర్యాదు చేశారు.ఏకే బిసోయిని సస్పెండ్ చేయడంతో ఆ బాధ్యతలను సీటీవీఎస్ డిపార్ట్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వీ దేవగౌరవ్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ 30వ తేదీన ఫిర్యాదు లేఖ అందినట్లు ఎయిమ్స్ డైరెక్టర్ తెలిపారు. ఆ తర్వాత అక్టోబర్ 9వ తేదీన నర్సుల యూనియన్ పీఎంవోకు ఫిర్యాదు చేసింది. పని ప్రదేశంలో వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. తనపై ఫిర్యాదు చేసేవాళ్లను బెదిరించేలా ఆ డాక్టర్ వ్యవహరించినట్లు నర్సులు వెల్లడించారు.లైంగిక వేధింపులకు పాల్పడడమే కాకుండా దుర్భాషలాడేవారన్నారు. ప్రస్తుతం ఈ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నది. ఇంటర్నల్ కంప్లెయింట్స్ కమిటీకి ఆ ఫిర్యాదును రిఫర్ చేయనున్నారు. గతంలో కూడా డాక్టర్ ఏకే బిసోయిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. 2009లో కేంద్ర ఆరోగ్యశాఖ ఆయన్ను సస్పెండ్ చేసింది. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2019లో కూడా వేధింపు ఫిర్యాదులు ఉన్నాయి.

# యోగి ఆదిత్యనాథ్ చొరబాటుదారుడు ఆయనను ఉత్తరాఖండ్‌కు పంపండి




**లక్నో:** సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) చీఫ్ అఖిలేష్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను చొరబాటుదారుడని ఆరోపించారు. ఉత్తరాఖండ్ నుంచి వచ్చిన ఆయనను అక్కడకు పంపాలని అన్నారు. ఆదివారం రామ్ మనోహర్ లోహియా వర్ధంతి సందర్భంగా లక్నోలోని లోహియా పార్క్‌ను అఖిలేష్ యాదవ్ సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. కొన్ని రాజకీయ పార్టీలు చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా పరిగణిస్తున్నాయన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు.కాగా, వలసదారులకు సంబంధించి బీజేపీ వద్ద నకిలీ గణాంకాలున్నాయని అఖిలేష్ యాదవ్ విమర్శించారు. 'కొందరు వ్యక్తులు వలసల గణాంకాలు ఇస్తున్నారు. మనకు కూడా యూపీలో చొరబాటుదారులు ఉన్నారు. ముఖ్యమంత్రి (ఆదిత్యనాథ్) ఉత్తరాఖండ్‌కు చెందినవారు. మేం ఆయనను ఉత్తరాఖండ్‌కు పంపాలనుకుంటున్నాం. బీజేపీలో చొరబాటుదారులు ఉన్నారా లేదా చెప్పండి మరి?' అని అన్నారు.మరోవైపు సీఎం యోగి ఆదిత్యనాథ్ బీజేపీ సభ్యుడు కాదని అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. 'ఆయన (ఆదిత్యనాథ్) చొరబాటుదారుడే కాదు. సైద్ధాంతిక కోణంలో కూడా చొరబాటుదారుడు. ఆయన బీజేపీ సభ్యుడు కాదు. మరొక (పార్టీ) సభ్యుడు. కాబట్టి, ఈ చొరబాటుదారులను ఎప్పుడు తొలగిస్తారు?' అని ప్రశ్నించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# మేం 15 అడిగితే 6 మాత్రమే ఇచ్చారు




**బీహార్ :** బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోలాహలం జోరందుకుంది. అధికార, ప్రతిపక్ష కూటమిలు సీట్ల షేరింగ్‌లో బిజీగా ఉన్నాయి. ఆదివారం ఎన్డీయే కూటమి సీట్ల షేరింగ్ ప్రక్రియను పూర్తిచేసింది. అందులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి జితన్‌రామ్ మాంఝీనేతృత్వంలోని హిందుస్థానీ అవామ్ మోర్చా పార్టీకి 6 స్థానాలు దక్కాయి.దీనిపై ఇవాళ జితన్ రామ్ మాంఝీ స్పందించారు. మొత్తం 243 సీట్లలో తాము 15 సీట్ల కోసం డిమాండ్ చేశామని, కానీ కూటమి 6 సీట్లు మాత్రమే ఇచ్చిందని అన్నారు. అయినా కూటమి నిర్ణయాన్ని తాము గౌరవిస్తున్నామని చెప్పారు. బీహార్ గొప్పగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్డీయే కూటమిని మరింత బలోపేతం చేయడం కోసం తాము కృషి చేస్తామన్నారు. బీహార్‌లో మళ్లీ ఎన్డీయే కూటమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని జోస్యం చెప్పారు.కాగా బీహార్ అసెంబ్లీలోని మొత్తం 243 స్థానాలకుగాను ఎన్డేయే కూటమిలోని ప్రధాన పార్టీలైన బీజేపీ, జేడీయూ తలా 101 స్థానాల్లో బరిలో దిగుతున్నాయి. మిగిలిన 41 స్థానాల్లో చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్‌జనశక్తి పార్టీ 29 స్థానాల్లో పోటీచేయనుంది. మిగిలిన 12 స్థానాల్లో హిందుస్థానీ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ మోర్చా పార్టీలు ఆరేసి స్థానాల్లో పోటీపడనున్నాయి.

# ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో ప్రసంగించనున్న ట్రంప్



**టెల్ అవివ్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయిల్ చేరుకున్నారు. ఆయన జెరుసలాంలో ఉన్న ఇజ్రాయిలీ పార్లమెంట్ నీసెట్‌కు వెళ్తున్నారు. పార్లమెంట్‌ను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించనున్నారు. బెన్ గురియన్ విమానాశ్రయంలో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యహూ ఆయనకు స్వాగతం పలికారు. ఇజ్రాయిల్, హమాస్ మధ్య యుద్ధం ముగిసినట్లు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొంత మంది బంధీలను హమాస్ రిలీజ్ చేసింది. అయితే ఆ బంధీల కుటుంబాలను ట్రంప్ కలుసుకోనున్నారు. దీని కోసం ఆయన గాజా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. షర్మ్ ఎల్ షేక్‌లో జరగనున్న గాజా పీస్ సదస్సులో ట్రంప్ పాల్గొనున్నారు. ఈ సమావేశంలో సుమారు 20 మంది ప్రపంచ నేతలు పాల్గొనున్నారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ కూడా ఆ సమావేశాలకు హాజరవుతున్నారు.తాజా సమాచారం ప్రకారం ఏడు మంది ఇజ్రాయిలీ బంధీలను గాజాలో రిలీజ్ చేశారు. వాళ్లంతా ఇజ్రాయిల్ చేరుకున్నట్లు తెలుస్తోంది. బంధీలు రిలీజైన విషయాన్ని ఐడీఎఫ్ కన్ఫర్మ్ చేసింది. ఇవాళ మొత్తం 20 మంది బంధీలను రిలీజ్ చేయాల్సి ఉంది. దక్షిణ గాజాలో ఆ బంధీలను స్వీకరించేందుకు రెడ్ క్రాస్ సిద్ధంగా ఉంది. 2023, అక్టోబర్ 7వ తేదీన దక్షిణ ఇజ్రాయిల్ నుంచి ఆ బంధీలను పట్టుకెళ్లారు. అప్పగింతలో భాగంగా ఇజ్రాయిల్ సుమారు 250 మంది పాలస్తీనా ఖైదీలను రిలీజ్ చేయనున్నది. మరో 1700 మందిని కూడా రిలీజ్ చేయనున్నారు.గాజాలో ప్రకటించిన విషయం తెలసిందే. అయితే ఇజ్రాయిల్, హమాస్ డీల్‌కు చెందిన కీలక అంశాలను ఇంకా వెల్లడించాల్సి ఉంది. టెల్ అవివ్ చేరుకున్న తర్వాత ట్రంప్ మీడియాతో మాట్లాడారు. గాజాకు వెళ్లకున్నా అక్కడి పరిస్థితులు తనకు బాగా తెలుసు అని, అయితే వెళ్తానని, కనీసం అక్కడ నా కాలు మోపాలనుకుంటున్నట్లు చెప్పారు. మరీ వేగంగా వెళ్లాల్సిన అవసరం లేదని, సరైన సమయంలో సరైన వేగంతో వెళ్లాలని, అప్పుడే సమస్యలు తీరుతాయన్నారు.

# ప్రైవేట్ రంగానికి దోచిపెట్టడమెందుకు



ఆరోగ్యశ్రీ పేరుతో వేలకోట్లు తగులబెడుతున్న ప్రభుత్వాలు, ప్రజా వైద్యరంగాన్ని పటిష్టం చేసే ఆలోచనలు చేయడం లేదు. వైఎస్ హయంలో ఉమ్మడి ఎపిలో మొదలైన ఈ పథకం ద్వారా ప్రైవేట్ ఆస్పత్రులు బాగుపడుతున్నాయి. ఈ పథకం కింద పెట్టే ఖర్చుతో జిల్లాకో పది ఆస్పత్రులను నిర్మించవచ్చు. కానీ ప్రైవేట్ మాఫియా గుప్పిట్లో ఉన్న ప్రభుత్వాలు ఈ పథకం కోసం తగలేస్తున్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇలాంటిదే. ఈ రెండు పథకాలు రాష్ట్రాల ఖజానాను కొల్లగొడుతున్నాయి. ఇకపోతే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ కింద వైద్యాన్ని సెకండ్ గ్రేడ్ సిటిజన్ల కింద అందిస్తున్నారు. ఆస్పత్రులకు వెళ్లిన పేషెంట్లకు గౌరవప్రదమైన వైద్యం అందడం లేదు. ఈ పథకం కింద వచ్చే వారికి బిల్లులో మదింపు చేసి ఎక్కువ చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే వీరిని నాసిరకం మనుషులుగా ట్రీట్ చేస్తున్నారు. ప్రత్యేక వార్డులు, ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. దీనిపై ఎవ్వరు కూడా అడగడం లేదు. డబ్బులు తీసుకోవడంలో ఏ మాత్రం తగ్గని ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు, వైద్య చికిత్సలో మాత్రం డబ్బులున్న వారికి ఓ రకంగా, ఆరోగ్యశ్రీ కింద వచ్చే పేషెంట్‌లను మరోరకంగా ట్రీట్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాల్లో వైద్యరంగాన్ని బలోపేతం చేయాల్సింది. జనాభాకు తగ్గట్లుగా ఆస్పత్రులను నిర్మించి, ఆరోగ్యశ్రీ భారాన్ని తగ్గించాల్సిన అసవరం ఉంది. ఈ డబ్బులతో వందలాది ఆస్పత్రుల నిర్మాణం చేయవచ్చు. ఇకపోతే తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి చేయాలి. ప్రైవేట్‌ను మంచి ఆస్పత్రులను అభివృద్ది చేయాలి. ఎపిలో పిపిపి కింద ఆస్పత్రుల నిర్మాణం చేపట్టడం మంచి పరిణామం. వైద్య కళాశాలలను, ఆస్పత్రులను ఇదే తరహా అభివృద్ది చేయాల్సిందే. దీనిపై నిజాలు తెలియకుండా విపక్ష వైసిపి నేతలు, దాని అధినేత జగన్ చేస్తున్న విమర్శల్లో అర్థం లేదు. ప్రభుత్వపరంగా వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తెస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటుపరం చేస్తోందని వైసీపీ కొన్ని రోజులుగా విమర్శలు చేస్తోంది. పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శలు కురిపిస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు మోడల్‌లో నిర్మించాలన్న నిర్ణయం తీసుకునే ముందు అందుకు గల కారణాలను వివరించి ఉంటే ఈ పంచాయితీ వచ్చేది కాదు. నిజానికి వైద్య కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏటా వేలాదిమంది విద్యార్థులు కోట్లాది రూపాయలను విదేశాలకు తగలేస్తున్నారు. అలా కాకుండా ఇక్కడే నాణ్యమైన వైద్యవిద్యను అందించగలిగితే డబ్బు వృధాకాదు. అంతేకాకుండా వాటికి అనుబంధంగా ఆస్పత్రులను బలోపేతం చేయాల్సి ఉంది. ఫ్యాకల్టీని, వైద్యులను కూడా సిద్దం చేసుకోవాలి. ఈ రకమైన ప్రయత్నాలు కూడా ప్రత్యామ్నాయంగా సాగాలి. వైద్య విద్యను బోధించే సిబ్బందిని సమకూర్చుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేయడం సమర్థనీయం కూడా కాదు. సంక్షేమం పేరిట దుబారా ఖర్చు చేస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యా,వైద్యరంగాలను బలోపేతం చేసేందుకు అధిక నిధులను వెచ్చించాలి.. బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఆకర్షితులవుతున్నారు. దీనిని కూడా ప్రభుత్వాలు అధ్యయనం చేయాలి. ప్రైవేటు రంగంలోని ఆస్పత్రుల్లో వైద్యంపైనే ప్రజలు మక్కువ పడుతున్నారు. గాంధీ, ఉస్మానియా, వరంగల్ ఎంజిఎం లాంటి ఆస్పత్రలకు వెళ్లాలనుకోవడం లేదు. గుంటూరు, విజయవాడ, తిరుపతిల్లో కూడా ఇలాంటి దుస్థితి ఉంది. ఈ ఆస్పత్రులను ముందుగా బలోపేతం చేయాలి. ప్రవైట్ ఆస్పత్రలుకు పోటీగా అన్నిరకాల వైద్యసేవలు, వైద్య సర్వీసులను అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రైవేట్ గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చడానికే ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉన్నా ఆసక్తి కనిపించడం లేదు. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నా..కూడా ఫలితం కానరావడం లేదు. ఈ క్రమంలో ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వడం న్యాయనం కాదు. దీనిపై ప్రభుత్వాలు ఆలోచనలు చేయాలి. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. అంటే సక్రమంగా నిధుల వెచ్చింపు జరగడం లేదని గుర్తించాలి. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు విద్యా సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వాలు తమ ప్రాధాన్యం పెంచాలి. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడేలా చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పోతోందనడానికి ప్రైవేట్ పోటీ పెరగడమే. ప్రభుత్వ రంగంలో ఆస్పత్రులను తీర్చిదిద్దితే ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు అవసరం ఉండదు. ప్రభుత్వ విద్యా,వైద్యరంగంలో జవాబుదారీతనం కూడా తీసుకుని రావాలి. వీటిపై అజమాయిషీ కూడా పెంచాలి. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా బాగానే నడుస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం సిబ్బందిలో జవాబుదారీతనం లేకపోవడమే. ఆస్పత్రులైనా, కళాశాలలైనా నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నప్పుడే వాటిపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. పేరొందిన డాక్టర్లతోనే వైద్యం చేయించుకోవాలని ఎవరైనా కోరుకుంటారు. అలానే సరైన ఫ్యాకల్టీ ఉన్న వైద్య కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు ఆసక్తి చూపుతారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన ఫీజుల చెల్లింపు పథకం ఫలితంగా ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. ఫలితంగా రెండు రకాలుగా నష్టం జరిగింది. ఇంజనీరింగ్ విద్య నాణ్యత దెబ్బతింది. ఆయా కళాశాలలు మూతపడ్డాయి. నాణ్యతలేని ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వేల, లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మన కళ్ల ముందే కనిపిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యతో పోలిస్తే వైద్య విద్యలో ఫ్యాకల్టీ ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. ఇదే విషయాన్ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. దీనిని సాకారం చేయాల్సి ఉంది. తెలుగునాట ఇద్దరు సిఎంలు కూడా ఈ రెండు రంగాలను పట్టాలకెక్కించాల్సిందే. ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్‌లతో పనిలేకుండా చేయగలగాలి. అప్పుడే రాష్ట్రాలు పురోగమిస్తాయి.




# అమల్లోకి గాజా ఒప్పందం

- బందీలను విడిచి పెట్టిన హమాస్
- తొలివిడతలో ఏడుగురిని రెడ్‌క్రాస్‌కు అప్పగింత

**న్యూఢిల్లీ,అక్టోబర్13:** గాజా శాంతి ఒప్పందం ప్రక్రియ మొదలయ్యింది. బందీల విడుదలను ప్రారంభించాయి. ఈ క్రమంలో దాదాపు రెండేళ్లుగా హమాస్ చెరలో బందీలుగా ఉన్న వారికి సోమవారం విముక్తి లభించింది. తొలి దశలో భాగంగా ఏడుగురు బందీలను రెడ్‌క్రాస్‌కు హమాస్ అప్పగించింది. ఖాన్ యూనిస్ నుంచి వారిని తీసుకుని రెడ్‌క్రాస్ వాహనశ్రేణి ఇజ్రాయెల్‌కు బయల్దేరింది. బందీలు విడుదల వడంతో వారి కుటుంబసభ్యులు, శ్రేయాభిలాషుల్లో సంతోషం నెలకొంది. మిగతా బందీలను కూడా హమాస్ విడిచిపెట్టనుంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా ఇజ్రాయెల్, హమాస్ ఇటీవల కాల్పుల విరమణకు అంగీకరించిన సంగతి తెలిసిందే. శుక్రవారం నుంచే ఈ ఒప్పందం అమల్లోకి రాగా.. బందీల విడుదల నేడు ప్రారంభమైంది. ఒప్పందం కింద తమ వద్ద ఉన్న 48 మంది బందీలను హమాస్ విడిచిపెట్టనుంది. అయితే, ఇందులో 20 మందే సజీవంగా ఉన్నారు. వీరిని గాజాలోని మూడు ప్రాంతాల్లో హమాస్ విడుదల చేయనుంది. ఇందుకు ప్రతిగా 2వేల మందికి పైగా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. . ఈ విడుదల కార్యక్రమం ముగిసిన తర్వాత ట్రంప్ శాంతి ప్రణాళికలో రెండో దశపై చర్చలు ప్రారంభమవుతాయి. ఇందులో హమాస్ ఆయుధాలను త్యజించడం.. గాజా నుంచి ఇజ్రాయెల్ దళాల ఉపసంహరణ ప్రధాన అంశాలు. ఈ చర్చలకు అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో కీలక పాత్ర పోషించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం ఇజ్రాయెల్, ఈజిప్టులలో పర్యటించనున్నారు. తొలుత ఆయన జెరూసలెంలో ఇజ్రాయెల్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగిస్తారు. బందీల కుటుంబసభ్యులను కలుస్తారు. అక్కడి నుంచి ఈజిప్టు వెళతారు. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడి చేసి 1200 మందిని హత్య చేసి, 251 మందిని హమాస్ అపహరించిన సంగతి తెలిసిందే. వారిలో కొంతమందిని గతంలో విడుదల చేసింది. కొందరిని ఇజ్రాయెల్ సైన్యం రక్షించింది. మరికొంతమంది ప్రాణాలు కోల్పోయారు. మిగిలినవారిని హమాస్ ఇప్పుడు విడిచిపెడుతోంది.




# కూలుతున్న ప్రపంచాల నైరాశ్యం



ప్రపంచం ఇక అంతాన్ని సమీపించింది. కానీ ఆ అంతం ఒక అగ్ని వర్షం గానో, జల ప్రళయం గానో ఒక్క పెట్టున వచ్చిపడేది కాదు. ఒక నైతిక పతనంగా, భౌతిక క్షయంగా, అతిమెల్లగా దాపురిస్తుంది. – ఇదీ లాస్లో క్రస్నహొర్కాయ్ నవలల్లోని వాతావరణం. అతని తొలి రెండు ప్రసిద్ధ నవలల్లోనూ ప్రపంచం ఇక రేపో మాపో అంతం కాబోతుందన్న గుబులు ఉంటుంది. ఆ అంతానికి కారణం ఏమిటన్నది స్పష్టంగా వ్యక్తం కాదు. కానీ నవలల్లోని పాత్రలన్నీ ఆ సమీపిస్తున్న అంతాన్ని నిశ్శబ్దంగా ఒప్పుకున్నట్టే ప్రవర్తిస్తాయి. చుట్టూ క్రమంగా శిథిలమై కూలుతున్న ప్రపంచాల మధ్య తమని కాపాడే ఆశ కోసం ఎదురు చూస్తుంటాయి. ఆ ఆశ ఎప్పటికీ రాదు. ఒక్కోసారి ఎవరో రాబోయే మనిషి తమని కాపాడతాడన్న ఎదురుచూపు ఉంటుంది. కానీ ఆ వచ్చిన మనిషి తన కోసం ఎదురుచూస్తున్న వాళ్ళని మోసం చేసి వెళ్ళిపోతాడు. లాస్లో క్రస్నహొర్కాయ్‌కు ఇలాంటి ఇతివృత్తాలను సరఫరా చేసింది అతని స్వదేశమైన హంగరీలో ఆనాటి రాజకీయ వాతావరణమే అనుకోవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత హంగరీ సోవియట్ రష్యా అధీనం లోని ఒక దేశంగా మారింది. స్టాలిన్ అదుపాజ్ఞల కింద హంగరీలో కూడా కమ్యూనిస్ట్ పాలన మొదలైంది. స్టాలిన్ చనిపోయాకా 1956లో హంగరీలో రష్యన్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఒక ఉద్యమం మొదలైనప్పటికీ, రష్యా దాన్ని యుద్ధటాంకులతో హింసాత్మకంగా అణచివేసింది. ఆ తర్వాత ఇక 1989 దాకా హంగరీలో కమ్యూనిస్టు పాలనే కొనసాగింది. ఈ కాలమంతా ప్రజల సామాజిక జీవితం భయం, అణచివేతల మధ్య గడిచింది. 1960ల నుంచి క్రమంగా హంగరీపై రష్యా అదుపు తగ్గించుకుంటూ వచ్చినా, ప్రజలకు స్వేచ్ఛ మాత్రం పరిమితమే. లాస్లో క్రస్నహొర్కాయ్ బాల్యం, యవ్వనం అంతా ఈ వాతావరణంలోనే గడిచింది. 1989లో తన 35 ఏళ్ళ వయస్సులో కమ్యూనిస్టు పాలన ముగిసిన సందర్భాన్ని తలచుకుంటూ, "ఆ రాజకీయ స్వేచ్ఛ నమ్మశక్యం కాని విషయంలా అనిపించింది," అంటాడు లాస్లో. "అప్పటి దాకా అదో కాలం కదలని సమాజం. పరిస్థితులు ఎప్పటికైనా మారతాయన్న ఆశలేకుండా చేశారు పాలకులు. ఎప్పుడూ అదే బూడిదరంగు ఆకాశం, కళా కాంతుల్లేని చెట్లు, పార్కులు, వీధులు, భవనాలు, నగరాలు. చవక బార్లు, పేదరికం, మాటపై నిషేధం. మార్క్సిజంపై నమ్మకం కోల్పోయిన తొలి తరం మాది," అంటాడు. లాస్లో క్రస్నహొర్కాయ్ 1954లో జ్యులా పట్టణంలో పుట్టాడు. అతని అసలు ఇంటి పేరు 'కొరీన్'. కానీ అంతకుముందు హిట్లర్ చెలరేగిన కాలంలో తమని యూదులుగా పట్టించి వేసే ప్రమాదం ఉన్న ఆ ఇంటి పేరును లాస్లో తాతయ్య 'క్రస్నహొర్కాయ్'గా మార్చాడు. (అది హంగరీలో ఒక పాత కోట పేరు.) తనకు యూదు మూలాలు ఉన్నాయన్న సంగతి లాస్లోకి కూడా పదకొండేళ్ల వయసు వచ్చే దాకా తెలియదు. పంతొమ్మిదేళ్ళ వయసులో– నిర్బంధ మిలటరీ పని నుంచి తప్పించుకోవాలని కొంతా, దాస్తవిస్కీ లాంటి పంతొమ్మిదో శతాబ్దం రష్యన్ రచయితల ప్రభావంతో కొంతా– లాస్లో క్రస్నహొర్కాయ్ ఇల్లు వదలి పేద ప్రజల మధ్యకు వెళ్ళి చిన్నా చితకా ఉద్యోగాలు చేయటం మొదలుపెట్టాడు. గనుల్లో కూలీ పని నుంచి డైరీ ఫార్మ్‌లో నైట్ వాచ్‌మన్ పని దాకా రకరకాల ఉద్యోగాలు చేస్తూ హంగరీ అంతా దేశదిమ్మరిలా తిరిగాడు. రాత్రిపూట డైరీ ఫార్మ్‌లో వందలాది ఆవులకు కాపలా కాస్తూనే తన తొలి నవల 'సాటాన్‌టాంగో' రాశాడు. వర్షపు బురద నిండిన వీధులూ, కూలిపోతున్న ఇళ్లూ, ఏదీ పండని సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు, పాడైపోయిన మిల్లులు, పేద జనం మసిలే ఇరుకుబార్లు... ఇదీ నవలకు నేపథ్యం. (ఈ నవలను దర్శకుడు బేలా టార్ 1994లో ఏకంగా ఏడున్నర గంటల సినిమాగా తీశాడు!)లాస్లో అంత సులువుగా చదివించే రచయిత కాదు. అతని నవలల్లోని పాత్రలు కదలని కాలంలో చిక్కుకుపోయి ఉన్నట్టు గానే, వాటిని చదివే పాఠకుడు కూడా ఆ ఎడతెగని వాక్యాల వరద మధ్య చిక్కుకుపోతాడు. వేగంగా కదులుతూ కూడా ఎటూ పోని లాస్లో వాక్యాలు చాలా పొడవుగా ఉంటాయి. పేరాల విభజన లేకుండా, ఫుల్‌స్టాపులు కూడా లేకుండా పేజీలకు పేజీలు కొనసాగుతాయి. "ఫుల్‌స్టాప్ అవసరం ఉన్నది దేవుడు ఒక్కడికే. అంతా ముగిసే అంతంలో ఒక ఫుల్‌స్టాప్ వాడతాడు తప్పకుండా," అంటాడు. ఆయన ప్రసిద్ధ నవల 'సాటన్‌టాంగో'లో మొదటి వాక్యమే ఆరు పేజీల పాటు ఏ ఫుల్‌స్టాప్ లేకుండా కొనసాగుతుంది! "ఒక స్నేహితుడితో పాటూ కూర్చుని రాత్రి పూటంతా మేల్కొని మన జీవితంలో ఎంతో ముఖ్యమైన విషయాన్ని అతనికి అర్థమయ్యేలా చెబుతున్నప్పుడు, మన మాటలకి ఫుల్‌స్టాపులూ కామాలూ అవసరం లేదు. మాట్లాడేందుకు ఊపిరీ, మాటల్లో లయా మాత్రమే కావాలి. నేను ఫుల్‌స్టాపులు తక్కువ వాడాలనీ, పొడవాటి వాక్యాలు మాత్రమే రాయాలనీ ఏమీ నియమం లాగ పెట్టుకోలేదు. పాఠకుడిని చేరువ చేసుకుని అతన్ని కన్విన్స్ చేయటానికి కథ చెప్తున్నప్పుడు నాకు ఆ లయా, ఆ రాగం, అలాంటి వాక్య నిర్మాణం సహజంగా వచ్చేశాయి," అంటాడు. యవ్వనంలో తన చుట్టూ చవి చూసిన రాజకీయమైన ఉక్కపోత లాస్లో రచనల ఇతివృత్తాలను, శైలిని నిర్దేశించింది. అయితే అతను తన రచనలను నిరంకుశ రాజకీయ వ్యవస్థలపై ఎక్కుపెట్టలేదు. అలాంటి వ్యవస్థల కింద సమాజం క్రమ క్రమంగా క్షీణించే తీరుపై ఎక్కువ దృష్టిపెట్టాడు. ఇక అంత్య దశకు వచ్చేసిన ప్రపంచం ఏదో మహా విపత్తు వైపు క్రమంగా జారుతున్న వాతావరణం అతని నవలల నిండా పరుచుకుని ఉంటుంది.

# కవితా జీవనది జూకంటి



ప్రియురాలి మునివేళ్లు, తేనె తెట్టులో మకరందం, మల్లెపువ్వులో సువాసన దగ్గరే ఆగిపోకుండా పగిలిన వరిమడిని, వేపచెట్టుకు వేలాడుతున్న రైతు శవాన్ని, దగ్ధమవుతున్న అంటరాని పూరి గుడిసెను, ఒరిగిపోతున్న ఆదివాసీ వీరుడిని, కుతకుత ఉడుకుతున్న తెలంగాణ అస్తిత్వాన్ని, గ్లోబల్ ఖడ్గానికి మౌనంగా తెగిపడుతున్న మానవ సంబంధాలను అక్షరాలతో పుటం పెడుతున్న కవుల వరుసలో అపురూపమైన కవి జూకంటి జగన్నాథం. ఆయన మౌనంగా ఉంటాడు, మెరుపుల ప్రపంచానికి దూరంగా ఉంటాడు, పల్లెను మోసుకు తిరుగుతాడు, మాయిముంత వాసనేస్తాడు, అల్పాక్షరాలలో వ్యక్తమవుతాడు. ఆయన సిరిసిల్ల, ఆయన జగిత్యాల, ఆయన మానేరు. ఆయనొక నిరంతరం ప్రవహించే కవితా జీవనది. ఏడు పదుల జూకంటి అర్ధశతాబ్దంగా కవిత్వమే జీవితంగా రాస్తున్నాడు. జూకంటి జగన్నాథం దేశం స్వాతంత్ర్యం పొందిన తొలినాళ్లలో ఈ భూమి మీద పడ్డాడు. అభ్యుదయ కవిత్వం తెలుగు సాహిత్యాన్ని శాసిస్తున్న కాలంలో కష్టజీవికి ఇరువైపుల ఉన్నవాళ్లే కవులనే భావన విస్తారంగా వ్యాపించి ఉండింది. కానీ ఆ కవులే కలాన్ని దించి అంతర్ బహిర్ యుద్ధరవానికి విరామం ప్రకటించారు. ఆ కాలం లోనే అగ్నిగోళంలా మండుతున్న ప్రపంచంలో విస్మరణకు గురైన సమూహాల నుంచి అనేక ప్రశ్నలు ఉదయించాయి. భారత సమాజం ఈ క్రమానికి మినహాయింపు కాలేకపోయింది. నల్లమందు మింగి మత్తుగా ఉన్న కవి వర్యున్ని యువకవులు ప్రశ్నించారు. సామాన్యుని ఆర్తిని ఆకాశమంత ఎత్తుకు అరిచిన కాలంలో జూకంటి బాల్య దశను దాటి యవ్వన కాలాన్ని అందుకోవడానికి 'ఆకాశానికి నిచ్చెన' వేసాడు.

# ఈ మసాలా దినుసులతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు!

మన నిత్యజీవితంలో ఉపయోగించే మసాలా దినుసులు మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తాయి అనే విషయం ప్రతి ఒక్కరికి ఖచ్చితంగా తెలుసుకోవాలి. మసాలా దినుసులను మనం వివిధ రకాల వంటకాలలో సువాసనను, రుచిని పెంచడానికి ఉపయోగిస్తూ ఉంటాం. అయితే అటువంటి మసాలా దినుసు లు మనకు కావాల్సిన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దాగున్నాయి .అవి మన శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి. వాటి గురించి ప్రస్తుతం తెలుసుకుందాం.

**లవంగాలు :** లవంగాలలో యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. లవంగాలు వంటల రుచిని పెంచడమే కాకుండా జలుబు, దగ్గు, పంటి నొప్పి వంటి సమస్యలకు ఎంతో బాగా పని చేస్తాయి. లవంగాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల మన జీర్ణక్రియ, అజీర్ణం, గ్యాస్ సమస్యలు తగ్గు తాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను లవంగాలు నివారిస్తాయి.



**యాలుకలు :** వివిధ వంటకాలలో ఉపయోగించే యాలకులు మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి స్తాయి. యాలుకలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల అధిక రక్తపోటు నియంత్రించబడుతుంది. డిప్రెషన్‌ను తగ్గించడానికి యాలుకలు ఎంతో ఉపయోగపడతాయి. యాలకులు జీర్ణక్రియను మెరుగుపరిచి జీర్ణ సంబంధిత సమస్యలకు పరిష్కారంగా ఉంటాయి.ఒత్తిడిని, ఆందోళనను తగ్గించడంలో యాలుకలు ఎంత బాగా ఉపయోగపడతాయి.

**దాల్చిన చెక్క :** దాల్చిన చెక్క మనకు ఆరోగ్యాన్ని ఇవ్వడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని, మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది.జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.అధిక రక్తపోటును తగ్గిస్తుంది.డయాబెటిస్ తగ్గించడానికి కూడా ఎంతగానో దోహదం చేస్తుంది. దాల్చిన చెక్క లో మన చర్మానికి ఆరోగ్యాన్నిచ్చే గుణాలు కూడా ఉన్నాయి మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి.

**బిర్యానీ ఆకు :** బిర్యానీ ఆకు మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. ఇది యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ లను నివారిస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా బిర్యానీ ఆకు మెరుగుపరుస్తుంది. డయాబెటిస్‌ను ఒత్తిడిని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. కడుపునొప్పి, తలనొప్పి, జలుబు వంటి వాటికి ఎంతో బాగా ఉపయోగపడుతుంది. బిర్యానీఆకులో మన శరీరానికి కావాల్సిన ఎన్నో పోషకాలు ఉంటాయి.

# కొబ్బరి నీరులో పోషక విలువలు

కొబ్బరి నీరు ఆరోగ్యానికి ఎంతో మంచిదని అందరికీ తెలిసిందే. ఇది సహజంగా ఎలక్ట్రోలైట్లు, విటమిన్లు, ఖనిజ లవణాలతో సమృద్ధిగా ఉంటుంది. అయితే, మూత్రపిండాల (కిడ్నీ) సమస్యలతో బాధపడుతున్న వారు కొబ్బరి నీరు తాగడం మంచిదా అనే ప్రశ్న చలా మందిలో ఉంది. అయితే ఇది వారి ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది.

**కొబ్బరి నీరులో పోషక విలువలు:**కొబ్బరి నీరు సహజంగా పొటాషియం, సోడియం, మెగ్నీషియం, కాల్షియం,ఇతర ఖనిజ లవణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేయ దంలో సహాయపడుతుంది. కొబ్బరి నీరులో తక్కువ శాతం చక్కెర, కొవ్వు ఉంటాయి,అందువల్ల ఇది ఆరోగ్యకరమైన పానీయంగా పరిగణించబడుతుంది.

**మూత్రపిండాల సమస్యలు :** కొబ్బరి నీరు శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో సహాయపడుతుంది, ఇది మూత్రపిండాల్లో కణికలు ఏర్పడకుండా ఉండటానికి ఉపయోగపడుతుంది. ఇందులో నెచురల్ సిట్రేట్ (Citrate) ఉండడం వల్ల, రాళ్లు ఏర్పడే అవకాశాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా కాల్షియం ఆక్సలేట్ రాళ్లు ఉన్నవారు కొబ్బరి నీరు త్రాగడం వల్ల ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. అయితే మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, పొటాషియం శరీరంలో పేరుకుని, ప్రమాదకరమైన స్థాయికి చేరుకోవచ్చు. కొబ్బరి నీరులో పొటాషియం అధికంగా ఉండడం వల్ల, కొంతమంది కిడ్నీ రోగులకు ఇది మేలు కాకపోవచ్చు. హైపర్‌కలేమియా ఉన్న వారు కొబ్బరి నీరు తాగేటప్పుడు వైద్యుడి సలహా తీసుకోవడం మంచిది.

**క్రానిక్ కిడ్నీ డిసీజ్ :** దీర్ఘకాలిక మూత్రపిండ సమస్యలతో బాధపడేవారు ద్రవ పానీయాల (Fluid Intake) పరిమాణాన్ని నియంత్రించాలి. కొబ్బరి నీరులోని ఎలక్ట్రోలైట్లు, ముఖ్యంగా పొటాషియం అధిక స్థాయిలో ఉండడం వల్ల, CKD ఉన్నవారికి ప్రతికూల ప్రభావం కలిగించే అవకాశం ఉంది. కాబట్టి, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో ఉన్నవారు కొబ్బరి నీరు త్రాగేముందు వైద్యుని సంప్రదించడం మంచిది. కొబ్బరి నీరు రక్తపోటును కొంతవరకు నియంత్రించడం లో సహాయపడుతుంది. కానీ, అధిక సోడియం లెవల్స్ ఉన్నవారు, లేదా సోడియం పరిమిత ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉన్నవారు, కొబ్బరి నీరు త్రాగేముందు జాగ్రత్తగా ఉండాలి.

**ఎవరికి తాగొచ్చు? ఎవరికి తాగకూడదు?** చిన్నపాటి మూత్రపిండ రాళ్లు ఉన్నవారు. సాధారణ మూత్రపిండ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలనుకునేవారు. తక్కువ పొటాషియం స్థాయితో



ఉన్నవారు కొబ్బరి నీరు తాగొచ్చు. అయితే హైపర్‌కలేమియా (అధికపొటాషియం) ఉన్న వారు . క్రానిక్ కిడ్నీ డిసీజ్ (CKD) ఉన్నవా రు. అధిక సోడియం నియంత్రణ అవసరమైన వారు కొబ్బరి నీరు తీసుకోకపోవడమే మంచిది. మూత్రపిండాల సమస్య ఉన్నవారు కొబ్బరి నీరు త్రాగేముందు వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకోవాలి. కొబ్బరి నీరు ఆరోగ్యకంమైనదైనా, అది కొన్ని మూత్రపిండ సమస్యలలో ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది కాబట్టి, మీకు కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉంటే, ముందుగా వైద్య నిపుణుల సలహా తీసుకుని, అవసరమైన మార్గదర్శకత్వాన్ని పాటించడం ఉత్తమం.

# చల్లచల్లగా.. ఆరోగ్యంగా!







మండే ఎండకాలం మొదలైంది. వేడి వాతావరణంలో శరీరాన్ని చల్లగా ఉంచడానికి చాలామంది కూల్ డ్రింక్స్‌ను ఆశ్రయిస్తుంటారు. రసాయ నాలు, ప్రిజర్వేటివ్స్, గ్యాస్ కలిసిన వీటిని తాగితే.. ఆరోగ్యం దెబ్బతింటుంది. కాబట్టి, ఈ సమ్మర్‌లో వాటి జోలికి వెళ్లకుండా.. ఇంట్లో లభించే పదార్థాలతోనే ఆరోగ్యకరమైన పానీయాలు చేసుకోండి. ఇవి.. ఎండల నుంచి రక్షణను ఇవ్వడమే కాదు, ఆరోగ్యానికి మంచి చేస్తాయి. ఒంట్లో వేడిని తగ్గించి.. శరీరానికి కొత్త శక్తిని అందిస్తాయి.

**పైనాపిల్ - నిమ్మరసం :** వేసవి వేడితో అలసటకు గురయ్యే వారికి.. పైనాపిల్ – నిమ్మరసం డ్రింక్ ఎంతో మేలుచేస్తుంది. నాలుగు నుంచి ఐదు పైనాపిల్ ముక్కలను నిమ్మరసంతో కలిపి బ్లెండ్ చేసుకోవాలి. దీనికి కొద్దిగా చల్లని నీటిని జోడించి తాగితే.. శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. తీపి కోసం కొద్దిగా తేనెను కలుపుకోవచ్చు.

**అల్లం-నిమ్మకాయ :** లీటర్ నీటిలో ఒక నిమ్మకాయను పూర్తిగా పిండండి. అంగుళం అల్లం ముక్క, పుదీనా ఆకులను మెత్తగా దంచి నీటిలో బాగా కలపండి. ఈ మిశ్రమానికి చిటి కెడు నల్ల మిరియాల పొడి కలిపి తాగితే.. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. నానబెట్టిన చియా విత్తనాలను కూడా జోడిస్తే.. ఒంటికి చలు వ చేస్తుంది.

**నిమ్మకాయ-పుదీనా :** ఒక లీటర్ నీటిని తీసుకొని.. ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, నాలుగైదు పుదీనా ఆకులు వేయాలి. దీనికి కొద్ది గా ఉప్పు, తేనె జోడించి తాగితే.. శరీరానికి తక్షణ చల్లదనం లభిస్తుంది. చల్లచల్లగా తాగాల నుకుంటే.. ఐస్ క్యూబ్స్‌తో కలిపి కూడా తాగవ చ్చు. నిమ్మకాయలో లభించే విటమిన్ సి శరీరా న్ని హైడ్రేట్ చేయడంతోపాటు పుదీనా ఆకులు జీర్ణ వ్యవస్థకు మేలుచేస్తాయి.

**జీలకర్ర - నిమ్మకాయ :** లీటర్ నీటిలో రెండు టేబుల్ స్పూన్ల జీలకర్ర వేసి.. స్టవ్ మీదపెట్టి బాగా మరగనివ్వండి. ఆ తర్వాత నీటిని వడగట్టి.. అందులో ఒక నిమ్మకాయ రసాన్ని పిండి.. కాసేపు ఫ్రిజ్‌లో పెట్టేయండి. ఈ నీటిని చల్ల చల్లగా తాగితే.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనికి దాల్చినచెక్క పొడి, తేనె కలిపితే మరిన్ని ప్రయోజనాలు అందుతాయి. ఈ డ్రింక్.... శరీరంలో వేడిని తగ్గించడం తోపాటు జీర్ణక్రియనూ మెరుగుపరుస్తుంది.

# అంతరిక్ష పరిశోధనలను మలుపు తిప్పేలా- మార్స్‌పై.. !!


Mars: అంతరిక్ష పరిశోధనల్లో సరికొత్త ఆవిష్కరణకు తెర తీసింది చైనా. అంగారక గ్రహంపై నీటి జాడను గుర్తించింది. ఒకప్పుడు లోతైన సముద్రాలు, సువిశాల ఇసుక తిన్నెలు ఉండేవనే నిర్ధారణకు వచ్చింది. ఈ మేరకు నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రొసీడింగ్స్‌లో ఓ జర్నల్‌ను ప్రచురించింది.

**చైనా రోవర్..**

మార్స్ పై పరిశోధనలను నిర్వహించడానికి ఝురాంగ్ అనే రోవర్‌ను పంపించింది చైనా. 2021లో ఇది అక్కడ ల్యాండ్ అయింది. అప్పటి నుంచీ రీసెర్చ్ కొనసాగిస్తోంది. తాజాగా నీటి జాడలను గుర్తించింది. ఒకప్పుడు అంగారక గ్రహం ఇప్పుడు ఉన్నట్టుగా ఉండేది కాదని తేల్చి చెప్పింది. సముద్రాలు ఉండేవ నడానికి అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించింది.

**3.5 నుంచి 4 బిలియన్ సంవత్సాల కిందట..**

నాలుగు బిలియన్ సంవత్సరాల కిందట అచ్చంగా భూమిని పోలి ఉండే రాతి పొరలు, ఇసుక తిన్నెలు, సముద్రాలు ఉండేవని, డెల్టా ప్రాంతాల తరహా వాతావరణం అంగారక గ్రహంపై గుర్తించామని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ జియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బెంజమిన్ కార్డెనాస్ తెలిపారు. మార్స్‌పై గాలి దాని వల్ల సంభవించే అలలు, ఇసుక తిన్నెలకు కొరత ఉండేది కాదని చెప్పారు.



**పరిశోధనలా సాగించిన వైనం..**

తియాన్వెన్ 1 మిషన్‌లో భాగంగా మార్స్‌పై ఉటోపియా ప్లానీటియా ఏరియాలో ల్యాండ్ అయిన ఝురాంగ్ రోవర్.. ఉపరితలం నుంచి 260 అడుగుల అంటే దాదాపుగా 80 మీటర్ల మేర స్కాన్ చేసింది. దీనికి సంబంధించిన సమగ్ర డేటాను గ్రౌండ్ స్టేషన్‌కు పంపించింది. భూమిపై తీరప్రాంతా ల్లో మాత్రమే కనిపించే ఖనిజాలు, ఇసుక, మం దంగా–వాలుగాఉండే పొరలు బయటపడ్డాయి.

**అలలు, ఆటుపోట్లు ఉంటేనే..**

అలలు, ఆటుపోట్లు ఉంటేనే అలాంటి పొరలు, దానికి సంబంధించిన నిర్మాణాలు ఏర్పడతాయని బెంజమిన్ కార్డెనాస్ విశ్లేషించారు. భూమిపై తొలి జీవం వృద్ధి చెందినప్పుడు ఎలాంటి వాతావరనం ఉండేదో.. అలాంటి వాతావరణం 3.5–4 బిలియన్ సంవత్సరాల కిందట మార్స్ పై ఉండేదని అన్నారు.

**సూక్ష్మజీవుల ఉనికి..**

అప్పట్లో సూక్ష్మజీవుల ఉనికి, అవి దీర్ఘకాలం పాటు జీవించి ఉండటానికి గల అనుకూల వాతావరణ పరిస్థితులను ఒకప్పుడు మార్స్‌పై ఉండేవనడానికి బలమైన సాక్ష్యాలు వెలుగులోకి వచ్చినట్టయిందని కార్డినెస్ చెప్పారు. మార్స్– ఒకప్పుడు నివాసయోగ్యంగా ఉండేదనే విషయాన్నీ కొట్టిపారేయలేమని చెప్పారు.

**అన్ని ఆధారాలు..**

భూమిపై తీర ప్రాంతాల్లో ఏ తరహాలో గాలుల తీవ్రత ఉంటుందో అలాంటి వాతావరణమే మార్స్‌పై ఉండేదని, బలమైన గాలులు వీచినప్పుడే అలలు ఉవ్వెత్తున ఎగుస్తాయని, ఇసుక తిన్నెలు ఏర్పడతాయని బర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్శిటీ ఎర్త్ అండ్ ప్లానెటరీ సైన్స్ ప్రొఫెసర్ మైఖేల్ మాంగా తెలిపారు.

**నదులు సైతం..**

మార్స్‌పై కొన్ని సంవత్సరాల పాటు మంచు రహిత సముద్రం ఉండేదని, విభిన్నమైన అవశేషాలు కొట్టుకువచ్చాయనడానికి ఆధారాలు లభించాయని మైఖెల్ మాంగా చెప్పారు. నదులు విస్తారంగా ప్రవహించినప్పుడే ఇలాంటి వేర్వేరు ఖనిజాలు, ఇతర అవశేషాలు లభించగలవని పేర్కొన్నారు.

# ఈ ఫుడ్స్ తిన్నారో 20లో వాళ్లకి 60 ఏళ్ల వృద్ధాప్య లక్షణాలు.. జాగ్రత్త మరి!

కొంతమందికి చిన్న వయస్సే ఉన్నా చూడడానికి పెద్దవారిలా కనిపిస్తారు. ఈ వృద్ధాప్య లక్షణాలకు అనేక కారణాలు ఉన్నాయి. వాటిల్లో మనం తీసుకునే ఆహారాలు కూడా ఉన్నాయి. కొన్ని ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల వృద్ధాప్య ప్రక్రియ వేగవంతం అవుతుంది. యవ్వనంగా కనిపించకుండా చేస్తాయి. ఈ ఆహారాలు శరీరంలో మంటను పెంచడం, కణాలను దెబ్బతీయడం , వృద్ధాప్య సంబంధిత వ్యాధులకు దారితీయడం వంటి అనేక విధాలుగా పనిచేస్తాయి. వృద్ధాప్య లక్షణాలను పెంచే కొన్ని ముఖ్యమైన ఆహారాల గురించి ఇక్కడ తెలుసుకుందాం..

**చక్కెరలు అధికంగా ఉండే ఆహారాలు,పానీయాలు :** చక్కెరలు ఎక్కువగా ఉండే ఆహారాలు, ముఖ్యంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు , పానీయాలు వృద్ధాప్యానికి ప్రధాన కారణం. చక్కెరలు శరీరంలో గ్లైకేషన్ అనే ప్రక్రియను ప్రేరేపిస్తాయి. ఈ ప్రక్రియలో చక్కెరలు ప్రోటీన్లతో కలిసిపోయి ఏజీఈలు (అడ్వాన్స్‌డ్ గ్లైకేషన్ ఎండ్ ప్రొడక్ట్స్) ఏర్పడటానికి కారణమవుతాయి. ఈ ఏజీఈలు చర్మం యొక్క స్థితిస్థాపకతను తగ్గించి, ముడతలు, చర్మం వదులుగా మారడానికి దారితీస్తాయి. అంతేకాకుండా, చక్కెరలు అధికంగా ఉండే ఆహారాలు శరీరంలో మంటను పెంచుతాయి, ఇది వృద్ధాప్య సంకేతాలను మరింత తీవ్రతరం చేస్తుంది. ఉదాహరణకు, సోడాలు, జ్యూస్‌లు, స్వీట్లు, కేకులు, కుకీలు , ప్రాసెస్ చేసిన స్నాక్స్ వంటివి వృద్ధాప్య లక్షణాలను పెంచుతాయి.

**ప్రాసెస్ చేసిన ఆహారాలు:** ప్రాసెస్ చేసిన ఆహారాలలో సాధారణంగా అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర, అనారోగ్యకరమైన కొవ్వులు , రసాయన సంకలనాలు ఉంటాయి. ఈ ఆహారాలు శరీరంలో మంటను పెంచుతాయి. కణాల నష్టానికి కారణమవుతాయి. ఇవి చర్మం యొక్క ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి, ముడతలు , ఇతర వృద్ధాప్య సంకేతాలను పెంచుతాయి. ప్రాసెస్ చేసిన మాంసాలు, రెడీ–టు–ఈట్ మీల్స్, చిప్స్, ఫాస్ట్ ఫుడ్ వంటివి వృద్ధాప్య లక్షణాలను వేగవంతం చేసే ఆహారాలలో



ముఖ్యమైనవి.

**వేయించిన ఆహారాలు:** వేయించిన ఆహారాలలో ట్రాన్స్ ఫ్యాట్స్, అధిక మొత్తంలో సంతృప్త కొవ్వులు ఉంటాయి. ఈ కొవ్వులు శరీరంలో మంటను పెంచుతాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడానికి కారణమవుతాయి. వేయించిన ఆహారాలు ఫ్రీ రాడికల్స్‌ను కూడా ఉత్పత్తి చేస్తాయి, ఇవి కణాలను దెబ్బతీసి వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేస్తాయి. ఫ్రైడ్ చికెన్, ఫ్రెంచ్ ఫ్రైస్, డోనట్స్, ఇతర డీప్ ఫ్రైడ్ స్నాక్స్ వంటివి వృద్ధాప్య లక్షణాలను పెంచే ఆహారాలకు ఉదాహరణలు.

**అధికంగా ఆల్కహాల్:** అధికంగా ఆల్కహాల్ తీసుకోవడం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది, ఇది చర్మాన్ని పొడిగా , ముడతలుగా చేస్తుంది. ఆల్కహాల్ కాలేయానికి కూడా హానికరం, ఇది శరీరంలోని విష పదార్థాలను తొలగించే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఇది చర్మం , శరీర ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

**శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు:** తెల్ల బియ్యం, మైదా పిండితో చేసిన ఆహారాలు , తెల్ల బ్రెడ్ వంటి శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతాయి. ఇది గ్లైకేషన్ ప్రక్రియను ప్రేరేపిస్తుంది, వృద్ధాప్య లక్షణాలను పెంచుతుంది. వీటి బదులుగా, తృణధాన్యాలు , సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు.

**ట్రాన్స్ ఫ్యాట్స్:** ట్రాన్స్ ఫ్యాట్స్ ప్రాసెస్ చేసిన ఆహారాలు, వేయించిన ఆహారాలు, కొన్ని రకాల మార్గారిన్‌లలో కనిపిస్తాయి. ఇవి శరీరంలో మంటను పెంచుతాయి , గుండె జబ్బులు , ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి ఇవి చర్మం యొక్క స్థితిస్థాప కతను కూడా తగ్గిస్తాయి, ముడతలు, వృద్ధాప్య సంకేతాలను పెంచుతాయి. వృద్ధాప్య సంకేతాలను తగ్గించడానికి, ఆరోగ్యకరమైన యవ్వన రూపాన్ని పొందడానికి, ఈ ఆహారాలను వీలైనంత వరకు తగ్గించడం లేదా పూర్తిగా నివారించడం చాలా ముఖ్యం. పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు వంటి పోషకమైన ఆహారాలను తీసుకోవడం వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదించడంలో సహాయపడుతుంది.

# జామపండుతో ఆరోగ్య అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు!

**జామ పండులో ఫుల్ పోషకాలు :** జామ పండులో విటమిన్ సి, విటమిన్ ఏ, విటమిన్ కే, కేలరీలు, పొటాషియం, కార్బోహైడ్రేడ్లు, డైటరీ ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో తక్కువ క్యాలరీలు, ఫైబర్ అధిక ంగా ఉంటుంది. ఈ కారణంగా వీటిని ప్రతి రోజు తింటే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబు తన్నారు. జామ పండు తినడం వల్ల మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

**జామపండుతో రక్తపోటుకు చెక్ :** జామపండులో ఉండే పొటాషియం, సోడియం కారణంగా ఇది అధిక రక్తపోటును తగ్గించడానికి ఉపయోగపడుతుంది. జామ పండు గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. జామపండు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచేందుకు సహాయపడుతుంది. జామపండులో తక్కువ క్యాలరీలు ఉండడం వల్ల ఇది బరువు తగ్గడానికి ఎంతగానో దోహదం చేస్తుంది

**కంటి ఆరోగ్యాన్ని కాపాడే జామపండు :** జామ పండులో ఉండే ఫోలేట్ మన పునరుత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పీరియడ్స్ సమయంలో మహిళలకు వచ్చే నొప్పిని తగ్గిస్తుంది.జామపండు దృష్టిని మెరుగుపరుస్తు ంది. కంటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న జామపండును రోజుకు ఒకటి తింటే ఎంతో మంచిది. దీనివల్ల మనకు ప్రయోజనమే కానీ నష్టం లేదు.

**మెదడు పనితీరుకు, చర్మ ఆరోగ్యానికి జామపండు జామపండు నరాలకు పట్టుత్వాన్ని ఇస్తుంది :** మెదడు చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. జామ పండులో విటమిన్ కే, విటమిన్ బి త్రీ పుష్కలంగా ఉండడం వల్ల ఇది మెదడు పనితీరును



మెరుగుపరుస్తుంది. జామ పండులో లైకోపీన్, కెరోటిన్, విటమిన్ ఏ, విటమిన్ సి పుష్కలంగా ఉండడం వల్ల ఇది మన చర్మ సంరక్షణకు ఎంతగానో దోహదం చేస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి ముడతలు తగ్గించడానికి ఉపయోగపడుతుంది.

# ఇంజినీరింగ్ ఫీజుల మోత!

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ఫీజుల మోత మోగనున్నది. భారీగా ఫీజుల పెంపునకు రంగం సిద్ధమైంది. ట్యూషన్ ఫీజుల పెంపునకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్ఆర్సీ) చేపట్టిన కసరత్తు చివరిదశకు చేరింది. ఇప్పటికే కాలేజీల నుంచి ప్రతిపాదనలు స్వీకరించిన టీఏఎఫ్ఆర్సీ మంగళవారం నుంచి కాలేజీల వారీగా విచారణ చేపట్టనున్నది.

**ట్యూషన్ ఫీజుల పెంపునకు రంగం సిద్ధం**

**నేటి నుంచి టీఏఎఫ్ఆర్సీ విచారణలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 :** రాష్ట్రంలో ఇంజినీరింగ్ ఫీజుల మోత మోగనున్నది. భారీగా ఫీజుల పెంపునకు రంగం సిద్ధమైంది. ట్యూషన్ ఫీజుల పెంపునకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్ఆర్సీ) చేపట్టిన కసరత్తు చివరిదశకు చేరింది. ఇప్పటికే కాలేజీల నుంచి ప్రతిపాదనలు స్వీకరించిన టీఏఎఫ్ఆర్సీ మంగళవారం నుంచి కాలేజీల వారీగా విచారణ చేపట్టనున్నది. మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో రోజుకు 19–20 కాలేజీల




ఫీజులపై విచారించనున్నది. సాధారణంగా ఇంజినీరింగ్ కోర్సుల ట్యూషన్ ఫీజులను మూడేండ్లకోసారి పెంచుతున్నారు. చివరగా 2022–23లో పెంచగా.. 2024–25 విద్యాసంవత్సరంతో గడువు ముగిసింది. 2025–28 బ్లాక్ పీరియడ్‌కు ఫీజులు పెంచేందుకు టీఏఎఫ్ఆర్సీ ప్రతిపాదనలు స్వీకరించగా, రాష్ట్రంలోని 163 కాలేజీలు ఫీజుల సవరణకు దరఖాస్తు చేసుకోగా, 19 కాలేజీలు చేసుకోలేదు.నేడు 19 కాలేజీలపై విచారణ..ఫీజుల సవరణపై టీఏఎఫ్ఆర్సీ మంగళవారం19కాలేజీలను విచారించనున్నది.

**పలు కాలేజీల ప్రతిపాదిత ఫీజులు..**

| కాలేజీ | ప్రతిపాదిత ఫీజు |
|---|---|
| సీబీఐటీ | 2,94,614 |
| వీఎన్నార్ విజ్ఞానజ్యోతి | 2,84,200 |
| ఎమ్జీఐటీ | 2,45,000 |
| వాసవి | 2,16,000 |
| ఎస్సార్ | 2,00,000 |
| సీవీఆర్ | 1,98,000 |
| వర్ధమాన్ | 1,90,000 |
| గోకరాజు రంగరాజు | 1,90,000 |

వీటిలో అనురాగ్, అరోరా, అవంతి, బీవీ రాజు, ఏవీఎన్, బాలాజీ, మహావీర్, అబ్దుల్ కలాం, ఏస్, ఐజా, అన్నమాచార్య, అనుబోస్, అర్జున్ తదితర కాలేజీలు ఉన్నాయి. ఈ నెల 27న, మార్చి 1, 4, 5, 7, 8, 10 తేదీల్లో రోజుకు కొన్ని కాలేజీల చొప్పున విచారించనున్నారు. కాలేజీలు సమర్పించిన ఆదాయం, ఖర్చుల ఆధారంగా ఆడిటర్లు కాలేజీలను విచారిస్తారు.

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక





# తెగ కష్టపడ్డ టీమిండియా బౌలర్లు

మూడు రోజుల్లో ముగిసిపోతుందని అనుకున్న రెండో టెస్టుని నాలుగో రోజు దాకా తీసుకొచ్చింది వెస్టిండీస్.. ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించుకోవడమే కష్టమనుకుంటే.. ఏకంగా 121 పరుగుల లక్ష్యాన్ని భారత్ ముందు ఉంచింది. 311 పరుగుల వద్ద 9వ వికెట్ పడితే ఆఖరి వికెట్ తీసేందుకు 22 ఓవర్లు పాటు ఆపసోపాలు పడింది భారత జట్టు.. జాన్ కాంపెల్, షై హెూప్ సెంచరీలకు తోడు జస్టన్ గ్రీవ్స్, జేడన్ సీల్స్ ఆఖరి వికెట్‌కి జోడించిన 79 పరుగుల భాగస్వామ్యం కారణంగా రెండో ఇన్నింగ్స్‌లో 118.5 ఓవర్లు బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు, 390 పరుగులకి ఆలౌట్ అయ్యింది.తొలి ఇన్నింగ్స్ భారత జట్టు 518/5 పరుగులు చేయగా వెస్టిండీస్ 248 పరుగులకి ఆలౌట్ అయ్యింది. 270 పరుగులు వెనకబడిన వెస్టిండీస్, నాలుగో ఇన్నింగ్స్‌లో భారత్ ముందు 121 పరుగుల టార్గెట్ పెట్టింది.. వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ 40 పరుగులతో రాణించాడు. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్ 2 వికెట్లు తీయగా కుల్దీప్ యాదవ్, జస్ప్రిత్ బుమ్రా మూడేసి వికెట్లు తీశాడు. 33 ఓవర్లు బౌలింగ్ చేసిన రవీంద్ర జడేజా ఒకే వికెట్ పడగొట్టాడు. వాషింగ్టన్ సుందర్‌కి ఓ వికెట్ దక్కాయి.భారత జట్టు ఈ ఏడాది టెస్టుల్లో 10 సెంచరీలు అప్పగించింది. గత ఏడాది కూడా భారత్‌పై ప్రత్యర్థి బ్యాటర్లు 10 సెంచరీలు చేశారు. అయితే విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో ఆడిన 8 ఏళ్లలో భారత జట్టు... ఏ ఏడాది కూడా టెస్టుల్లో 10, అంతకంటే ఎక్కువ సెంచరీలు ఇచ్చింది లేదు.. వెస్టిండీస్ జట్టు, నేపాల్ చేతుల్లో టీ20 సిరీస్ ఓడి, ఇండియాలో అడుగుపెట్టింది. అలాంటి టీమ్‌పైన 10వ వికెట్ తీసేందుకు జస్ప్రిత్ బుమ్రా, జడేజా, సిరాజ్ వంటి స్టార్లు, సీనియర్ బౌలర్లు ఉన్న టీమ్.. తెగ కష్టపడడం చూసి టీమిండియా ఫ్యాన్స్ షాక్ అయ్యారు. వెస్టిండీస్‌పైనే ఇలా ఉంటే, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి టీమ్స్‌తో మ్యాచుల సమయంలో పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

# గెలుపు ముంగిట టీమిండియా!

**సరికొత్త హిస్టరీ లిఖించనున్న గిల్ సేన**

**విజయానికి మరో 58 పరుగుల దూరం**

**వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 ఆలౌట్**

**వికెట్ల వేటలో చెమటోడ్చిన భారత బౌలర్లు..**





వెస్టిండీస్‌తో రెండో టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. 121 పరుగుల లక్ష్యఛేధన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. విజయానికి మరో 58 పరుగుల దూరంలో నిలిచింది. క్రీజులో కేఎల్ రాహుల్(25 బ్యాటింగ్)తో పాటు సాయి సుదర్శన్(30 బ్యాటింగ్) ఉన్నాడు. దూకుడుగా ఆడే క్రమంలో వారికన్ బౌలింగ్‌లో యశస్వి జైస్వాల్(8) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు.అంతకుముందు 173/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌటైంది. జాన్ కాంప్‌బెల్(199 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లతో 115), షైహెూప్(214 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 103) సెంచరీలతో చెలరేగగా.. జస్టిన్ గ్రీవ్స్(85 బంతుల్లో 3 ఫోర్లతో 50 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు.జైడెన్స్ సీల్స్(32)తో కలిసి జస్టిన్ గ్రీవ్స్ ఆఖరి వికెట్‌కు 79 పరుగులు జోడించాడు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా(3/44), కుల్దీప్ యాదవ్(3/104) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్(2/43) రెండు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌కు చెరో వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 518/5 భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేయగా.. వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే.వెస్టిండీస్‌ను ఆలౌట్ చేసేందుకు భారత బౌలర్లు చెమటోడ్చారు. ముఖ్యంగా జాన్ కాంప్‌బెల్, షైహెూప్ జోడీని విడదీసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో 81.5 ఓవర్లు బౌలింగ్ చేసిన భారత బౌలర్లు తీవ్రంగా అలసి పోయారు. పిచ్ కూడా పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడం విండీస్‌కు కలిసొచ్చింది. కాంప్‌బెల్ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించాడు. సెంచరీ అనంతరం కాంప్‌బెల్‌ను జడేజా వికెట్ల ముందు బోల్తా కొట్టించడంతో వెస్టిండీస్ 252/3 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో షైహెూప్ 204 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతన్ని మహమ్మద్ సిరాజ్ క్లీన్ బౌల్డ్ చేయడంతో విండీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. రోస్టన్ చేజ్(40), టెవిన్ ఇమ్లాచ్(12), ఖారీ పీర్రె(0)లను కుల్దీప్ యాదవ్ ఔట్ చేయగా.. జోమెల్ వార్రికన్(3), అండర్సన్ ఫిలిప్(2)లను బుమ్రా పెవిలియన్ చేర్చాడు. ఈ పరిస్థితుల్లో జైడెన్ సీల్స్‌తో కలిసి జస్టిన్ గ్రీవ్స్ పోరాడాడు. దాంతో విండీస్ 361/9 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఈ జోడీ సాధికారి కంగా ఆడింది. ముఖ్యంగా జస్టిన్ గ్రీవ్.. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు.

# కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించనున్నాడా!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2008లో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గత 18 సీజన్లుగా ఆడుతున్న ఆటగాళ్లను తీసుకుంటే, ప్రస్తుతం ఎంఎస్ ధోని, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మాత్రమే మిగిలి ఉన్నారు. 44 ఏళ్ల ధోని గత సీజన్‌లో %జూఖ% జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయి 5 సంవత్సరాలు అయింది. కానీ, గత 5 ఐపీఎల్ సీజన్లలో ధోనీ ఆడుతూనే ఉన్నాడు. రాబోయే 19వ సీజన్‌లోనూ ధోనీ ఆడతారని సిగ్నల్ ఇచ్చారు. అయితే అతను కెప్టెన్‌గా ఉంటాడా.. లేదా వికెట్ కీపర్‌గా కొనసాగుతాడా అనేది తెలియాల్సి ఉంది. అతని కెప్టెన్సీలో ఇప్పటి వరకు 5 ఐపీఎల్ ట్రోఫీలు నెగ్గింది చెన్నై సూపర్ కింగ్స్ జట్టు. ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గత రెండు సంవత్సరాలుగా జట్టుకు ప్రభావవంతమైన ఆటగాడిగా ఉన్నాడు. అతను ఓపెనింగ్ స్లాట్‌లో స్థిరమైన ఆటగాడు. అదే సమయంలో, రాబోయే 2026 సీజన్ రోహిత్ శర్మ భవిష్యత్తును నిర్ణయించే సిరీస్ అవుతుంది. ప్రస్తుతం అతని వయస్సు 38 సంవత్సరాలు. అతని కెప్టెన్సీలోనూ ముంబయి జట్టు 5 ట్రోఫీలను గెలుచుకుంది. మరోవైపు, విరాట్ కోహ్లీ 2022 నుండి అంటే గత 4 సీజన్లలో ఓపెనర్‌గా ఉన్నాడు. విరాట్ కోహ్లీ గత ఏడాది తన తొలి ఐపీఎల్ ట్రోఫీని కూడా ముద్దాడాడు. ట్రోఫీ గెలిచిన తర్వాత ఏడ్చిన విరాట్ కోహ్లీ.. ఇంకా చాలా ఏళ్లు ఆట కొనసాగించాలని భావించాడు. ఈ పరిస్థితిలో 2026కి ముందు విరాట్ కోహ్లీ ఆర్సీబీ తో తన కాంట్రాక్ట్‌ను పొడిగించలేదని వార్తలు వినిపిస్తున్నాయి. దీని అర్థం అతను ఆర్సీబీతో ఎక్కువ కాలం ప్రయాణించకూడదని అనుకుంటున్నారట. త్వరలోనే విరాట్ కోహ్లీ అన్నీ ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఓ క్రికెట్ విశ్లేషకులు తన వ్యక్తిగత సోషల్ మీడియాలో ఇదే అనుమానాన్ని వ్యక్తం చేశారు. తాజాగా వచ్చిన సమాచారం మేరకు 2026కు సంబంధించి విరాట్ కోహ్లీ బ్రాండ్ ఒప్పందాన్ని కొనసాగించడం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ లేకుండానే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు రాబోయే ఐపీఎల్‌కు సిద్ధమవుతుందని ప్రచారం జోరుగా జరుగుతోంది. అలాగే, గత సీజన్‌లో కెప్టెన్సీని విరాట్ కోహ్లీకి ఇస్తామని మేనేజ్‌మెంట్ చెప్పిన క్రమంలో అందుకు దాన్ని తిరస్కరించినట్లు సమాచారం. కొత్త కెప్టెన్‌గా రజత్ పటిదార్‌ను ఎంపిక చేయమని సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. 2024లో భారత జట్టు ఐసీసీ టీ20 ప్రపంచ కప్ గెలిచిన తర్వాత విరాట్ కోహ్లీ టీ20ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. అదే విధంగా ఈ ఏడాది టెస్టు క్రికెట్‌కు కూడా తాను రిటైర్మెంట్ ప్రకటించారు విరాట్ కోహ్లీ. దీని అర్థం విరాట్ కోహ్లీ వన్డేలు.. ఐపీఎల్‌లో మాత్రమే ఆడతాడని. 2027 ఐసీసీ ప్రపంచ కప్ వరకు విరాట్ కోహ్లీ ఆడటం కూడా సందేహమే. అలాంటప్పుడు, విరాట్ కోహ్లీ వన్డేలు ఆడే వరకు ఐపీఎల్‌లో ఆడతాడు. అతను దాని నుండి రిటైర్ అయితే, అతను ఐపీఎల్ నుండి కూడా రిటైర్ అయ్యే అవకాశం ఉంది. 2027లో విరాట్ కోహ్లీ ఐపీఎల్ నుంచి రిటైర్ అయ్యే అవకాశం ఉంది. 2028 ఐపీఎల్ సీజన్ కు ముందు మెగా వేలం జరగనుంది కాబట్టి, ఆ సమయంలో





విరాట్ కోహ్లీ తన రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉంది. అందువల్ల, విరాట్ కోహ్లీ 2026, 2027 ఐపీఎల్ సీజన్లలో ఆడతాడని ఆశించవచ్చు.

# దిగ్గజాలను వెనక్కినెత్తిన మంధానా





వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 5,000 పరుగులు చేసిన బ్యాటర్‌గా టీమిండియా బ్యాటర్‌గా స్మృతి మంధానా నిలిచింది. 2025 మహిళల ప్రపంచ కప్ 13వ మ్యాచ్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆమె ఈ ఘనత సాధించింది. ఈ మ్యాచ్‌లో స్మృతి మంధానా అర్ధ శతకం (80 పరుగులు) చేసింది. ప్రతికా రావల్‌తో కలిసి 155 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మంధానా వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా పరుగులు చేసిన విషయంలో విరాట్ కోహ్లీ, వివ్ రిచర్డ్స్‌ను కూడా అధిగమించింది. భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 330 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా జట్టు 49 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. భారత్ కు వరుసగా రెండో ఓటమి ఓదురైంది.విరాట్ కోహ్లీ , వివియన్ రిచర్డ్స్ వన్డే క్రికెట్‌లో 5,000 పరుగులు చేయడానికి 114 ఇన్నింగ్స్‌లు ఆడారు. అయితే స్మృతి మంధానా వన్డే కెరీర్‌లో 112వ ఇన్నింగ్స్‌లో 5 వేల పరుగులు పూర్తి చేసింది. మంధానా మహిళల వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 5,000 పరుగులు పూర్తి చేసింది. అంతకుముందు ఈ రికార్డు వెస్టిండీస్ దిగ్గజ బ్యాటర్ స్టెఫానీ టేలర్ పేరిట ఉంది, ఆమె 129 ఇన్నింగ్స్‌లలో ఐదు వేల పరుగుల మార్క్ చేరుకుంది. పురుషులు, మహిళల క్రికెట్ రికార్డులను పరిశీలిస్తే, స్మృతి మంధానా అత్యంత వేగంగా 5 వేల పరుగులు పూర్తి చేసిన వారిలో మూడో స్థానంలో నిలిచింది. ఈ విషయంలో బాబర్ ఆజం (97 ఇన్నింగ్స్‌లు), హాషీమ్ ఆమ్లా (101 ఇన్నింగ్స్‌లు) మాత్రమే మంధాన కంటే ముందున్నారు. మంధానా 112 ఇన్నింగ్స్‌లతో ఈ జాబితాలో 3వ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో బ్యాటింగ్ దిగ్గజాలైన వివ్ రిచర్డ్స్, విరాట్ కోహ్లీలు (114 ఇన్నింగ్స్)లను అధిగమించింది. ఒక క్యాలెండర్ సంవత్సరంలో 1,000 పరుగులు చేసిన ప్రపంచంలోని మొదటి మహిళా క్రికెటర్ స్మృతి మంధానా. ఆస్ట్రేలియాతో జరిగిన ప్రపంచ కప్ మ్యాచ్‌లో మంధాన ఈ ఘనత సాధించింది. ఈ విషయంలో ఆస్ట్రేలియాకు చెందిన బెలిండా క్లార్క్ రెండో స్థానంలో నిలిచింది. ఆమె 1997లో చేసిన 970 పరుగులు ఇప్పటివరకూ అత్యధికం. మంధానా ఈ ఏడాది వన్డేల్లో 4 సెంచరీలు చేసి తన బ్యాట్ తో రఫ్ఫాడిస్తోంది. ఈ క్రమంలో 2025లో అత్యధిక వన్డే పరుగులు చేసిన మహిళా క్రికెటర్‌గా నిలిచింది.

# సిక్సర్‌తో సెంచరీ పూర్తి చేసిన జాన్ క్యాంప్‌బెల్

వెస్టిండీస్ ఓపెనర్ జాన్ క్యాంప్‌బెల్ టీమిండియాపై అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఢిల్లీ టెస్ట్ మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించి జట్టుకు భారీ ఊరటనిచ్చాడు. 173 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో తన సెంచరీని పూర్తి చేసిన క్యాంప్‌బెల్.. ఆ మైలురాయిని సిక్సర్ కొట్టి అందుకోవడం విశేషం. ఈ సెంచరీ వెస్టిండీస్‌కు చాలా కీలకం. ఎందుకంటే, తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోర్‌కే ఆలౌట్ అయిన విండీస్.. ఇన్నింగ్స్ ఓటమి ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి ఈ సెంచరీ బాగా ఉపయోగపడింది.జాన్ క్యాంప్‌బెల్‌కు తన టెస్ట్ కెరీర్‌లో తొలి సెంచరీ కోసం చాలా కాలం వేచి ఉండాల్సి వచ్చింది. ఇందుకోసం అతను ఏకంగా 6 సంవత్సరాలు, 25 టెస్ట్ మ్యాచ్‌లు, 50 ఇన్నింగ్స్‌ల పాటు ఎదురుచూశాడు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో అతను మూడు సార్లు హాఫ్ సెంచరీలు సాధించినా, వాటిని సెంచరీగా మలచలేకపోయాడు. కానీ, భారత గడ్డపై రెండోసారి ఆడుతూ ఈ అరుదైన ఘనతను సాధించాడు. అంతకుముందు 2019లో లక్నోలో ఆఫ్ఘనిస్థాన్‌పై ఆడిన టెస్ట్‌లో అతని అత్యధిక స్కోరు 55 పరుగులు. ఢిల్లీ టెస్ట్ సెంచరీ కంటే ముందు అతని బెస్ట్ టెస్ట్ స్కోరు 68 పరుగులు మాత్రమే.జాన్ క్యాంప్‌బెల్ ఢిల్లీ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ మాత్రమే కాదు, తన సహచర బ్యాటర్ షే హెూప్‌తో కలిసి భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు ఏకంగా 295 బంతుల్లో 177 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. ఈ కీలకమైన, భారీ భాగస్వామ్యం కారణంగానే ఇన్నింగ్స్ ఓటమి ప్రమాదం అంచున ఉన్న వెస్టిండీస్ జట్టు ఆ ప్రమాదం నుంచి సులభంగా బయటపడగలిగింది. వారి ప్రదర్శన వెస్టిండీస్‌ను పోటీలో నిలబెట్టింది.జాన్ క్యాంప్‌బెల్ 199 బంతుల్లో 115 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. రవీంద్ర జడేజా బౌలింగ్‌లో అతను ఔట్ కావడంతో, వెస్టిండీస్ మూడో వికెట్ కోల్పోయింది. టెస్ట్ క్రికెట్‌లో ఇది క్యాంప్‌బెల్‌కు మొదటి సెంచరీ అయినప్పటికీ, అతని అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో ఇది రెండో సెంచరీ. అంతకుముందు వన్డే ఫార్మాట్‌లో అతను స్కాట్లాండ్‌పై సెంచరీ నమోదు చేశాడు.





# కెప్టెన్‌గా గిల్ చెత్త రికార్డ్





టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చెత్త రికార్డ్ నమోదు చేశాడు. 13 ఏళ్ల తర్వాత ప్రత్యర్థిని ఫాలో ఆన్ ఆడించి బ్యాటింగ్‌కు దిగిన తొలి కెప్టెన్‌గా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. వెస్టిండీస్‌తో న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో గిల్ ఈ చెత్త ఫీట్‌ను నమోదు చేశాడు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 518/5 భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకు ఆలౌట్ అయింది. దాంతో టీమిండియాకు 270 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. వెంటనే వెస్టిండీస్‌ను ఫాలో ఆన్ ఆడించిన టీమిండియాకు ఆ జట్టు నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైంది.తొలి ఇన్నింగ్స్‌లో 81.5 ఓవర్లు బౌలింగ్ చేసిన భారత బౌలర్లు తీవ్రంగా అలసిపోయారు. రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ బ్యాటర్లు ఔట్ చేసేందుకు తీవ్రంగా కష్టపడ్డారు. పిచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడంతో భారత బౌలర్ల కష్టాలు రెట్టింపు అయ్యాయి. జాన్ కాంప్‌బెల్(199 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లతో 115), షైహెూప్(214 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 103) సెంచరీలతో రాణించారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 177 పరుగులు జోడించారు. కాంప్‌బెల్‌కు ఇదే తొలి టెస్ట్ సెంచరీ కాగా.. 8 ఏళ్ల తర్వాత షైహెూప్ మరో శతకాన్ని అందుకున్నాడు.ఈ ఇద్దరి సూపర్ బ్యాటింగ్‌తో వెస్టిండీస్ ఈ మ్యాచ్‌లో టీమిండియా ఆధిక్యాన్ని అధిగమించి.. మళ్లీ బ్యాటింగ్ చేయాల్సిన పరిస్థితిని తీసుకొచ్చింది. 93 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ప్రత్యర్థిని ఫాలో ఆన్ ఆడించి నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం ఇది ఐదోసారి మాత్రమే.




## ఆనంద్ దేవరకొండ..తక్షకుడు

బేబి సినిమాతో సూపర్ హిట్టు కొట్టాడు ఆనంద్‌దేవరకొండ. ఆ తర్వాత వినోద్ అనంతోజ్ డైరెక్షన్‌లో నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. వినోద్ అనంతోజ్, ఆనంద్ దేవరకొండ కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ ఇద్దరూ ఈ సారి విభిన్న కథాంశంతో వస్తున్నట్టు తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ చెబుతోంది. ఆనంద్ దేవరకొండ నటిస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ సీరిస్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆనంద్ దేవరకొండ నక్సలైట్‌గా కనిపించబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వేటగాడి చరిత్రలో జింకలు దోషులు.. అనే క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో లాపతా లేడీస్ ఫేం నటాన్షి గోయెల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రీమియర్ డేట్‌తోపాటు ఇతర వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది ఆనంద్ దేవరకొండ టీం. తిరుగుబాటు ప్రతీకార డ్రామా నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంపై ఫస్ట్ లుక్‌తో అంచనాలు పెరిగిపోతున్నాయి. థియేటర్‌తో పాటు ఓటీటీలో విడుదలైన సినిమాలు కూడా ఆదరణ సొంతం చేసుకుంటోన్న విషయం తెలిసిందే. ఓటీటీ ట్రెండ్‌ను ఫాలో అవుతూ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇలా యాక్షన్ ఫిల్మ్‌తో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన ప్రధాన పాత్రలో రానున్న చిత్రం 'తక్షకుడు'. నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది. వినోద్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'వేటగాడి చరిత్రలో జింక పిల్లలే నేరస్థులు..' అంటూ ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

# ఒక్క ముద్దు సన్నివేశం లేదు

## తెలుసుకదా ట్రైలర్ విడుదలలో సిద్ధూ

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా రూపొందిన రొమాంటిక్ డ్రామా మూవీ 'తెలుసు కదా' రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీ అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో టీమ్ పంచుకున్న విశేషాలివి. సిద్ధూతో రొమాంటిక్ సినిమా తీయాలనే ఆలోచన ఎలా వచ్చిందన్న ప్రశ్నకుఈ కాన్సెప్ట్‌కు సిద్ధూ అయితేనే న్యాయం చేయగలరని అనిపించింది. ఈ సినిమా షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాం అని దర్శకురాలు నీరజ కోన అన్నారు. మొదట చూపిన ప్రచార చిత్రాలకు ఇప్పుడు రిలీజ్ చేసిన వాటికి సంబంధం లేనట్లు ఉంది? కావాలనే అలాంటి పోస్టర్స్ రిలీజ్ చేశారా? అని అడగ్గా కావాలని చేసింది కాదు. సినిమా ప్రారంభించినప్పటి నుంచి ప్రచార చిత్రాలు విడుదల చేస్తూ వచ్చాం అని సిద్ధూ అన్నారు. షూటింగ్ చేసే క్రమంలో కొన్ని మార్పులు చేశాం. అందుకే అలా డిఫరెంట్‌గా ఉన్నాయి. ట్రైలర్‌తో కథను చెప్పాలని అనుకున్నాం. దీపావళికి పోటీ చాలా ఉంది. ఆ సమయంలోనే విడుదల చేయడం రిస్క్ అనిపించడం లేదా? అంటే.. రిస్క్ ఉన్నచోటే విజయం ఉంటుంది. నా గత చిత్రం అనుకున్న స్థాయిలో అలరించలేకపోయింది. ఒక సినిమా నన్ను కింద పడేస్తే.. మరొకటి టాప్‌లో చేర్చుతుందని నమ్ముతాను. ఈ సినిమాలో పాత్ర 'టిల్లు' పాత్రను పోలి ఉందా? అని అంటే...దానికి, దీనికి సంబంధం ఉండదు. ఇందులో దానికి మించిన వినోదం ఉంటుందన్నారు. ఎప్పుడూ ఇద్దరు హీరోయిన్లతో మూవీ చేస్తున్నారని ఎందుకని అడిగితే...నేను ఇప్పటివరకూ ఇద్దరు హీరోయిన్లతో చేసింది ఒకే సినిమా 'కృష్ణా అండ్ హిజ్ లేడీ'. దానిలో ముగ్గురు హీరోయిన్లు ఉన్నారు. 'టిల్లు స్క్వేర్'లో అతిథి పాత్రలో మరో హీరోయిన్ ఉన్నారంతే. లవ్ స్టోరీ కాబట్టి దానికి తగినట్లే తెరకెక్కించారు. ఇందులో ముద్దు సన్నివేశాలు లేవు. ఒక్క ముద్దు సీన్ కూడా ఉండకూడదు అని కథ చెప్పినప్పుడే నీరజకు కండీషన్ పెట్టా. ఇది ఫ్యామిలీ మూవీ. ఇద్దరు హీరోయిన్లు, దర్శకురాలు, నిర్మాత.. అందరూ మహిళలే.. వాళ్లందరితో వర్క్ చేయడం సరదాగా అనిపించింది. రాశీ ఖన్నా అయితే క్లైమాక్స్‌లో నేను చేయను అని 40 నిమిషాలు సెట్ నుంచి వెళ్లిపోయింది. 'నా బాయ్‌ఫ్రెండ్ ఇలా చేస్తే నేను అంగీకరించను' అని పక్కకి వెళ్లి కూర్చొంది. ఇది కేవలం పాత్ర అని చెప్పి తీసుకొచ్చాను. సెట్‌లో 16 మంది మహిళలు ఉండేవారు. వాళ్లందరిలో నేను ఒక్కడినే ఉండేవాడిని. ఇకపోతే సినిమా అన్నాక.. డబ్బులు వస్తుంటాయి, పోతుంటాయి.. నాకు రికవరీ అనేది ఎమోషనల్‌గా కావాలి. ఫైనాన్షియల్‌గా కాదు. రవితేజతో గతంలో ఒక సినిమా ఎ÷–లాన్ చేశాం. కానీ, అది ఆగిపోయింది. ఒకవేళ మా ఇద్దరికీ సరిపోయే కథ ఉంటే కచ్చితంగా చేస్తాం అని సిద్ధూ అన్నారు.



# నేషనల్ క్రష్ ట్యాగ్.. షిఫ్ట్ ?



నేషనల్ క్రష్ అంటే చాలు.. ఎవరికైనా రష్మిక మందన్న పేరు వెంటనే గుర్తుకొస్తుంది. నార్త్ టు సౌత్.. వరుసగా బ్లాక్ బస్టర్ హిట్స్ తో దూసుకుపోతున్న అమ్మడు.. కొన్నాళ్లుగా నేషనల్ ట్యాగ్ తో సందడి చేస్తోంది. ఇప్పుడు ఆ ట్యాగ్ షిఫ్ట్ అవుతుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కొన్ని గంటలుగా సోషల్ మీడియాలో అదే ట్రెండ్ అవుతోంది. కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ సప్త సాగరాలు దాటి మూవీతో తెలుగు సినీ ప్రియులకు చేరువైన విషయం తెలిసిందే. తన అందం, అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించిన అమ్మడు.. ఇప్పుడు ఓ రేంజ్ లో దూసుకెళ్తున్నారు. వరుస ఛాన్సులు అందుకుని జోరు మీద ఉన్న ఆమె.. త్వరలోనే జూనియర్ ఎన్టీఆర్ మూవీతో టాలీవుడ్ లోకి రానున్నారు. రీసెంట్ గా రిలీజ్ అయ్యి బ్లాక్ బస్టర్ గా నిలిచిన కాంతార చాప్టర్ 1లో యువరాణి పాత్రలో అదరగొట్టారు. కనకవతిగా అమ్మడి యాక్టింగ్ కు అంతా ఫిదా అయ్యారు. యువరాణిగా చూపించిన గాంభీర్యానికి అట్రాక్ట్ అయ్యారు. క్లైమాక్స్ లో తనలోని టాలెంట్ మొత్తాన్ని బయటపెట్టి ఒక్కసారిగా తనవైపునకు అందరి దృష్టిని తిప్పుకున్నారనే చెప్పాలి. దీంతో ఇప్పుడు అంతా ఆమెను నేషనల్ క్రష్ అని పిలుస్తున్నారు. సోషల్ మీడియాలో కొన్ని గంటలుగా ఆ విషయాన్ని హ్యాష్ ట్యాగ్ తో ట్రెండ్ చేస్తున్నారు. ఇంకొందరు నెటిజన్లు.. రష్మిక ఫస్ట్ నేషనల్ క్రష్ అయితే రుక్మిణీ వసంత్ సెకండ్ నేషనల్ క్రష్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అమ్మడు పాన్ ఇండియా హీరోయిన్ అంటూ కితాబిస్తున్నారు. ఇక రుక్మిణీ వసంత్ విషయానికొస్తే.. కన్నడ మూవీ బీర్బల్ త్రయం మూవీతో సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత అప్పుడో ఇప్పుడు ఎప్పుడో సినిమాతో టాలీవుడ్ లోకి వచ్చింది అమ్మడు. కానీ సూపర్ హిట్ మూవీ సప్త సాగరాలు దాటితో తెలుగు ఆడియన్స్ కు చేరువైంది. విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు రుక్మిణి. ఇటీవల కోలీవుడ్ యంగ్ హీరో శివ కార్తికేయన్ మదరాసితో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. తన నటనతో ఆకట్టుకున్నారు. ఇప్పుడు ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో రూపొందుతున్న డ్రాగన్ మూవీలో యాక్ట్ చేస్తున్నారు. కన్నడ స్టార్ హీరో యష్ టాక్సిక్ లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పుడు మరిన్ని సినిమాల్లో నటించేందుకు సిద్ధమవుతున్నారు.



## సంక్రాంతికి వస్తున్నాం హిందీలో రీమేక్

తెలుగు బ్లాక్‌బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఇప్పుడు బాలీవుడ్‌లో రీమేక్ కానుందంటూ నెట్టింట పలు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో అనీల్ రావిపూడి తెరకెకక్కించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం గత సంక్రాంతి 2025 సందర్భంగా విడుదలై భారీ విజయాన్ని అందుకుంది . దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లతో ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. ఈ క్రమంలో చిత్రాన్ని బాలీవుడ్‌లో రీమేక్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు దిల్ రాజు. బాలీవుడ్ రీమేక్ స్టార్ అక్షయ్ కుమార్‌తో సంప్రదింపులు కూడా చేస్తున్నట్టు టాక్ నడుస్తుంది. అక్షయ్ కుమార్ ఇప్పటికే 'భూల్ భులయ్యా 2', 'రౌడీ రాథోర్', 'లక్ష్మి' వంటి దక్షిణాది రీమేక్‌లతో హిట్ ట్రాక్‌లో ఉన్నారు. అయితే ఇటీవల వరుస ఎ÷–లాపులతో అక్షయ్ కుమార్ కెరీర్ ఒడిదుడుకుల్లో సాగుతోంది. ఈ సమయంలో ఆయన మళ్లీ సౌత్ ఇండస్ట్రీ సూపర్ హిట్ చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' లాంటి కథను ఎంచుకుంటే సేఫ్ జోన్‌లో పడతాడని విశ్లేషకులు కూడా అంటున్నారు. బాలీవుడ్ ట్రేడ్ వర్గాల ప్రకారం, దిల్ రాజు ప్రస్తుతం ఈ సినిమాను హిందీలో నిర్మించేందుకు బాలీవుడ్ మేకర్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం . వెంకటేష్ చేసిన పాత్రకు అక్షయ్ కుమార్ సరైన ఎంపిక అని చాలా మంది భావిస్తున్నారు.తెలుగులో ఈ సినిమా విజయానికి కథ కంటే కూడా వెంకటేష్ టైమింగ్, కామెడీ టచ్, అనిల్ రావిపూడి మేకింగ్ ప్రధాన కారణాలుగా నిలిచాయి. అయితే బాలీవుడ్ ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కథ, స్క్రీన్‌ప్లేలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. అలాంటివి లేకపోతే , ఈ సినిమా డిజాస్టర్ అయ్యే అవకాశం ఉందని నెటిజన్ల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## అఖండ 2 కోసం పండిట్ మిశ్రా బ్రదర్స్

తెరపై నందమూరి బాలకృష్ణ తాండవం చేస్తూ శత్రు సంహారం చేస్తుంటే, నేపథ్యంగా గంభీర స్వరంలో వినిపించే సంస్కృత శ్లోకాలు ప్రేక్షకుల్లో ఉగ్రూతలూగించే అనుభూతిని కలిగిస్తాయి. అదే అనుభూతిని మళ్లీ పునరావృతం చేయడానికి సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ సన్నద్ధమవుతున్నారు.'అఖండ 2: తాండవం' సినిమా కోసం తమన్ ప్రత్యేకంగా పండిట్ శ్రవణ్ మిశ్రా, పండిట్ అతుల్ మిశ్రా సోదర ద్వయాన్ని రంగంలోకి దింపారు. సంస్కృత శ్లోకాలు, వేదమంత్రాల పఠనంలో నిష్ణాతులైన వీరి స్వరాలు సినిమాలోని బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌కి ఆధ్యాత్మికత, మహిమాన్వితత కలగజేస్తాయన్న నమ్మకంతో తమన్ ఈ ప్రయత్నం చేసినట్లు చిత్రబృందం వెల్లడించింది.బాలకృష్ణ కథానాయకుడిగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఆధ్యాత్మికతతో కూడిన యాక్షన్ విజువల్ స్పెక్టకిల్‌గా తెరపైకి రానుంది. సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు.




## కిరణ్ అబ్బవరం 'కె-ర్యాంప్' ట్రైలర్ కు భారీ రెస్పాన్స్

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'కె–ర్యాంప్'. ఈ సినిమా ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. విడుదలైన కొద్ది సమయంలోనే యూట్యూబ్‌లో 33 లక్షలకు పైగా వ్యూస్‌ను, 86 వేలకు పైగా లైక్స్‌ను సొంతం చేసుకుని సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ట్రైలర్‌కు వస్తున్న ఈ స్పందన సినిమాపై అంచనాలను పెంచుతోంది.ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన యుక్తి తరేజ హీరోయిన్‌గా నటించింది. జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌పై శివ బొమ్మాక్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.



Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com